www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 శనివారం

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 14, డిసెంబర్ 2024

సంపుటి: 6 సంచిక: 195, పేజీలు: 12, వెల: రూ.5/-



## రైతులకు ఆర్బీఐ శుభవార్త

- రైతులకిచ్చే రుణ పరిమితి పెంపు
- రూ1.60 లక్షల నుంచి రూ.2లక్షల పరిమితిని పెంపు
- ఉత్తర్వులు జారీచేసిన ఆర్బీఐ

**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):** రైతులకు ఆర్బీఐ శుభవార్త తెలిపింది. వ్యవసాయ అవసరాలకు, పంటల సాగుకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకులు ఇవ్వాల్సిన గరిష్ఠ రుణ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ1.60 లక్షల నుంచి రూ.2లక్షలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. వచ్చే నెల ఒకటిలోగా ఈ ఆదేశాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమల్లోకి తీసుకురావాలని ఆదేశించింది. రుణ పరిమితి పెంచినట్లు రైతులందరికీ తెలిసేలా అన్ని మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపింది.వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టేవారికి కూడా ఈ పెంపుదల వర్తిస్తుందని పేర్కొంది. పంటల సాగుకు రైతులు పెడుతున్న వ్యయం, ద్రవ్యోల్బణం పెరుగుదలను పరిశీలిస్తూ ఆర్బీఐ ఈ పరిమితిని పెంచుతూ వస్తోంది. 2004లో ఈ రుణం పరిమితి కేవలం రూ.10వేలే ఉంది. 20ఏళ్ల వ్యవధిలో రైతులకు పంట సాగు ఖర్చులు 20 రేట్లు పెరిగినట్లు అర్థమవుతుందని సీనియర్ బ్యాంకు ఉన్నాతాధికారి ఒకరు ఈటీవీ భారత్‌కు తెలిపారు.సాధారణంగా భూ యజమానులు పంట సాగుచేసినా సాగుచేయకున్నా బ్యాంకుల నుంచి పంటరుణం తీసుకుంటున్నారన్నారు. ఇందుకు ఎలాంటి పూచీకత్తును బ్యాంకులు తీసుకోవద్దని ఆర్బీఐ స్పష్టం చేసింది. అయినప్పటికీ కొన్ని బ్యాంకులు పాస్ పుస్తకాలను పూచీకత్తు కింద పెట్టుకుంటున్నాయని ఆగ్రహం మిగతా..2లో

## జూన్ 15న నీట్ పీజీ పరీక్ష



- నీట్ పీజీ 2025 పరీక్ష తేదీ ప్రకటన

**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):** దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక మెడికల్ విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించే నీట్ పీజీ పరీక్ష 2025 తేదీని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రకటించింది. వచ్చే ఏడాది మిగతా..2లో

## అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలమ్మ



- భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు
- ఫోర్బ్స్ 2024 జాబితా విడుదల

**న్యూఢిల్లీ,(వెలుతురు):** ఫోర్బ్స్ 2024 సంవత్సరానికి గాను విడుదల చేసిన ప్రపంచం లోనే అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో భారత్ నుంచి ముగ్గురు మిగతా..2లో

## అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు హైకోర్టు




- పుష్ప అరెస్ట్ 14 రోజుల రిమాండ్
- గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు
- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్
- సోమవారం విచారిస్తామన్న హైకోర్టు
- పుష్ప అరెస్ట్‌పై పిటిషనర్ ఆందోళన
- కేసు ఉపసంహరించుకుంటానని వీడియో విడుదల

మిగతా..2లో



# పల్లెల్లో ఫుల్-పట్నంలో డల్

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై మంత్రి పొన్నం ప్రభాకర్
- శుక్ర వారం సెక్రటేరియట్ లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమైన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు రాపోలు జయ ప్రకాశ్ , తిరుమలగిరి సురేందర్ , బాగ్య లక్ష్మి
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో తాజా పరిస్థితి పై చర్చ.
- సమగ్ర ఇంటింటి సర్వే లో ఇంకా ఎవరైనా సమాచారం ఇవ్వని వారు సమాచారం సేకరించేలా కుల సంఘాలు చొరవ తీసుకోవాలి
- పట్టణ ప్రాంతంలో సమాజాన్ని ప్రభావితం చేసే రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారస్తులు వివిధ రంగాల వారు ఇంకా సమాచారాన్ని ఇవ్వని వారు ఉంటే సమాచారాన్ని ఇవ్వాలని సమావేశంలో చర్చ
- కులాల వారిగా సంఖ్య తెలియకపోతే వాళ్ళకి రావాల్సిన పథకాలు రిజర్వేషన్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది.
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 13:** ఇంటింటి కుటుంబ కుల సర్వే లో పల్లె ప్రాంతాల్లో ప్రజలు ఉత్సాహంగా భాగస్వాములై సమాచారాన్ని ఇచ్చారని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు,పట్టణ ప్రాంతంలో ఇప్పటి వరకు కుల సర్వే లో సమాచారాన్ని ఇవ్వలేదో ఈ సమాచారం ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు,తప్పకుండా అన్ని కులాలకు సంబంధించిన సంఖ్య వారి బలం ప్రభుత్వ పథకాలు వారికి న్యాయబద్ధంగా అందాలంటే పూర్తి సమాచారం ఉండాలి కాబట్టి మీ ఇంటికి సమాచార సేకరణ అధికారి రాకపోయి ఉంటే వారిని పిలుచుకొని సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు,ఈ సమాచారాన్ని సామాజిక బాధ్యతగా ఇవ్వండంటూ మంత్రి ప్రభాకర్ కోరారు,

ముఖ్యంగా సమాజానికి మార్గదర్శకత్వం వహించే ప్రజా ప్రతినిధులు ఐఏఎస్,ఐపీఎస్ లు సమాజాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన వారు సర్వేలో భాగస్వాములు కావాలని కోరారు,గతంలో అనేక సందర్భాల్లో కుల సర్వే పై డిమాండ్ చేసిన కుల సంఘాలు దళిత, మిగతా..2లో

- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసిన సీఎం, రాష్ట్ర ఎంపీలు
- రాష్ట్రంలో నూతన రైల్వే మార్గాలను ఏర్పాటు చేయాలి
- దక్షణ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి కేంద్రం రైల్వే లైన్ల నిర్మాణం చేయాలి



# కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి: సీఎం రేవంత్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 13:** కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కేవలం కాజీపేట వాసుల కల మాత్రమే కాదని, యావత్ తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమని, దాన్ని సాకారం చేయడంలో కేంద్రం ముందుకు రావాలని సీఎం కోరారు.

రాష్ట్ర ఎంపీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ ను శుక్ర వారం నాడు కలిశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటును పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాజీపేటలో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పీవోహెచ్) వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించిందని గుర్తుచేస్తూ ఆ తర్వాత సైతం కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోరుతూ తాను లేఖ రాశానని ముఖ్య మంత్రి చెప్పారు.

అలాగే, వికారాబాద్ - కృష్ణా స్టేషన్ మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలు మార్గం నిర్మించాలని, తద్వారా ఇరు ప్రాంతాల మధ్య రావాణాకు 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని చెప్పారు. ఆ మార్గం నిర్మిస్తే దక్షిణ తెలంగాణలో మారుమూల వెనుకబడిన పరిగి, కొడంగల్ తదితర ప్రాంతాలన్నీ సిమెంట్ మిగతా..2లో



## రాష్ట్రంలోని పలు జాతీయ రహదారులకు అనుమతులు ఇవ్వండి: సీఎం రేవంత్ రెడ్డి

- రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి, పలువురు ఎంపీలతో కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 13:** తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం చేపట్టిన రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి (159 కి.మీ.) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని జాతీయ మిగతా..2లో

## ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణలో కేటీఆర్‌పై అవినీతి ఆరోపణలు


- కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ ఆమోదం



**హైదరాబాద్,డిసెంబర్ 13(వెలుతురు):** తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకోనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో అవినీతి ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆయనను విచారించేందుకు సన్నద్ధం అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ మిగతా..2లో

## అల్లు అర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం


- బట్టలు కూడా వేసుకోనీయకపోవడం దారుణం
- మండిపడ్డ హోంశాఖ సహాయమంత్రి బండి



**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):** సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టుపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. జాతీయ అవార్డు గ్రహీత అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన తీరు సరైనది కాదని మండిపడ్డారు. నేరుగా బెడ్‌రూంలోకి వచ్చి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. బట్టలు కూడా మార్చుకోనివ్వకుండా అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ భారత సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని బండి సంజయ్ తెలిపారు. అలాంటి వ్యక్తితో కాస్త మర్యాదగా వ్యవహరించాల్సిందని అభిప్రాయపడ్డారు. సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందడం నిజంగా విచారకరమని తెలిపారు. కానీ ఆ తొక్కిసలాటపూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందని

## ఈనెల 29న కొమరవెల్లి మల్లన్న కల్యాణం

- 19 జనవరి 2025 నుంచి జాతర ప్రారంభం
- 10 ఆదివారాలపాటు కొనసాగనున్న జాతర
- రాష్ట్ర దేవాదాయశాఖ నిర్ణయం



**చేర్యాల,డిసెంబర్ 13(వెలుతురు):** సిద్దిపేట జిల్లా చేర్యాలలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరలను వైభోవంగా నిర్ణయించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మిగతా..2లో

## రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి సీతక్క

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 13:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, అధికారులతో శుక్ర వారం నాడు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి సీతక్క డాక్టర్ బీఆర్ అంభేద్కర్ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు, ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల తిను బండారాలు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

అలాగే రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఫుడ్ కార్పొరేషన్ కు సంబంధించి అనేక అంశాలపై మంత్రి సీతక్క చర్చించారు.అలాగే ఈ సమావేశంలో మంత్రి సీతక్క కు ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్, అధికారులు పలు కీలక వినతులను చేశారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం ఏ ఫహీం తో పాటుగా



రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్‌కు సంబంధించిన ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి నేడు ఆకస్మిక తనిఖీలు

- నేడు ఏ గురుకుల పాఠశాలలో తనిఖీ చేస్తారో తెలియదు
- గోప్యంగా ఉంచిన సీఎం రేవంత్ తనిఖీ వ్యవహారం

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 13:** ఇటీవలి కాలంలో రాష్ట్రంలోని అనేక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు జరుగుతున్న ఆహారపు సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు, అందులో భాగంగానే శనివారం నాడు ముఖ్య మంత్రి హైదరాబాద్ జిల్లా తో పాటు చుట్టు పక్కల ఉన్న రంగారెడ్డి. వికారాబాద్, జిల్లాలలో ఎదో ఒక ప్రాంతంలో ఆకస్మికంగా గురుకుల విద్యాలయాలలో సీఎం రేవంత్ రెడ్డి తనికీ చేయనున్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీఎం తో పాటుగా మంత్రులు, అధికారులు పాల్గొంటారు, అలాగే గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటారు. అలాగే విద్యార్థులతో పాటు సీఎం, మంత్రులు మరియు అధికారులు కలిసి భోజనం చేస్తారు,కాగా సీఎం పర్యటన ను గోప్యంగా ఉంచుతామని ఆయన అక్కడ తనిఖీ చేస్తారో తెలియదని అధికారులు పేర్కొన్నారు..



## రాష్ట్రంలోని పలు జాతీయ రహదారులకు అనుమతులు ఇవ్వండి: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి గడ్కరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి లు సమావేశమై రాష్ట్రంలో పలు జాతీయ రహదారులు, ఇతర రహదారుల విస్తరణకు సంబంధించిన వివరాలను అందించి సత్వరం అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అలాగే వరంగల్ నగరానికి బైపాస్ రోడ్డు మార్గం, శ్రీశైలం - హైదరాబాద్ మార్గంలో అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్, హైదరాబాద్ - విజయవాడ మార్గాన్ని ఆరు వరుసలుగా విస్తరణకు సంబంధించి డీపీఆర్ ను ఆమోదించడం వంటి అనేక కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివేదించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన వారిలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ,మల్లు రవి ,సురేష్ షేట్కర్ ,పోరిక బలరాం నాయక్ ,చామల కిరణ్ కుమార్ రెడ్డి ,గడ్డం వంశీ ,రాయసాయం రఘురామిరెడ్డి ,కడియం కావ్య , ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి ఉన్నారు.

## కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి..

క్లస్టర్, ఇతర పరిశ్రమలు అభివృద్ధికి అవకాశం ఉంటుందని వివరించారు. కల్వకుర్తి-మాచర్ల మధ్య నూతన రైలు మార్గం మంజూరు చేయాలని సీఎం కోరారు.కల్వకుర్తి నుంచి వంగూరు-కందుకూరు-దేవరకొండ-చలకుర్తి-తిరుమలగిరి మీదుగా మాచర్ల వరకు తాము ప్రతిపాదించే నూతన మార్గం ప్రతిపాదిత గద్వాల-డోర్నకల్, ఇప్పటికే ఉన్న మాచర్ల మార్గాలను అనుసంధానిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. డోర్నకల్-మిర్యాలగూడ (పాపటపల్లి-జాన్ పహాడ్), డోర్నకల్-గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలని సీఎం కేంద్ర మంత్రి కి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు మార్గాల అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర ఎంపీ లు కడియం కావ్యా. చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు జైవీర్ రెడ్డి, బలరాం నాయక్, మల్లు రవి, రఘురాం రెడ్డి, సురేష్ షట్కర్, అనిల్ కుమార్ యాదవ్, గడ్డం వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 29న కొమరవెల్లి మల్లన్న కల్యాణం

మొదటిపేజీ తరువాయి..

సూచించారు. గురువారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లో మంత్రి సురేఖ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు.డిసెంబర్ 29 ఉదయం 10.45 గంటలకు మల్లికార్జున స్వామి వారి కల్యాణం జరగనుంది. జనవరి 19 నుంచి 10 వారాలపాటు మార్చి 23 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కల్యాణ వేదికను విశాలంగా తీర్చిదిద్దాలని ఈవోను మంత్రి సురేఖ ఆదేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనులపై ఆరా తీశారు. రూ. 9.776 కోట్లు ఎస్డిఎఫ్ నిధులు, రూ. 36.18 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో చేపడుతున్న కార్యక్రమాలను ఈవో.. మంత్రికి వివరించారు. కిరీటాల తయారీ పనుల పురోగతిలో వున్నట్లు తెలిపారు. భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, సిసి కెమరాల నిఘా, వివిఐపిలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు ఉండేలా చూడాలని మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. జాతర సమయానికి వేసవి కాలం రానుండటంతో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను సంపూర్ణంగా నిషేధించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మంత్రి అధికారులకు సూచించారు. జాతర జరుగుతున్నన్ని రోజులు సాయంత్రాల్లో కళాబృందాలచే ఒగ్గుకథ వంటి జానపద కళారూపాలను ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖకు ఆదేశాలివ్వాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. కల్యాణోత్సవానికి వారం రోజుల ముందే సర్వసన్నద్ధంగా వుండేలా కార్యాచరణను వెంటనే అమలుపరచాలని సూచించారు.కల్యాణంతో పాటు, జాతర జరిగినన్ని రోజుల దేవాలయాన్ని దేదీప్యమానంగా ముస్తాబు చేయడంతో పాటు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

## అల్లు అర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం

మొదటిపేజీ తరువాయి..

ఆరోపించారు. పుష్ప ది రైజ్ ఘన విజయం తర్వాత పుష్ప 2కి విపరీతమైన క్రేజ్ వచ్చిందని.. ఆ సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయని బండి సంజయ్ తెలిపారు. అలాంటి సమయంలో ఏర్పాటు చేసిన ఈవెంట్‌కు సరైన ఏర్పాట్లు చేయకపోవడం నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని చెప్పారు. ఈ ఘటనలో అల్లు అర్జున్‌ను నేరస్తుడిగా చూడొద్దని.. ఆయనకు కనీస గౌరవం ఇవ్వాలని హితవు పలికారు. తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో అల్లు అర్జున్‌ను ఇవాళ మధ్యాహ్నం చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్యక్ష సాక్షి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా సుమారు రెండు గంటల పాటు అల్లు అర్జున్‌ను పోలీసులు విచారించారు. బన్నీ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం చిక్కడపల్లి పీఎస్ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీని తర్వాత నాంపల్లి కోర్టుకు తీసుకెళ్లారు. కాగా, అల్లు అర్జున్ అంశంలో చట్ట ప్రకారం ఫాలో అవుతున్నామని పోలీసులు తెలిపారు.

## ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణలో కేటీఆర్‌పై అవినీతి ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి..

హయాంలో హైదరాబాద్ వేదికగా గతేడాది ఫిబ్రవరిలో ఫార్ములా ఈ-కారు రేస్ జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఫార్ములా ఈ-కారు రేసు నిధుల కేటాయింపులలో భారీ అవినీతి జరిగినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సంస్థ ఏసీబీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటికే ఉన్న ఇద్దరు పురపాలక శాఖ అధికారులతో పాటు అప్పట్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇద్దరు అధికారులపై విచారణకు అనుమతించింది. అలాగే ప్రజాప్రతినిధిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు కోసం అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరింది. దీనిపై న్యాయ సలహా మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కేటీఆర్‌ను విచారించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

## మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

### ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా

**హైదరాబాద్,డిసెంబర్ 13(వెలుతురు):** నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్‌బాబు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం తిరస్కరించింది. జల్‌పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద జరిగిన ఘర్షణపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టకుండా, తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన పిటిషన్ వేశారు. అయితే మోహన్‌బాబు అభ్యర్థనను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది.

# పల్లెల్లో ఫుల్-పట్నంలో డల్

మొదటిపేజీ తరువాయి..

గిరిజన ,బీసీ సంఘాలు అన్ని కూడా ఈ కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన తీసుకొని సమాజంలో భాగస్వామ్యులయ్యే సంచార జాతులు ,అన్ని వర్గాల వారు సమాచారం ఇచ్చే విధంగా భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు,ప్రభుత్వం కూడా సమాచార సేకరణ ద్వారానే నూతన పథకాలు ఇవ్వలనుకుంటుందని మంత్రి ప్రభాకర్ తెలిపారు,వారికి సమాచారం లేకపోతే భవిష్యత్ లో పథకాలకు కూడా ఇబ్బంది అవుతాదన్నారు,ప్రభుత్వ ఉద్యోగులు చురుగ్గా పాల్గొనాలన్నారు.

కుల సర్వే లో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే సమాచారం ఇవ్వాలని ఈ సమావేశం ద్వారా తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. నిరంజన్ బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సమగ్రకుల సర్వే జరుగుతుంది, ప్రభుత్వం అనేక వ్యయాయప్రయసలతో సుమారు 85 వేల మంది ఎన్యుమరెటర్స్ తో సర్వే నిర్వహిస్తుందని నిరంజన్ తెలిపారు



ప్రజలందరు చురుకుగా పాల్గొనాలి

ఏ ఉద్దేశ్యంతో అయితే ఈ సర్వే జరుగుతుందో అప్పుడే మన లక్ష్యం నెరవేరుతుందన్నారు,పూర్తిగా వివరాలు సేకరించ లేకుంటే ప్రజలకే నష్టంజరుగుతుందన్నారు,సమాజంలో ఎవరు ఎంత సంఖ్యలో ఉన్నారు ,అని తెలుసుకుంటేనే ఆయా వర్గాల వారు ఎంత సంఖ్యలో ఉన్నారు వారికి న్యాయం జరుగుతుందన్నారు.బీసీ లకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకోవాలన్న సర్వే ఒక ప్రధాన ఆధారం అవుతుందని నిరంజన్ తెలిపారు.నగరంలో అన్ని కాలని సంఘాల వారు కూడా సర్వే లో పాల్గొనాలని,కొన్ని కాలని లో సర్వే లో సమాచారం ఇవ్వడానికి వెనకడుగు వేస్తున్నారని తెలిపారు,ఆయా సంఘాలు అసోసియేషన్ వారు ప్రజలకు అవగాహన కల్పించి ఈ సర్వే లో పాల్గొనేలా చూడాలని సూచించారు,ఎవరైనా సమాచారం సేకరించకుంటే స్థానిక మున్సిపల్ సిబ్బందికి చెప్తే వారు సమాచార సేకరణ అధికారిని పంపిస్తారు

ఒక సామాజిక బాధ్యతగా ప్రతి పౌరుడిని గుర్తించాల్సిన అవసరం ఉందని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు, ఈ సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయ ప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి లు పాల్గొన్నారు.

# రైతులకు ఆర్బీఐ శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 30శాతానికి పైగా భూములను యజమానులు కౌలుకు ఇస్తున్నారు. కౌలుదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఉండవనే కారణంగా బ్యాంకులు వారికి పంటరుణాలు ఇవ్వడం లేదు. కౌలు రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో పూచీకత్తు అడగకుండానే పంటల సాగుకు రుణం ఇవ్వాలని ఆర్బీఐ ఎప్పటికప్పుడు ఇలా ఆదేశాలిస్తున్న చాలా బ్యాంకులు ఈ విషయాన్ని అమలు చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తాకట్టు లేకుండా కౌలు రైతులకు పంటరుణాలు అందక, ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని ఆర్థికభారంతో నలిగిపోతున్నారని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ఈటీవీ భారత్‌తో అన్నారు. వారికి కూడా పూచీకత్తు లేకుండా పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకులను కోరినట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మాదిరిగా ఎంతమందికి రుణాలు ఇచ్చారని కమిషన్‌కు వివరాలు అందజేయాలని బ్యాంకులను కోరినట్లు వివరించారు. భూమి ఉన్నా లేకున్నా వ్యవసాయ సంబంధ వ్యాపారం చేయాలి అనుకుంటే లేదా అగ్రి క్లినిక్ ఏర్పాటు చేయదలుచుకుంటే తాకట్టు లేకుండా రూ.5లక్షల వరకూ లోన్ ఇవ్వాలని 2004 మే 18న రిజర్వ్ బ్యాంకు ఆదేశాలిచ్చింది. అగ్రి క్లినిక్ అంటే పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలను రైతులకు ఇవ్వడమేకాకుండా వ్యవసాయనికి అవసరమైన అధునాతన సామగ్రిని విక్రయించడానికి నిరుద్యోగులు ఏర్పాటు చేసుకునే వ్యవసాయ సేవా సంస్థ. ఇలాంటి సేవా సంస్థలు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నాయి. నిరుద్యోగులు అటు రైతులకు సేవలందిస్తూ ఇటు స్వయం ఉపాధి పొందుతున్నారు. తెలంగాణలో బ్యాంకులు పూచీకత్తు లేకుండా ఈ రుణాలను ఇవ్వకపోవడం వల్ల వీటిని ఏర్పాటు చేయడం నిరుద్యోగులకు సాధ్యపడటం లేదని అధికారులు తెలిపారు.

## జూన్ 15న నీట్ పీజీ పరీక్ష

మొదటిపేజీ తరువాయి..

జూన్ 15వ తేదీన నీట్ పీజీ 2025 పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు నేషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు తన ప్రకటనలో పేర్కొంది. ఆ పరీక్షకు హాజరుకావాలనుకునే వారు వచ్చే ఏడాది జులై 31వ తేదీ నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుందని ఎన్‌బీఈ స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా సుమారు 52 వేల పీజీ సీట్లు ఉన్నాయి. వీటి కోసం సుమారు 2 లక్షల మంది ఎంబీబీఎస్ విద్యార్థులు పోటీపడుతున్నారు. మరోవైపు మెడికల్ విద్యా సంస్థల్లో జడలు విప్పుకొన్ని విలయతాండవం చేస్తున్న ర్యాగింగ్ భూతాన్ని అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, 2021లో జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని దేశంలోని అన్ని వైద్య కళాశాలలను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆదేశించింది.

సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) డిసెంబర్ 2024 పరీక్ష నేడు జరగనుంది. ఇప్పటికే ఈ పరీక్ష నిర్వహణకు సంబంధించి సీబీఎస్సీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వెబ్‌సైట్‌లో అడ్మిట్‌కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలతో వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి అడ్మిట్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సీట్ పరీక్షను ఓఎమ్మార్ ఆధారితంగా నిర్వహించ ున్నారు. కాగా సీటెట్ పరీక్ష ప్రతి యేట రెండుసార్లు జరుగుతుందన్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష మొత్తం రెండు పేపర్‌లకు ఉంటుంది. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించాలనుకునే వారికి నిర్వహిస్తారు. రెండో పేపర్ ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్‌స్కోర్‌కు లైఫ్‌లాంగ్ వ్యాలిడిటీ ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఉన్న 20 ప్రధాన భాషల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలకు తప్పనిసరి. తెలుగు రాష్ట్రాల్లో యేటా వేలాది మంది సీటెట్ పరీక్షకు హాజరవుతుంటారు.

## అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలమ్మ

మొదటిపేజీ తరువాయి..

మహిళలకు చోటు దక్కింది. వారిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అగ్రస్థానం సంపాదించుకున్నారు. వాస్తవానికి ఫోర్బ్స్ జాబితాలో నిర్మలా సీతారామన్ ఉండడం వరుసగా ఇది ఆరోసారి కావడం గమనార్హం. ఫోర్బ్స్ - ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో నిర్మలా సీతారామన్ 28వ స్థానంలో నిలిచారు. గతేడాది ఆమె 32వ స్థానంలో ఉండగా, ఇప్పుడు మరో నాలుగు స్థానాలు ఎగబాకడం విశేషం. ఇక, భారత్ నుంచి హెచ్‌సీఎల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ఈ జాబితాలో 81వ స్థానం దక్కించుకున్నారు. గతేడాది ఈమె 60వ స్థానంలో ఉన్నారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజూందర్ షా తాజా జాబితాలో 82వ స్థానంలో నిలిచారు. గతేడాది కూడా ఆమె ఫోర్బ్స్ శక్తిమంతమైన మహిళగా చోటు దక్కించుకున్నారు. ఫోర్బ్స్ జాబితాలో యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ దెర్ లెయెన్ మరోసారి అగ్రస్థానం దక్కించుకున్నారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధిపతి క్రిస్టినా లగార్డ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. బిల్‌గేట్స్ మాజీ భార్య మిలిందా ఫ్రెంచ్ గేట్స్ (8వ స్థానం), అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ మాజీ సతీమణి మెకంజీ స్కాట్ (9వ స్థానం), ప్రముఖ పాప్ గాయని టేలర్ స్విఫ్ట్ (23 వ స్థానం) లాంటివారు ఈ జాబితాలో ఉన్నారు. ఇండియాలో తొలి, పూర్తిస్థాయి ఆర్థికమంత్రి అయిన నిర్మలా సీతారామన్, రాజకీయాల్లోకి రాకముందు బ్రిటన్ అగ్రికల్చర్ ఇంజినీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వర్తించారు. హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్‌నాడార్ కుమార్తె రోష్నీ నాడార్ మల్హోత్రా. జులై 2020లో హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వ్యూహాత్మక నిర్ణయాలతో కంపెనీని అగ్ర పథంలో నడిపిస్తున్నారని ఫోర్బ్స్ తెలిపింది. 1978లో కిరణ్ మజూందర్ షా బయోకాన్‌ను నెలకొల్పారు. ఆ తర్వాత కాలంలో ఆమె భారత్‌లో అత్యంత సంపన్న మహిళల్లో ఒకరుగా ఎదిగారు. బయోకాన్‌కు మలేషియాలోని జొహొర్‌లో ఆసియాలోనే అతిపెద్ద ఇన్సులిన్ పరిశ్రమ ఉంది.

# అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు హైకోర్టు

**హైదరాబాద్,13(వెలుతురు):** సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంలో రోజంతా హైడ్రామా నడిచింది. ఆయనను అరెస్ట్ చేయడం, చంచల్‌గూడ జైలుకు తరలించడం, వెంటనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం వంటివన్నీ చకచకా సాగిపోయాయి. అరెస్ట్ చేసి జైలుకు తరలించిన అనంతరం తెలంగాణ హైకోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆయన అరెస్టయిన క్రమంలో అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ ఏ11గా పేర్కొన్న పోలీసులు.. మధ్యాహ్నం 1.30కి అరెస్టు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. క్వాష్ పిటిషన్‌పై విచారణ అత్యవసరం కాదని.. సోమవారం వినాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. అల్లు అర్జున్ అరెస్టయినందున బెయిల్ కోసం అవసరమైతే మరో పిటిషన్ వేసుకోవాలన్నారు. క్వాష్ పిటిషన్‌లోనే మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.'అల్లు అర్జున్ తన ప్రతి సినిమా విడుదల రోజున థియేటర్‌కు వెళ్తారు. థియేటర్ యాజమాన్యం, నిర్మాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. అల్లు అర్జున్ రాత్రి 9.40కి సంధ్య థియేటర్‌కు వెళ్లి మొదటి అంతస్తులో కూర్చున్నారు. తొక్కిసలాటలో మరణించిన మహిళ కింద అంతస్తులో ఉన్నారు' అని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. మధ్యాహ్నం అడగ్గానే లంచ్ మోషన్‌కు అనుమతివ్వడం తప్పుడు సంకేతం ఇస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చా లేదా అనే అంశంపై వాదించాలని ఈ సందర్భంగా హైకోర్టు పీపీకి సూచించింది. థియేటర్‌కు వెళ్లొద్దని అల్లు అర్జున్‌కు పోలీసులు ముందుగానే సమాచారం ఇచ్చారని పీపీ కోర్టుకు తెలిపారు. భారీగా జనం ఉంటారని తెలిసినప్పటికీ అల్లు అర్జున్ వెళ్లారని వివరించారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని క్వాష్ పిటిషన్‌లో ఎక్కడా కోరలేదని పీపీ వాదనలు వినిపించారు. క్వాష్ పిటిషన్‌పై అత్యవసర విచారణ అవసరం లేదని, సోమవారం విచారించాలని కోరారు. పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగినభద్రత ఇవ్వలేదని అల్లు అర్జున్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీసులు కూడా భద్రత కన్నా అల్లు అర్జున్‌ను చూసేందుకే ఎక్కువ ఉత్సాహం చూపారని తెలిపారు. అల్లు అర్జున్ భద్రత సిబ్బంది తోయడంతోనే తొక్కిసలాట జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడి భార్య మరణించింది. కుమారుడు వెంటిలేటర్‌పై ఉన్నాడని పీపీ కోర్టుకు వివరించారు. అందుకే అల్లు అర్జున్‌కు ఎలాంటి ఊరట ఇవ్వొద్దని పీపీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'ఎఫ్ఐఆర్‌ను పూర్తిగా కొట్టి వేయాలని పిటిషన్ వేశాం. పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే అరెస్టు చేశారు. అందువల్ల ఈ పిటిషన్ ద్వారానే మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చని గతంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. అర్ణబ్ గోస్వామి, మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో బాంబే కోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించడంతో వాటి ఆధారంగా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జైలు సూపరింటెండెంట్‌కు రూ.50వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కేసు దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేయవద్దని అల్లు అర్జున్‌ను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

రెగ్యులర్ బెయిల్ కోసం నాంపల్లి కోర్టును సంప్రదించాలని సూచించింది. అంతకుముందు తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కి బిగ్‌షాక్ తగిలింది. ఆయన్ను 14 రోజుల రిమాండ్‌కు తరలించాలని నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. దీంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. బన్నీ రావటం వల్లే తొక్కిసలాట ఘటన జరిగిందనీ, అందుకే ఆయన్ను అరెస్టు చేశామని పోలీసులు కోర్టుకు నివేదించారు. పోలీసుల వాదనతో



ఏకీభవించిన న్యాయమూర్తి అర్జునుకి రిమాండ్ విధించారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం నాడు ఆయన ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. పుష్ప-2 విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. అరెస్టు చేయడానికి తన ఇంటికి వచ్చిన పోలీసులకు అల్లు అర్జున్ సహకరించి స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటికే సంధ్య థియేటర్ యజమానితోపాటు అక్కడ సెక్యూరిటీ వారిని కూడా పోలీసులు అరెస్ట్‌చేశారు. వైద్య పరీక్షల కోసం అల్లు అర్జున్ ను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకుకెళ్లారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కు వైద్య పరీక్షలు ముగిశాయి. అనంతరం ఆయన్ను పోలీసులు నాంపల్లి క్రిమినల్ కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. గాంధీ ఆస్పత్రిలో అల్లు అర్జున్‌కు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, కొవిడ్-19 టెస్ట్ కూడా చేసినట్లు ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. అన్ని పరీక్షల్లో ఆయనకు సాధారణ ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహించామని, భద్రతా కారణాల రీత్యా ఆయనను సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ఆయన్ను నాంపల్లి క్రిమినల్ కోర్టుకు తరలించారు. అరెస్ట్ అంశంలో చట్టప్రకారం ముందు కెళ్తున్నామని పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షల సందర్భంగా గాంధీ ఆస్పత్రికి వచ్చిన అల్లు అర్జున్‌ను చూసేందుకు ఆయన అభిమానులు, రోగులకు సహాయంగా వచ్చిన వారి బంధువులు ఎగబడ్డారు. ఫొటోలు, వీడియోలు తీస్తూ కనిపించారు. ఆస్పత్రి సిబ్బంది కూడా అల్లు అర్జున్‌ను ఫొటోలు తీసేందుకు ఆసక్తి చూపారు. అనంతరం నాంపల్లి కోర్టుకు హాజరుపర్చారు. అల్లు అర్జున్‌పై పలు సెక్షన్లలో కేసు నమోదైంది. దీంతో ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుని ఆశ్రయించారు. పుష్ప 2 ప్రీమియర్ షోలు ఈనెల4న రాత్రి 9.30 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్దకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. సరిగ్గా అదే సమయంలో అల్లు అర్జున్ తన సతీమణి స్నేహతో కలిసి థియేటర్‌కు వచ్చారు. థియేటర్ యాజమాన్యం ముందస్తుగా ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఎలాంటి సెక్యూరిటీ ఏర్పాట్లు చేయలేదు. కాగా, బన్నీ రాకతో అక్కడ ఒక్కసారిగా సంభవించిన తొక్కిసలాటలో రేవతి (36) అనే మహిళ అక్కడికక్కడే మరణించగా, ఆమె కుమారుడు శ్రీతేజ గాయపడి, ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. ఇదిలావుంటే థియేటర్ వద్ద సంభవించిన తొక్కిసలాటకు గానీ, రేవతి మృతికి గానీ అల్లు అర్జున్‌కు సంబంధం లేదనీ, మృతురాలి భర్త భాస్కర్ మీడియాకు వెల్లడించారు. తమ కేసును ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించారు. అయితే, కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని హైదరాబాద్ సిపి సివి ఆనంద్ వెల్లడించారు. అయితే ఈ కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ బన్ని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఆయన్ను అదుపులోకి తీసుకున్న కొద్దిసేపటికే అల్లు అర్జున్ తరఫు న్యాయవాది దీనిని అత్యవసర పిటిషన్‌గా విచారించాలని న్యాయస్థానాన్ని కోరారు. 'అత్యవసర పిటిషన్‌ను ఉదయం 10.30 గంటలకే మెన్షన్ చేయాలి

కదా' అని ఈ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. బుధవారం రోజు పిటిషన్ ఫైల్ చేశామని, క్వాష్ పిటిషన్‌ను వేసినట్లు పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లామని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను సోమవారం విచారిస్తామని చెప్పింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా లంచ్ మోషన్ పిటిషన్‌గా స్వీకరించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. బుధవారం పిటిషన్ దాఖలు చేసి, నెంబర్ అయినా.. కోర్టు సిబ్బంది బిజీగా ఉండడం వల్ల లిస్టులోకి రాకపోయి ఉండొచ్చని వివరించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు లంచ్ మోషన్ పిటిషన్ విచారించాలనడం సరైనది కాదని ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. సోమవారం వరకూ ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టును కోరారు. అయితే, పోలీసుల నుంచి వివరాలు సేకరించిన తర్వాతే కోర్టుకు సమాచారం ఇస్తానని ప్రభుత్వ న్యాయవాది.. న్యాయస్థానానికి తెలిపారు. అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. దీంతో న్యాయస్థానం బన్ని పిటిషన్‌పై విచారణను సాయంత్రం 4 గంటలకు వాయిదా వేసింది. ఇదిలావుంటే సినీ నటుడు అల్లు అర్జున్‌పై నమోదైన కేసు మరో మలుపు తిరిగింది. తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన రేవతి భర్త భాస్కర్ స్పందించారు. ఈ కేసును విత్ డ్రా చేసుకుంటానని తెలిపారు. అల్లు అర్జున్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ ఘటనతో ఆయనకు సంబంధం లేదని పేర్కొన్నారు. 'నా కుమారుడు 'పుష్ప 2' సినిమా చూస్తానంటే సంధ్య థియేటర్‌కు తీసుకెళ్లా. ఇందులో అల్లు అర్జున్ తప్పేం లేదు. ఆయన్ను అరెస్టు చేయనున్నట్టు పోలీసులు నాకు సమాచారం ఇవ్వలేదు. ఆస్పత్రిలో ఉన్న నేను ఫోన్‌లో అరెస్టు వార్త చూశా. కేసు విత్‌డ్రా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నా' అని భాస్కర్ ఓ వీడియోలో పేర్కొన్నారు.



# ఏకగ్రీవంగా ఎన్నికైన కృష్ణయ్య

### ఆర్వో అధికారి నుంచి ధ్రువ పత్రం అందుకున్న కృష్ణయ్య

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 13:**
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి బీజేపీ పార్టీ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన నేత రాగ్య కృష్ణయ్య ఎన్నికెన్నారు.ఈ మేరకు ఆయన ఆర్వో నుంచి ధృవ పత్రాన్ని అందుకున్నారు,ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ వర్గానికి న్యాయం జరగాలని అన్నారు. బీసీ కులాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు, ఈ అవకాశం కల్పించిన బీజేపీ జాతీయ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు,కాగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మూడు అకగ్రీవం అయ్యా యి వీటిలో రెండు తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు, ఒకటీ బీజేపీ అభ్యర్థి ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

# పుష్ప అరెస్టు అభినందనీయం

- రీల్ హీరోను అరెస్టు చేసిన రియల్ పోలీసులు
- ప్రీమియర్ షోలకు అనుమతులివ్వొద్దు
- చిన్న సినిమాలకు ప్రోత్సాహకాలు ఇవ్వండి
- బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 13:**
పుష్ప హీరో అల్లు అర్జున్ ను అరెస్టు చేయడం అభినందనీయమని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం చిక్కడపల్లి పోలీస్ ఆవరణలో




ఆయన మీడియాతో మాట్లాడుతూ పెద్ద హీరోల ప్రీమియర్ షోలకు అనుమతులిచ్చి టికెట్ల రేట్లు ఇష్టానుసారం పెంచుకునే వెసులుబాటు కల్పించడంతో వారు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ అమాయక ప్రజల ప్రాణాలు బలితీసుకుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. పెద్ద సినిమాలను ప్రోత్సహించడం కాకుండా చిన్న సినిమాలకు ప్రోత్సాహకాలు అందిస్తే సినీ పరిశ్రమ నిలదొక్కుకుంటదని అభిప్రాయపడ్డారు. చిన్న సినిమాలకు ప్రోత్సాహకాలు అందిస్తే సినీ పరిశ్రమ నిలదొక్కుకుంటదని అభిప్రాయపడ్డారు.

తన సినిమా చూడటానికి వచ్చిన ఒక మహిళ తొక్కిసలాటలో చనిపోతే ఘటన జరిగిన రోజు స్పందించకుండా కనీసం వారిని పరామర్శించని అల్లు అర్జున్ ను బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి నేడు అరెస్టు చేస్తే పరిశ్రమ పెద్దలు ఏదో జరిగిపోయింది అని గగ్గోలు పెట్టడం సరికాదన్నారు.

రీల్ హీరోను అరెస్టు చేసిన రియల్ పోలీసులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ సమాజం హర్శిస్తుందని, ఒక సెలబ్రెటీని అరెస్టు చేయడం చట్టంపై ప్రజలకు నమ్మకం కలిగిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు గాలిగల్ల సాయిబాబా, శివశంకర్ గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టం తనపని తాను చేసుకు పోతుంది

### అల్లు అరెస్ట్ విషయం తన ప్రమేయం లేదు

### మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):**
టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసిన ఘటన సంచలనంగా మారింది. అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం





ఏమీ ఉండదని.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని.. మోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది.ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్‌ఎస్ 118 (1), బీఎన్‌ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరఫు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.






# సికింద్రాబాద్ లోని ఎన్ఐఈపీఐడీ (దివ్యాంగజన్)ని సందర్శించిన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి

### తెలంగాణాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను సమీక్షించిన శ్రీ అథవాలె

**హైదరాబాద్ వెలుతురు పిఐబి 13 డిసెంబర్ , 2024:**
దివ్యాంగులు ప్రత్యేక సామర్థ్యాలు గల వ్యక్తులని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి శ్రీ రామదాస్ అథవాలె అన్నారు. ప్రత్యేక నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకునేందుకు దివ్యాంగుల తల్లిదండ్రులు వారికి మార్గదర్శనం చేస్తూ సహాయపడాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు సికింద్రాబాద్ లోని ఎన్ఐఈపీఐడీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. మేధోపరమైన వైకల్యాలు కలిగిన వారి సాధికారత కోసం సికింద్రాబాద్ లో ఏర్పాటైన జాతీయ సంస్థ - ఎన్ఐఈపీఐడీ ని మంత్రి ఈరోజు సందర్శించి విద్యార్థులకు టీఎల్ఎం (బోధన, అధ్యయన సామగ్రి) కిట్లను పంచిపెట్టారు.

దివ్యాంగ జనుల గౌరవాన్నీ, ఆత్మాభిమానాన్నీ కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సమావేశాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మంత్రి పేర్కొన్నారు. 'వికలాంగులు' అనే పదం స్థానంలో' దివ్యాంగులు' అనే పదాన్ని వినియోగించడం... వైకల్యాలు కలిగిన వారిలోని ప్రత్యేక ప్రతిభను, సమాజానికి వారు అందిస్తున్న తోడ్పాటును గుర్తించడంలో సామాజికపరమైన వైఖరిలో వచ్చిన మార్పునకు సూచన అని కేంద్రమంత్రి అన్నారు. దివ్యాంగుల జీవితాలను మెరుగుపరిచేందుకు మోదీ ప్రభుత్వం అనేక విధానాలను పథకాలను అమలు చేస్తోందని శ్రీ అథవాలె వెల్లడించారు. సంస్థలో అమలవుతున్న కార్యక్రమాలను ప్రశంసించిన మంత్రి, సంస్థ గొప్ప సేవలను అందిస్తోందన్నారు. సామాజిక న్యాయం సాధికారతల మంత్రిత్వ శాఖ ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి, వయోవృద్ధులకు అవసరమైన సేవలను అందించేందుకు సదా సిద్ధంగా ఉందని తెలిపారు.

ఎన్ఐఈపీఐడీ సంస్థ డైరెక్టర్ శ్రీ బీవీ రామ్ కుమార్ కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. గౌరవనీయ మంత్రి మార్గదర్శనంలో తమ సంస్థ మేధోపరమైన వైకల్యాలు కలిగిన వారికి సేవలందిస్తోందని, మంత్రి సందర్శన సిబ్బంది, తల్లి






దండ్రులు, దివ్యాంగుల్లో స్ఫూర్తిని నింపుతుందని హర్షం వ్యక్తం చేశారు.సందర్శన సందర్భంగా క్రాస్ డిజెబిలిటీ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (ఒకే వ్యక్తిలో గల పలు వైకల్యాలను గుర్తించి అవసరమైన సహాయాన్ని అందించే కేంద్రం) సహా మంత్రి ఎన్ఐఈపీఐడీ సంస్థ అందిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలని సమీక్షించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు అవసరమైన సహాయ సామగ్రిని పంపిణీ చేసిన మంత్రి, వారి తల్లిదండ్రులతో సంభాషించారు.

అనంతరం, తెలంగాణా రాష్ట్రంలో అర్హులైన వారికి సాంఘిక న్యాయ, సాధికారత శాఖ పథకాల అమలు తీరుని సమీక్షించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సీనియర్ అధికారులతో శ్రీ అథవాలె సమావేశమయ్యారు. తదనంతరం ఏర్పాటైన పాత్రికేయుల సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ... షెడ్యూల్డు కులాలు, వెనకబడిన తరగతులు, వయోవృద్ధులు వంటి అణగారిన వర్గాల సంక్షేమం కోసం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారతల మంత్రిత్వశాఖ అనేక పథకాలను అమలుచేస్తోందని వెల్లడించారు. పౌరులందరికీ సామాజిక న్యాయం, సమానత, గౌరవం, సమాన అవకాశాలు కల్పించేందుకు శ్రీ మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలియజేశారు. ఆయా పథకాలు విజయవంతంగా అమలయ్యేందుకు అటు రాష్ట్ర ప్రభుత్వ, ఇటు ప్రభుత్వేతర సంస్థల (ఎన్జీవో) సహకారం సమానంగా అవసరమని వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లోనే అత్యధికంగా కారు ప్రమాదాలు

### మెట్రో నగరాల్లో అత్యధికంగా ప్రమాదాలు - వాహన బీమా సంస్థ ఆకో యాక్సిడెంట్ ఇండెక్స్ నివేదికలో వెల్లడి

**హైదరాబాద్,డిసెంబర్ 13(వెలుతురు):**
దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో గత రెండేళ్లలో హైదరాబాద్ మహానగరంలో అత్యధిక కారు ప్రమాదాలు జరిగినట్లు ప్రముఖ వాహన బీమా సంస్థ ఆకో యాక్సిడెంట్ ఇండెక్స్ -2024 పేరుతో తాజాగా నివేదికను విడుదల చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా దేశ రాజధాని దిల్లీ, పుణె, బెంగళూరు, కోల్‌కతా, ముంబయి, చెన్నై, అహ్మదాబాద్ నగరాలున్నాయని నివేదికలో పేర్కొంది. ఆ నివేదికలో ప్రస్తావించిన ప్రధానాంశాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. దేశవ్యాప్తంగా 78 శాతం రోడ్డు ప్రమాదాలు మెట్రో నగరాల్లోనే జరుగుతున్నాయి. 2022లో అత్యధిక కారు ప్రమాదాల్లో దిల్లీ మొదటి స్థానంలో ఉంటే ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంది. దిల్లీలో పోల్చుకుంటే హైదరాబాద్‌లో 46శాతం కార్లు తక్కువ. అయినా గత రెండేళ్లలో హైదరాబాద్‌లోనే ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి. హైదరాబాద్‌లో ప్రమాదాలను ఎక్కువ ఆస్కారమున్న ప్రాంతంగా మియాపూర్ నిలిచింది. దేశవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉంది. బెంగళూరులోని



బొమ్మనహళ్లి, దిల్లీలోని నోయిడా, పుణెలోని మరుంజి, ముంబయిలోని మిరారోడ్, చెన్నైలోని మెడవక్కం ప్రాంతాలు మొదటి 5స్థానాల్లో ఉన్నాయి. జంతువుల కారణంగా జరిగే గమనిస్తే శునకాలతో 62%, ఆవులతో 29%, బర్రెలతో 4%, కోతులతో 3%, మేకలతో 1% చొప్పున ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా నగర శివార్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం, నిద్రలేమి, డ్రైవింగ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం ఇందుకు కారణాలుగా తెలుస్తున్నాయి.

అలాగే మెట్రో నగరాలు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. ఉరుకులు పరుగుల సాగే రోడ్లపై ఎటు నుంచి ఎవరూ వస్తారో తెలియకపోవడం లాంటివి కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు. చలికాలం కావడంతో తెల్లవారుజామున పొగమంచు కురుస్తుంటుంది. దీంతో రోడ్లపై ఏం వస్తున్నాయో లేదో అన్నది దగ్గరకి వస్తే కానీ తెలియదు.

ఈ కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎక్కువే. అందుకు వాహనాలు నడిపించే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు చెబుతున్నారు. సూర్యోదయం అయ్యాకే రోడ్లపైకి రావాలని సూచిస్తున్నారు. పొగమంచు తగ్గిన తర్వాత ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం అని అంటున్నారు.

## అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై

# విపక్షాలు అభిశంసన తీర్మానం

### వీహెచ్‌పీ కార్యక్రమంలో వివాదస్పద వ్యాఖ్యల నేపధ్యం.

### రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేత

**అలహాబాద్,డిసెంబర్ 13(వెలుతురు):**
అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై ప్రతిపక్ష పార్టీలు అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టాయి. ఇటీవల జరిగిన వీహెచ్‌పీ కార్యక్రమంలో ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేశారని రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నోటీసును అందించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించడానికి సంబంధించిన నోటీసుపై కపిల్ సిబల్, దిగ్విజయ్ సింగ్, జాన్ బ్రిట్టాస్, మనోజ్ కుమార్ ఝా, చిదంబరం, రణ్ దీప్ సుర్జేవాలా, ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, ముకుల్ వాస్నిక్, నాసీర్ హుస్సేన్, రాఘవ్ చద్దా, సంజయ్ సింగ్, రేణుకా చౌదరి సహా 55 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేశారు. వీరందరూ కలిసి రాజ్యసభ సెక్రటరీ జనరల్ ను సభా కార్యక్రమాలు ప్రారంభానికి ముందు కలిశారు. ఈ క్రమంలో అభిశంసన నోటీసును అందజేశారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం 1968, రాజ్యాంగంలోని ఆర్టికల్ 218 కింద ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసును సమర్పించారు. విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని నోటీసులో విపక్ష సభ్యులు ఆరోపించారు. ద్వేషపూరిత ప్రసంగం, మత సామరస్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. న్యాయమూర్తి మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నారని, వారిపై పక్షపాతం చూపించారని తెలిపారు. "జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించిన విషయాలపై రాజకీయంగా మాట్లాడారు. బహిరంగంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇలా చేయడం న్యాయవ్యవస్థను ఉల్లంఘించినట్లే. జస్టిస్ శేఖర్ కుమార్ చేసిన బహిరంగ వ్యాఖ్యలు రెచ్చగొట్టేవిగా ఉన్నాయి. అలాగే పక్షపాతంతో కూడుకున్నవి" అని నోటీసులో పేర్కొన్నారు. "దేశంలోని మెజారిటీ ప్రజల ఇష్టానికి అనుగుణంగా





భారత్ పనిచేస్తుందని జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ అన్నారు. ఆయన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(ఈ) కింద పొందుపరచిన ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించారు. ఆయన వ్యాఖ్యలు వివిధ మతాలు, మత సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

రాజ్యాంగంలోని లౌకిక నీతిని ఉల్లంఘిస్తున్నాయి. ఈ నోటీసును ఆమోదించాలని రాజ్యసభ ఛైర్మన్ ను విజ్ఞప్తి చేస్తున్నాం. 1968 న్యాయమూర్తుల (విచారణ) చట్టం ప్రకారం భారత రాష్ట్రపతికి ఈ నోటీసును పంపాలి. ద్వేషపూరిత ప్రసంగం, న్యాయ ఉల్లంఘనల ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని రాజ్యసభ ఛైర్మన్ ను అభ్యర్థిస్తున్నాం. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ కు తొలగించాలి. " అని అభిశంసన నోటీసులో విపక్ష సభ్యులు పేర్కొన్నారు. డిసెంబర్ 8న జరిగిన వీహెచ్‌పీ కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి పౌరస్మృతి ప్రధాన లక్ష్యం సామాజిక సామరస్యం, లింగ సమానత్వం, లౌకికవాదాన్ని ప్రోత్సహించడమేనని అన్నారు. అలాగే మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే చట్టం నడుచుకోవాలని వ్యాఖ్యానించారు. దీంతో ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఈ క్రమంలో ఈ ఘటనపై నివేదిక సమర్పించాలని హైకోర్టును సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది.

# సంపాదకీయం

## ప్రార్థనా స్థలాల చట్టంపై పదే పదే చర్చ ఎందుకు?

భారతదేశం లౌకిక దేశం. పౌరులు స్వేచ్ఛగా తమ మతాలను ఆచరించవచ్చు. మత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడటం ప్రభుత్వాల విధి. అలాగే మతం ప్రాతిపదికన ప్రభుత్వాలు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదు. ఇక, మత స్వేచ్ఛకు సంబంధించిన ఎన్నో చట్టాలు ఉన్నాయి. వాటిలో ప్రముఖమైనది ప్రార్థనా స్థలాల చట్టం. 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు అస్థిత్వంలో ఉన్న మతపరమైన కట్టడాలు. వాటి గుర్తింపు, స్వభావాన్ని, నిర్మాణాన్ని రక్షించేందుకు ఉద్దేశించిన చట్టం ఇది. మతపరమైన కట్టడాలు అంటే అవి దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారా లు...ఏవైనా కావచ్చు, 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు వాటి స్వరూపం ఎలా ఉందో అలాగే కొనసాగించాలని ఈ చట్టం చెబుతోంది. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామ మంది రం నిర్మించాలని బీజేపీ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమం బలం పుంజుకోవడంతో కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1991లో 'ది ప్లేస్ ఆఫ్ వర్షిప్ (స్పెషల్ ప్రొవిజన్స్)' చట్టం తీసుకొచ్చింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ దీనిని గట్టిగా వ్యతిరేకించింది. 1991లో అమల్లోకి వచ్చిన ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు వాటిని విచారిస్తోంది. కాగా, మతపరమైన ప్రార్థనా స్థలాలను సర్వే చేయాలని కోరుతూ కొత్తగా దాఖలయ్యే పిటిషన్లను స్వీకరించరాదని, ప్రస్తుతం విచారణలో ఉన్న పిటిషన్లపై తాత్కాలిక లేదా తుది ఉత్తర్వులు జారీ చేయరాదని దేశంలోని అన్ని కోర్టులను సుప్రీంకోర్టు తాజాగా ఆదేశిం చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 చెల్లుబాటుపై విచారణ జరిపి, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు కోర్టులు సంయమనం పాటించాలని తెలిపింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో జ్ఞానవాపి, మథుర, సంభల్ సహా 10 మసీదులు, దర్గాలపై హిందూ పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిలిచిపోయింది. వీటి మతపరమైన అసలు స్వభావాన్ని తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఈ పిటిషనర్లు కోరుతున్నారు. సీజేఐ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 6 పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను ఇచ్చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 నిబంధన లను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ప్రార్థనా స్థలాల చట్టం1991 మీద దాఖలైన పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు చెప్పబోయే తీర్పు మీద దేశంలో ప్రస్తుతం వివాదంలో చిక్కుకున్న డజన్ల కొద్దీ ప్రార్థనాలయాల భవిష్యత్ ఆధారపడి ఉంది. ఇందులో ఎక్కువ భాగం కట్టడాలు ముస్లింలకు చెందినవి. వీటి మీద హిందూ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. కోర్టు కేసుల్లో చిక్కుకున్న వాటిలో జ్ఞానవాపి, షాహి ఈద్గా, వారణాసి, మథురలోని రెండు వివాదాస్పద మసీదులు ఉన్నాయి. రెండు వారాల కిందట అజ్మీర్ దర్గా విషయంలో దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అజ్మీర్‌లో ప్రతిరోజూ వేలమంది సందర్శించే 13వ శతాబ్దానికి చెందిన ఈ సూఫీ మందిరాన్ని హిందూ ఆలయం మీద నిర్మించారని కోర్టులో పిటిషన్ దాఖలైంది. నెల రోజుల కిందట ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ 16వ శతాబ్దానికి చెందిన మసీదులో సర్వే నిర్వహించాలని కోర్టు ఆదేశించడంతో హింస చెలరేగింది. ఇందులో నలుగురు మరణించారు. సర్వే నిర్వహించాలన్న కోర్టు నిర్ణయంపై ముస్లిం సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కోర్టులు సర్వేకు ఆదేశాలు జారీ చేసినప్పుడల్లా ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. జ్ఞానవాపి మసీదు విషయంలోనూ ఇదే జరిగింది. 17వ శతాబ్దంలో కాశీ విశ్వనాధుడి ఆలయాన్ని కూల్చివేసి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మసీదు నిర్మించారని హిందూ సంఘాలు ఆరోపించాయి. జ్ఞానవాపి మసీదులో సర్వే నిర్వహించాలన్న కోర్టు ఆదేశాలను ముస్లిం సంఘాలు వ్యతిరేకించాయి. ఇది 1991 ప్రార్థనా స్థలాల చట్టానికి విరుద్ధమనేది వారి వాదన. అయితే 2022లో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ సర్వేను ఆపాలని చెప్పలేదు. 1947 ఆగస్టు 15నాటికి ఉన్నప్రార్థనాలయాల స్వభావాన్ని మార్చడానికి ప్రయత్నించనంత వరకు, వాటిపై దర్యాప్తును 1991 చట్టం నిరోధించలేదని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. ఈ ఉత్తర్వులను అనేక మంది విమర్శించారు. వివిధ ఆరోపణల వల్ల స్థలాల చారిత్రక స్థితిని నిర్ణయించడం అనేది మతాల మధ్య ఘర్షణలను, హింసను రెచ్చగొట్టే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చట్టాన్ని తొలగించినా లేక బలహీనపరిచినా అది ఇలాంటి అనేక పిటిషన్లకు గేట్లు తెరవడం లాంటిదేనని ప్రతిపక్ష నాయకులు, ముస్లిం సంఘాల నేతలు భావిస్తున్నారు. దీని వల్ల దేశంలో హిందువులు, ముస్లింల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగే అవకాశం ఉందని అంటున్నారు.

## కాలం తాకిడిలో సోషలిజం స్ఫూర్తి..

దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రాజ్యాంగ వత్రోత్సవం ముందురోజైన నవంబర్ 25న ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని చెప్పాలి. రాజ్యాంగం అవతారిక (ప్రియాం బుల్)లో 42వ సవరణ ద్వారా చేర్చిన సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగించాలంటూ దాఖలైన కేసును కొట్టివేస్తూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజయ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ల ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో.. ఆ రెండు పదాల స్ఫూర్తిపై గత కొంత కాలంగా కొందరు చేస్తున్న అసంబద్ధ వాదనలను, వారు వ్యాప్తి చేసిన అయోమయాన్ని పటాపంచలు చేసినట్లయింది. దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరిస్తూ రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం' అని, కొన్ని మతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ 'సెక్యులర్' అని పేర్కొనడం హిపోక్రసీ (కపటత్వం) అని కొందరి వాదన. అందువల్ల ఆ రెండు పదాలను తొలగించాలంటూ 2020లో సుప్రీం కోర్టులో ఓ వ్యక్తి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దానికి అనుబంధంగా మాజీ రాజ్యసభ సభ్యులు సుబ్రమణ్యస్వామి కూడా మరొక దావా వేశారు. ఈ రెండింటిని కలిపి విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం సరైన సమయంలో సరైన తీర్పును ఇచ్చింది. తెలుగులో స్వామ్యవాదంగా పేర్కొనే సోషలిజం పెట్టుబడిదారీ విధానానికి పూర్తి వ్యతిరేకమని చాలామంది భావన. పెట్టుబడిదారీ విధానంలో సామాన్యులు నష్టపోతారని, సంపన్నులకే లాభం అని, అదే సోషలిస్ట్ సమాజంలో అయితే వర్గ విభేధాలు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిస్తారని అనేక సంవత్సరాలపాటు ప్రచారం జరిగిన మాట నిజం. నిజానికి 'సోషలిజం' కు విస్తృతార్థం ఉంది. దానిని గ్రహించలేనివారు దానిని తప్పుగా అన్వయించుకొని ఆ పదాన్ని, అదేవిధంగా సెక్యులర్ అనే పదాన్ని రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు సోషలిజం లేదా సోషలిస్ట్ అనే పదాల విస్తృతార్థాన్ని చక్కగా విడమర్చి వివరిస్తూ.. "సంక్షేమ రాజ్యానికి కట్టుబడి ఉండటం, సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం సోషలిజం విధానంగా చూడాలి. రాజ్యాంగ పీఠికలో 'సోషలిస్ట్' అనే పదం ఉన్నంత మాత్రాన ఏదో ఒక ప్రత్యేక ఆర్థిక విధానాన్ని అనుసరించాలని నిర్దేశించడం కాదు" అని చెప్పారు. సోషలిజం అనే భావనను చాలామంది పొరపాటుగా అర్థం చేసుకోవడం వెనుక చారిత్రక నేపథ్యం ఉంది. ముఖ్యంగా, బ్రిటన్, అమెరికాలు అనుసరించిన ఆర్థిక విధానాన్ని పెట్టుబడిదారీ విధానంగా, సోవియట్ రష్యా అనుసరించిన విధానాన్ని సోషలిస్ట్ విధానంగా పిలుచుకోవడం జరిగింది. 20 శతాబ్ది ప్రథమార్ధంలో, అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత్తోసహా ప్రపంచంలోని అనేక దేశాలు పలు పోరాటాలు చేశాయి. వర్ణవివక్ష, అణచివేత, హక్కుల ఉల్లంఘన, ఆర్థిక దోపిడీకి పాల్పడిన బ్రిటీష్ పాలకుల విధానాలను ఒక్క భారత్లోనే కాదు.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలు అనేకం తీవ్రంగా వ్యతిరేకించాయి.

అదే సమయంలో సోవియట్ రష్యాలో కార్మికవర్గం సంఘటితమై జరిగిన విప్లవం ఈ దేశాలకు స్ఫూర్తి నందించాయి. పేదరికం, పీడన, బానిసత్వం వదిలించుకోవడానికి ఉద్యమాలే మార్గంగా భావించి ఆ బాటనే పట్టాయి. రెండవ ప్రపంచయుద్ధంలో 'ఫాసిజం' ఓటమి చెందడంతో సోవియట్ రష్యా అనుసరించే సోషలిస్ట్ నమూనాకు తృతీయ ప్రపంచ దేశాలో సానుకూలత వ్యక్తం అయింది. అదొక ఆదర్శవాద విధానంగా చూడబడింది. ఆ సమయంలోనే దేశంలో ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తులు, పార్టీల కారణంగా పలు రకాల విధానాలు, పద్ధతులు కలగలిసినప్పటికీ ప్రధానంగా స్వామ్యవాద భావనలు, స్వామ్యవాద విలువలే ప్రజల్ని ఎక్కువగా ఆకర్షించాయి. జాతీయతా భావన అందరిలో పెల్లుబుకింది. స్వాతంత్రోద్య మంలో ప్రధాన భూమిక వహించిన కాంగ్రెస్ పార్టీ 1931లో చేసిన కరాచీ రిజల్యూషన్లో చాలా స్పష్టంగా తమ విధానాన్ని ప్రకటించింది. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన తర్వాత దేశ ప్రజల సామాజిక, ఆర్థిక సమానత్వానికి కట్టుబడి పని చేస్తామని తీర్మానించింది. స్వతహాగా సోషలిస్ట్ భావాలు గలిగిన డా? బి. ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యత స్వీకరించిన సందర్భంలో "దేశ ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యల పరిష్కారానికి సోషలిజం నిజమైన ఔషదాన్ని అందించగలదు" అని అన్నారు. రాజ్యాంగసభలో జరిగిన వాడివేడీ చర్చల సందర్భంగా డా? బి.ఆర్. అంబేద్కర్ తన వాదన వినిపిస్తూ "ఆర్థిక విధానం ఎంచుకొనే స్వేచ్ఛను ఇవ్వకుండా భవిష్యత్ తరాల చేతులు కట్టేయడం సరికాదు" అని అన్నారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక న్యాయం చేయడం అనే లక్ష్యం సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం ద్వారానే నెరవేరుతుంది కనుక ప్రత్యేకంగా 'సోషలిస్ట్' పదాన్ని రాజ్యాంగ పీఠికలో చేర్చలేదు. అయితే, ఎమర్జెన్సీ సమయంలో నాటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చొరవతో పార్లమెంట్ రాజ్యాంగానికి 42వ సవరణ చేసి రాజ్యాంగ పీఠికలో సెక్కులర్, సోషలిస్ట్ అనే పదాలు చేర్చారు. ఆ సవరణ జరిగిన 44 సంవత్సరాల తర్వాత రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిజం పదాలను చేర్చడాన్ని తప్పుపడుతూ 2020లో సుప్రీం కోర్టులో కేసు వేయడంతోనే మళ్లీ 'సోషలిజం' స్ఫూర్తిపై గత 4 ఏళ్లుగా చర్చలు, వాదోపవాదాలు చోటు చేసుకొన్నాయి.

ప్రముఖ న్యాయవాది నానీఫాల్కివాలా మన దేశంలో 'సోషలిజం' తప్పుగా బ్రాండ్ అయింది అని అన్నారు 1972లో. దేశంలోని పేదరికాన్ని సమానంగా పెంచడమే 'సోషలిజం'గా చెలామణి అవుతోందని వెటకారంగా అన్నారు. 'గరీబీ హటావో' (పేదరికాన్ని పారద్రోలాలి) అని ఇందిరాగాంధీ పిలుపునిస్తే.. కొందరు అమీరీ హటావో (సంపదను పారద్రోలాలి) అని అర్థం చేసుకొంటున్నారని నానీఫాల్కీవాలా చమత్కరించారు. దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ దేశంలో 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ'కు బాటలు పర్చినప్పటికీ దశాబ్దాలపాటు దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి నామమాత్రంగానే పెరిగింది. నెహ్రూ అనుసరించిన విధానాన్ని కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకించాయి. కమ్యూనిస్టు పార్టీ రెండుగా విడిపోయిన తర్వాత ఒకరు చైనా నమూనాను, మరొకరు సోవియట్ రష్యా నమూనాను సమర్థించారు.

సోషలిజం విధానమే ఆదర్శప్రాయమైందన్న అభిప్రాయాన్ని కమ్యూనిస్టులు ప్రచారం చేశారు. 'సోషలిజం' పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకమని.. పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదవాళ్ల శ్రమ దోపిడీకి గురవుతుందని బలమైన ప్రచారం జరిగింది. పరిశ్రమలన్నీ పెట్టుబడిదారీ యాజమాన్యం నుంచి కార్మికుల యాజమాన్యం క్రిందికి రావడమే సంపూర్ణ సోషలిజం లక్ష్యం అనే నినాదాలు దేశంలో చాలా కాలం విన్పించాయి. పరిశ్రమల్ని జాతీయం చేయాలని కొందరు కమ్యూనిస్టులు తరచుగా పిలుపునిచ్చేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించేవారందరూ అభ్యుదయ వాదులుగా పిలవబడ్డారు. సంపన్నులంతా దుర్మార్గులని, సామాన్యులు మంచివారనే నెరేటివ్లతో మెజార్టీ నవలలు, సినిమాలు కూడా వచ్చాయి. దీంతో సామాన్య ప్రజల్లో అనేక అపోహలు ఏర్పడ్డాయి. అయితే, ఒక్క తూటా పేలకుండా, ఏ ఒక్క వ్యక్తి మరణించకుండా ఎప్పుడైతే సోషలిస్ట్ సోవియట్ యూనియన్ తనకుతానుగా కుప్పకూలిందో, అప్పట్నుంచీ సోవియట్ రష్యాలో అమలైన 'సోషలిజం' విధానాలకు నిజమైన అర్థమేమిటన్న అంతర్మథనం భారత్తో సహా చాలా దేశాలలో మొదలయింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో ఆ దేశాల ఆర్థిక వ్యవస్థల్లోని లోపాలు అంతర్జాతీయ సమాజానికి వెల్లడయ్యాయి. దాంతో, ఏ దేశమూ తనకున్న పరిమిత ఆర్థిక వనరులతో పైకెదగలేదనిబీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం కావడం అనివార్యం అని చాలా దేశాలు గ్రహించాయి. భారత్కు సంబంధించినంతవరకు 1991లో మొదలైన మొదటి దశ ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా పని చేశాయి. అప్పటివరకు దేశంలో రాజ్యమేలిన లైసెన్స్ రాజ్కు మంగళం పాడి.. ప్రజలందరికీ సమాన అవకాశాలను పొందే విధంగా అనేక రంగాల ద్వారాలను తెరవడం జరిగింది. దాంతో ప్రజలకు నిత్యావసరాలుగా మారిన వంటగ్యాస్, టెలిఫోన్ సౌకర్యం వంటివి సామాన్యులకు సైతం దక్కాయి. అదే సమయంలో అందుబాటులోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తోడు కావడంతో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడి పరుగుపెట్టింది. దేశంలోకి పెట్టుబడులు రావాలని, పరిశ్రమల స్థాపన జరగాలని, దేశ సంపద పెరగాలని, పెరిగిన సంపద అన్ని వర్గాలకు చేరాలని.. అదే భారత రాజ్యాంగం ప్రవచించిన ఆర్థిక,సామాజిక న్యాయం అని పాలకులకు అర్థం అయింది. కనుకనే, దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు తమకు అధికారం ఇస్తే ఆ పంథానే అనుసరిస్తామని ఎన్నికలలో హామీలిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలు హామీ ఇచ్చిన విధంగానే సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ.. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు ఇవ్వడంలో ఇంకా తాత్సారం చేస్తున్నాయి. నానా ఫాల్కీవాలా చెప్పినట్లు 'సోషలిజం' 4 ప్రధాన లక్ష్యాలను అందిస్తుంది. అవి దేశ స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల, ప్రతి ఒక్క పౌరుడికి పని లభించడం, ఆదాయాల పంపిణీలో తగిన న్యాయం జరగడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం. భారత రాజ్యాంగ స్ఫూర్తి ఇదే. ఈ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పనిచేసినప్పుడు దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరిగి సంపూర్ణ సోషలిజం అమలవుతుంది.




## త్వరలో పార్లమెంట్‌కు జమిలీ బిల్లు


బీజేపీ ఎజెండాలో ప్రధానమైన వన్ నేషన్ -వన్ ఎలక్షన్ కు సంబంధించి మరో ముందడుగు పడిం ది. వీటికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల ముసాయిదా బిల్లులను ప్రవేశ పెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాల సమాచారం. దీంతో కీలక బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యం లో 13,14 తేదీల్లో తప్పనిసరిగా సభకు హాజరు కావాలని తమ ఎంపీలకు బీజేపీ, కాంగ్రెస్ విప్ జారీ చేశాయి. జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోన్న వేళ, దీనిపై ఏకాభిప్రాయం సాధిం చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.



విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్ల మెంటరీ కమిటీ (జేపీసి)కి ఈ బిల్లును సిఫార్సు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. దీని ద్వారా వివిధ రాష్ట్రాల శాసనసభ స్పీకర్లతోనూ సంప్రదింపులు జరిపేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్టు సమాచారం. దీంతోపాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు , అన్ని భాగస్వామ్య పక్షాల కు అవకాశం కల్పించనున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకు అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించడంపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో రూపొందించిన నివేదికను భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ ఏడాది మార్చిలో అందించారు. అనంతరం కోవింద్ కమిటీ ఇచ్చిన సిఫార్సులకు కేంద్ర మంత్రివర్గం ఈ సెప్టెంబరులోనే పచ్చజెండా ఊపింది.

తాజా పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని భావిస్తోన్న ప్రభుత్వం, తాజాగా కేంద్ర కేబినెట్‌లో ఆమోద ముద్ర వేసింది. దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల ప్రతిపాదనలను 30 కి పైగా పార్టీలు సమర్థించగా, కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంటోంది. తమ పార్టీ జమిలి ఎన్నికలకు మద్దతు ఇవ్వడం లేదని , ప్రజాస్వామ్య మనుగడ సాగించాలంటే ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఎన్నికలు నిర్వహించాలని వాదిస్తోంది.

## శభాష్ గుకేశ్.. కల నిజమైంది!




చెన్నైకి చెందిన పద్దెనిమిదేళ్ల గుకేశ్ దొమ్మరాజు ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ సాధించిన అతి పిన్న వయస్కుడిగా అవతరించాడు. దొమ్మరాజు ఇప్పుడు ప్రపంచ చెస్ కింగ్. సింగపూర్ లో జరిగిన టోర్నీలో హోరాహోరీగా సాగిన 14వ రౌండ్ లో డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌ను ఓడించాడు. గుకేశ్ మొత్తంగా 7.5 పాయింట్లతో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. ఇప్పుడు దేశం మొత్తం ఈ కుర్రాడి గురించే మాట్లాడుకుంటోంది. గుకేశ్‌కి ఇది తొలి ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్. గెలిస్తే ఏం చేస్తారని సింగపూర్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నకు.. 'నాకు తెలియదు,

ముందుగా సంతోషిస్తాను' అని బదులిచ్చారు గుకేశ్ .

మరోవైపు, ఢిల్లీ నుంచి గల్లీ వరకు గుకేశ్‌పై అభినందనల వర్షం కురుస్తోంది. ఆయన సాధించిన విజయం చారిత్రకం, అసాధారణం అన్నారు ప్రధాని మోడీ. అతను దేశం గర్వపడేలా చేశాడని.. ఈ విజయం చెస్‌లో శక్తిమంతమైన దేశంగా భారత ముద్రను చాటిందని అభినందించారు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. అతిపిన్న వయసులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోవడం ద్వారా దొమ్మరాజు గుకేశ్ చరిత్ర సృష్టించారు. ఆయన తెలుగువాడు కావడం గర్వకారణం. 18 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించిన తొలివ్యక్తిగా గుకేశ్ నిలిచారు. అతడి ఘనతను యావత్తు దేశం ఆస్వాదిస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి విజయాలు మరిన్ని అందుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఇంకా ఈ జాబితాలో అనేక మంది ప్రముఖులు ఉన్నారు. ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ , ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, మాజీ సీఎం జగన్ గుకేశ్‌కు అభినందనలు తెలిపారు.

గుకేశ్ తండ్రి పేరు రజనీకాంత్, ఈఎన్‌టీ సర్జన్‌గా పనిచేసేవారు. కుమారుడికి చెస్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన రజనీకాంత్ 2017లో వైద్య వృత్తిని విడిచిపెట్టారు. గుకేశ్ తల్లి డాక్టర్ పద్మకుమారి మద్రాసు మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్. గుకేశ్ కుటుంబంలో మార్గనిర్దేశర చేయడానికి లేదా ఇన్‌స్పైర్ చేయడానికి చెస్ ప్లేయర్స్ ఎవరూ లేరు, అయినా కూడా ఆటపై అతనికున్న అభిరుచి ఇంత దూరం తీసుకువచ్చింది. మొదటగా ఇంట్లో వారితో చెస్ ఆడటం ప్రారంభించారు గుకేశ్ . అక్కడే బేసిక్స్ నేర్చుకున్నారు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను గెలుచుకున్నారు. పని ముగించుకొని తండ్రి స్కూలుకు వచ్చేంత వరకు ఖాళీగా ఉండకూడదని పాఠశాల తర్వాత చెస్ ప్రాక్టీస్ సెషన్ కోసం పేరు నమోదు చేసుకున్నారు గుకేశ్ . అతని ప్రతిభను గుర్తించిన కోచ్ అతనికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అతనికి తల్లిదండ్రులు, పాఠశాల నుంచి మద్దతు లభించింది. స్థానిక టోర్నమెంట్లలో పాల్గొనడం ప్రారంభించారు. బహుమతులు గెలుచుకున్నారు.. 2015లో గోవాలో జరిగిన నేషనల్ స్కూల్స్ చాంపియన్‌షిప్‌ను గెలుపొందిన గుకేశ్, ఆ తర్వాత రెండేళ్లపాటు టైటిల్‌ను నిలబెట్టుకున్నారు. 2019 జనవరిలో అతను గ్రాండ్‌మాస్టర్ గౌరవం పొందాడు. భారత్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడు గుకేశ్ . చెస్ ర్యాంకింగ్స్‌లో ఇండియా నుంచి రెండో స్థానంలో ప్రపంచ వ్యాప్తంగా ఐదో స్థానంలో ఉన్న గుకేశ్, ఎలో ర్యాంకింగ్స్‌లో 2,750 పాయింట్లను అధిగమించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. గుకేశ్ 2016లో కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు.

స్పెయిన్‌లో 2018 అండర్-12 ప్రపంచ చాంపియన్ షిప్‌ను గెలుచుకున్నాడు. 2021లో గుకేశ్ యూరోపియన్ చెస్ క్లబ్ కప్‌లో స్వర్ణం సాధించాడు, అక్కడ అతను మాగ్నస్ కార్ల్‌సెన్‌తో పోటీ పడ్డాడు. ఫ్రాన్స్‌లో కేన్స్ ఓపెన్ 2020, నార్వేజియన్ మాస్టర్స్ 2021, స్పెయిన్‌లో మెనోర్కా ఓపెన్ 2022, ఎలైట్ నార్వే గేమ్స్ 2023తో సహా 10 ఓపెన్ టైటిళ్లను గెలుచుకున్నాడు గుకేశ్.

## 3 రోజుల్లో మరో 'అల్పపీడనం'

గల్ఫ్ ఆఫ్ మన్నార్ దానికి అనుకుని ఉన్న కొమొరిన్ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం... ప్రస్తుతం లక్షద్వీప్, మాల్దీవుల మీదుగా ఉందని ఐఎండీ తెలిపింది. సంబంధిత ఎగువ వాయు ఉపరితల ఆవర్తనం.. సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఇది రాగల 24 గంటల్లో పశ్చిమ దిశగా కదిలి బలహీనపడే అవకాశం ఉందని వివరించింది. డిసెంబర్ 14వ తేదీ నాటికి దక్షిణ అండమాన్ సముద్రంపై ఎగువ వాయు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తదుపరి 48 గంటల్లో అది అల్పపీడనంగా మారుతుందని పేర్కొంది.

ఆ తర్వాత పశ్చిమ - వాయువ్య దిశగా తమిళనాడు తీరాల వైపు కదులుతుందని తాజా బులెటిన్ లో పేర్కొంది. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో... ఏపీలోని ఉత్తర కోస్తాలో ఇవాళ, రేపు పొడి వాతావరణం ఉంటుందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇక దక్షిణ కోస్తాలో ఇవాళ, రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని తెలిపింది. సీమలో కూడా ఇవాళ, రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని వివరించింది. ఇక ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం ప్రభావంతో%ా%. వాతావరణంలో మరిన్ని మార్పులు అవకాశం ఉంటుంది. దీంతో ఏపీలో మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండనుంది.



# సీపీఐ నేత శంకర్ రెడ్డి 7వ వర్ధంతి

**వెలుతురు, హయత్ నగర్, డిసెంబర్**
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సీనియర్ నాయకులు అమరజీవి ముత్యాల శంకర్ రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా శుక్ర వారం నాడు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా సమైక్య నాయకురాలు, సిపిఐ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగస్తులను వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలి

**శంకర్‌పల్లి, వెలుతురు డిసెంబర్ 13:** సమగ్ర శిక్ష ఉద్యోగస్తులను వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలి అని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగస్తుల ధర్నా శిబిరాన్ని సందర్శించి వారికి



మద్దతుగా ఉంటామని శంకర్పల్లి మండల శాఖ అధ్యక్షులు బి.మాణిక్యం, మరియు ప్రధాన కార్యదర్శి కె. బాల్ రాజ్, ఎల్లవేళలా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగస్తుల హక్కుల కోసం పోరాడుతామని అభయ మిచ్చినారు. సమగ్ర శిక్ష ఉద్యోగస్తులను వెంటనే రెగ్యులరైజేషన్ చేసి వారికి టైం స్కేల్ అ చేయాలని ప్రభుత్వాన్ని కోరడం చేయడం జరిగింది.

# ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు శంకర్పల్లి మండలం నూతన కమిటీ ఎన్నిక

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**

**శంకర్‌పల్లి, వెలుతురు, డిసెంబర్ 13:**
శంకర్పల్లి పట్టణ కేంద్రంలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ఎన్నికల



మేనిఫెస్టోలో పెట్టినట్లుగా 18 వేల ఫిక్స్ నిర్ణయించాలని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఆశా వర్కర్ల సమ్మెను పట్టించుకోని కేటీఆర్ ఆశా వర్కర్లపై సవతి తల్లి ప్రేమ మానుకోవాలని అన్నారు. టిఆర్ఎస్ నాయకులకు ఆశా వర్కర్ల సమస్యలపై చిత్తశుద్ధి ఉన్నట్లుగా ప్రవర్తించడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం శంకర్పల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు శంకర్పల్లి మండల అధ్యక్షురాలుగా నాగమణి, ప్రధాన కార్యదర్శిగా భవాని, కోశాధికారిగా స్వప్న, ఉపాధ్యక్షురాలుగా అనిలా, సౌమ్య సహాయ కార్యదర్శులుగా రేణుక, సలహాదారురాలుగా యాదమ్మ, 23 మంది ని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధి కోసం ఆశ కార్యకర్త సమస్యలపై అనేక పోరాటలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

# ఎక్సైజ్ శాఖ మంత్రి నుంచి జూపల్లి కృష్ణారావును తప్పించాలి

**కల్లుగీత జోలికొస్తే ఖబడ్దార్ జూపల్లి కృష్ణారావు.**

**- జాజుల లింగంగౌడ్**

**హైదరాబాద్, వెలుతురు, డిసెంబర్ 13:**
రాష్ట్రవ్యాప్తంగా గత కొంత కాలంగా కల్లుగీత వృత్తిపై కల్లు దుకాణాలపై అక్రమంగా ఎక్సైజ్ అధికారులు,నార్కోటిక్ అధికారులు,పోలీసులు దాడులు చేస్తున్నారని ఈ చర్యను తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గౌడ్ లపై విషక్షణారహితంగా దాడులు చేసి తెలంగాణలో వేలాది కల్లుగీత సొసైటీలను రద్దు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది,తిరిగి మళ్ళీ అదే పరిస్థితిని తీసుకువస్తున్నారు.తెలంగాణ ఏర్పడిన నాటి నుండి ఎక్సైజ్ శాఖకు బీసీనే మంత్రిగా కొనసాగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక వెలమ దొర జూపల్లి కృష్ణారావుకు ఆశాఖ ని కేటాయించడంతో కల్లుగీత వృత్తికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.శాంపిల్ల పేరుతో,కల్తీకల్లు నెపంతో నార్కోటిక్ అధికారులు పోలీసు అధికారులు..ఆబ్కారి అధికారులతో సహా



అందరూ కలిసి ఏకకాలంలో హైదరాబాద్ తో సహా రంగారెడ్డి,మెదక్,నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలలో అప్రకటిత దాడులు చేసి వందలాది గౌడ బిడ్డలను జైల్లో పెట్టి చిత్ర్ హింసలకు గురి చేస్తున్నారు.ఈ దాడులకు ప్రధాన కారకుడు తక్షణమే జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం కల్లుగీత వృత్తిని ఎక్సైజ్ శాఖ నుండి తొలగించి స్వయం ప్రతిపత్తి కలిగిన శాఖగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నం తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

# రేపు వేమూరి రామకృష్ణ శర్మ ‘అనంత కవితా లహరి’ పుస్తకావిష్కరణ..


**- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రాందాస్ తేజవత్ చేతుల మీదుగా ఆవిష్కరణ...**

**- హాజరుకానున్న పలువురు ప్రముఖులు..**

**వెలుతురు, కాచిగూడ:** తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణ శర్మ రచించిన ‘అనంత కవితా లహరి’ పుస్తకావిష్కరణ సభ ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు బడే సాబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 9గంటలకు నాంపల్లి, పొట్టి శ్రీరాములు తెలుగు విద్యాల యంలో నిర్వహించ నున్నారు.

ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, హైదరాబాద్ సిటీ అడిషనల్ డీసీపీ సిపిటిసి రాందాస్ తేజవాత్ లు ముఖ్య అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్క రించనున్నట్లు తెలిపారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచా ర్య టి.గౌరీశంకర్ సభాధ్యక్షత వహించనున్న సభా కార్యక్రమంలో అతిథులుగా పిల్లలమర్రి రాములు, దైవాజ్ఞ శర్మ, డాక్టర్ ఎన్ బాలాచారి, నాగేశ్వరం శంకరం తదితరులు పా ల్గొంటారని తెలిపారు. ప్రముఖ కవ యిత్రి డాక్టర్ రాధా కుసుమ ఆధ్వ ర్యంలో కవి సమ్మేళనం నిర్వహించ నున్నట్లు తెలిపారు. కురుగంటి కళా క్షేత్రం నృత్య గురువు డాక్టర్ కె.కుం దనిక శిష్య బృందంచే కూచిపూడి, భరతనాట్యం, ప్రముఖ గాయని వే మూరి మంజులచే సీని,లలిత, భక్తి గీతాలపన ఉంటుందని వెల్లడించా రు. జంట నగరంలోని కవులు,కళా కారులు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని నిర్వాహకులు కోరారు.




## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ఉల్లంఘనల కోసం
# M/s జెపి హాస్పిటల్ యొక్క నమోదు రద్దు

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వెలుతురు డిసెంబర్ 13:**
క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం (CEA) కింద అధికారం సాధించిన నాకు, M/s జెపి హాస్పిటల్, H.No. 8-50 & 51, మంగల్యామ్ షాపింగ్ మాల్ సమీపం, సాయి నగర్, కేనరా నగర్, పీర్జాదిగూడ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, వివిధ చట్టాల ఉల్లంఘనలలో లభించింది.

ఈ ఉల్లంఘనల యొక్క పరిక్షణలు మరియు పలు ఫిర్యాదుల ఆధారంగా, ఈ హాస్పిటల్‌లో చోటుచేసుకున్న ప్రధాన సమస్యలు:

CEA చట్టం సెక్షన్ 12(1)(ii) ప్రకారం అర్హత కలిగిన వైద్య పర్సనెల్ మరియు వైద్య డైరెక్టర్ లేకపోవడం.

1971 మేదికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (MTP) చట్టానికి విరుద్ధంగా అనధికారంగా ప్రెగ్నెన్సీ టర్మినేషన్లు నిర్వహించడం.

అర్హత లేకుండా ప్రత్యేక సేవలను ప్రదర్శించడం మరియు ఆపరేట్ చేయడం. అగ్ని భద్రత, సెవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (STP), ఫార్మసీ అనుమతులు వంటి అవసరమైన ధ్రువపత్రాలను పొందక పోవడం... PCPNDT చట్టం సెక్షన్ 23 ఉల్లంఘనగా అనధికారంగా అల్ట్రాసౌండ్ మరియు ఇతర వైద్య పరికరాలను ఉపయోగించడం.

వైద్య పర్యవేక్షణలో ఉన్న పరిపాలకుల మరియు సమీప ఉద్యోగుల వైద్య అర్హతలను తప్పుగా చూపించడం మరియు



మాలప్రాక్టీస్ చేయడం. ఈ ఉల్లంఘనల ఆధారంగా, M/s జెపి హాస్పిటల్‌కు Show-Cause Notice జారీ చేయబడింది, తద్వారా 7 రోజుల్లో వివరణ అందించాలని కోరబడింది. అయితే, సమీక్షించబడిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడం వల్ల, ఈ అవ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరిగింది.

ఫలితంగా, ఈ కార్యాలయం జారీ చేసిన అన్ని opathic ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, M/s జెపి హాస్పిటల్‌కు ఇచ్చిన అప్లికేషన్ సంఖ్య 857/2021, తేదీ 03/06/2021, 02/06/2026 వరకు, ఇప్పుడు రద్దు చేయబడింది. అంతేకాకుండా, M/s జెపి హాస్పిటల్ మరియు దాని మేనేజింగ్ డైరెక్టర్ మరియు మెడికల్ డైరెక్టర్‌ను ఈ ఆదేశం జారీ చేసిన తేదీ నుండి హాస్పిటల్‌ను నిర్వహించకూడదు అని ఆదేశించబడింది. ఈ ఆదేశం అమలు చేయకపోతే, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం మరియు తెలంగాణ రాష్ట్ర అలోపతి ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం (TSAPMCE) కింద కఠినమైన న్యాయ చర్యలు తీసుకుంటారు.

మరియు, ఈ భవనంలో ఉన్న భవన యజమానిని, H.No. 8-50 & 51, పీర్జాదిగూడ, అనుమతులు లేకుండా M/s జెపి హాస్పిటల్ ద్వారా హాస్పిటల్ కార్యకలాపాలను లేదా క్లినికల్ కార్యకలాపాలను కొనసాగించకుండా ఆదేశించబడింది. భవన యజమానికి 2 రోజుల గడువు ఇవ్వబడింది, తద్వారా హాస్పిటల్ మేనేజ్మెంట్‌ను భవనాన్ని వదలించడానికి సమయం ఇవ్వబడు తుంది, పేషెంట్ కేర్ మరియు న్యాయ విధానం నిమిత్తం. ఈ ఆదేశాన్ని పాటించకపోతే, సంబంధిత చట్టాల ప్రకారం న్యాయపరమైన చర్యలు తీసుకుంటారు.

# మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సృజనాత్మక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు

**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వెలుతురు డిసెంబర్ 13:**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి తెలిపారు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మాత్రమే, జిల్లావాసుల ఆరోగ్యాల కోసం వివిధ సృజనాత్మక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. ఈ కార్యక్రమాలు ప్రజలకు అందించేందుకు CSR ప్రోగ్రామ్ ద్వారా వివిధ గ్రూపులతో భాగస్వామ్యం చేసి జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం పని చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో కొన్ని ముఖ్యమైనవి:


థలసేమియా & సికల్ సెల్ సొసైటీ: గర్భిణీ స్త్రీలందరికీ థలసేమియా మరియు సికల్ సెల్ వ్యాధుల స్క్రీనింగ్.

పెరిఫెరల్ న్యూరోపతి ఇన్ డయాబెటిస్ వర్క్‌షాప్: డయాబెటిస్ మరియు క్షయ వ్యాధుల పట్ల అడిటెక్షన్ మరియు చికిత్స, ICMR మరియు ఉస్మానియా ఆసుపత్రి, హైదరాబాద్ సహకారంతో నిర్వహించబడింది.

రోహిణి ఫౌండేషన్ హైస్కూల్ విద్యార్థులందరికీ అనేమియా మరియు మౌత్ హీజీన్ స్క్రీనింగ్.

వాక్‌హార్ట్స్: రెండు మొబైల్ క్లినిక్స్, వెనక్కి ఉన్న ప్రాంతాలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయి.

బయోలాజికల్ ఈ లిమిటెడ్: “కేర్ ఆన్ వీల్స్” ప్రోగ్రామ్‌ను షమీరపేట్ మండలంలో ప్రారంభించారు, ఇంపాక్ట్ గురూ



మరియు డట్లా ఫౌండేషన్ సహకారంతో.

టీబీ ఫ్రీ జోన్ అండ్ అర్బన్ ఏరియాస్: పోచరమా, పీర్జాదిగూడా మరియు బొడుప్పల్ ప్రాంతాల్లో టి.బి. నిరోధక కార్యక్రమాలు మరియు స్క్రీనింగ్, The Union-NGO ద్వారా మొబైల్ వాన్లు పంపిణీ చేయబడతాయి.

ఊరి పరిశ్రమా ప్రాంతాల్లో టీబీ స్క్రీనింగ్: టి.బీ అలర్ట్ ఇండియా ద్వారా పరిశ్రమ కార్మికుల కోసం టి.బీ స్క్రీనింగ్ నిర్వహించబడుతోంది.

ఈ చర్యలు ప్రభుత్వ ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ పథకాలు జిల్లా ప్రజలందరికీ సమర్ధంగా చేరుకోకుండా చేయడానికే తీసుకున్నవి.

డాక్టర్ శ్రీదేవి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, డాక్టర్ పద్మావతి, జిల్లా పర్యవేక్షణాధికారి / నేషనల్ ట్యూబర్‌క్లోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్, డాక్టర్ సరస్వతి, జిల్లా నిరోధక వ్యాక్సినేషన్ అధికారి, డాక్టర్ కౌశిక్, అసిస్టెంట్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి, నాన్ కమ్యూనికబుల్ డిజీస్ ఈ ప్రెస్ మీట్‌లో పాల్గొన్నారు.



## స్వామి శరణం! అయ్యప్ప శరణం!!
# అంటూ ఘనంగా పూజలు

**-యూత్ కాంగ్రెస్ లీడర్ శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా 18 వ అయ్యప్ప మహా పడి పూజ**

**- పూజ లో పాల్గొన్న పలువురు నాయకులు**

**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, డిసెంబర్ 13:**
అబ్దుల్లాపూర్ మెట్ మండల యువజన కాంగ్రెస్ నాయకుడు మునుకుంట్ల శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన18వ అయ్యప్ప మహా పడి మహా పడిపూజకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు.

మల్ రెడ్డి రామ్ రెడ్డి .రాష్ట్ర యువ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి. గడ్డి అన్నారం మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి , అబ్దుల్లా పూర్ మెట్ మాజీ ఎంపీపీ బుర్ర రేఖ మహేందర్ గౌడ్ ,మాజీ జెడ్పిటిసి బింగి దాస్ గౌడ్ ,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కర్ చారి, మున్సిపల్ వైస్ చైర్మన్ హరిత ధనరాజ్ గౌడ్, పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి , తుర్క యంజాల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ ,సీనియర్ నాయకులు జక్క సంజీవరెడ్డి ,డైరెక్టర్ జక్క కృష్ణారెడ్డి, జక్క రవీందర్ రెడ్డి ,భాస్కర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లు ,మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి దర్శనం,స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు.

# నేడే రెసిడెన్షియల్ వెల్ఫేర్ & కల్చరల్ అసోసియేషన్ నందు రాష్ట్ర జనరల్ బాడీ మీటింగ్

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 13:**
శుక్రవారం రోజున మధ్యాహ్నం మింట్ కాంపౌండ్ ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం జరగబోయే జనరల్ బాడీ మీటింగ్ లో రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకుంటున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు జి సి రెడ్డి ఒక




ప్రకటనలో తెలియజేశారు.
తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్. రిజిస్ట్రేషన్ నెంబర్ 1544/2014

వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎర్రగడ్డ రైతు బజార్ ఆపోజిట్ రోడ్డు సుందర్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ & కల్చరల్ అసోసియేషన్ నందు రాష్ట్ర జనరల్ బాడీ మీటింగ్ ఉన్నది కావున తెలంగాణ కాంట్రాక్టర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయగలరని మనవి

రాష్ట్ర అధ్యక్షుడు జి సి రెడ్డి ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏం శ్రీనివాస్ గౌడ్. ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీ. నక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు.





# జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రూపేష్

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 13:** వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం నాడు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సందర్శించి పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్ లోని కేసులను చెక్ చేస్తూ.., తగు సలహాలు సూచనలు చేశారు.

అనంతరం మీడియా సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. పట్టణ పోలీస్ స్టేషన్ కు సంభందించిన రికార్డులను స్థానిక డి ఎస్ పి, సి ఐ, ఎస్ ఐ లు బాగా నిర్వహించారని వారిని ప్రశంసించారు. అదేవిదంగా ఈ ప్రాంతంలో గాంజా వంటి నిషేధిత సరుకుల అక్రమ రవాణాను నివారించడం జరిగిందని, అటువంటి వారిపై కేసులు పెట్టి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. తొందరలోనే అటువంటి వారికి పి.డి. యాక్టు కూడ పెట్టడం జరుగుతుందని తెలిపారు. జహీరాబాద్ టౌన్ లో జనాభా పెరుగడం, కొత్త కొత్త కాలోనిలు ఏర్పడడం, ట్రాఫిక్ పెరగడం, అక్రమ నివారణను నివరించడానిని దృష్టిలో ఉంచుకొని పట్టణ పోలీస్ స్టేషన్ కు నూతనంగా రిక్రూట్ అయిన పోలీస్ సిబ్బందిలను పెద్ద మొత్తంలో జహీరాబాద్‌కు కేటాయించామన్నారు. దాంతోపాటు ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ట్రాఫిక్ టాస్క్ పోర్స్ రెండు మొబైల్ బైక్ లను ఇవ్వడం జరిగిందని తెలిపారు. జహీరాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని జహీరాబాద్ పట్టణ, జహీరాబాద్ రూరల్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ అధికారుల పనితీరు బాగుందని, సక్రమంగా రికార్డులు నిర్వహిస్తున్నారని వారిని ప్రశాంసించారు.

ఈ మీడియా సమావేశంలో డీఎస్పీ రాం మెహన్ రెడ్డి, పట్టణ సీఐ, శివ లింగం, రూరల్ సీఐ జక్కుల హన్మంతు, డివిజన్ పరిధిలోని ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






# కాంగ్రెస్ నేత కె.ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్ల అందజేత

## పాఠశాల ఆధ్వర్యంలో కె.ప్రసాద్ రెడ్డికి ఘన స్వాగతం

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 13:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలంలోని పీచెర్యాగడి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సజ్జాపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త కాంగ్రెస్ నేత కె.ప్రసాద్ రెడ్డి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొరకు ప్లేట్లు, గ్లాసులను అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని అన్నారు. విద్యార్థులకు మీరు ఏం కావాలనుకుంటున్నారు అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు డిగ్రీ బాగా చదివిన తర్వాత ఐఏఎస్ కు ప్రిపేర్ కావాలని అటువంటి విద్యార్థులకు అన్ని సహాయ సహకారాలు అందజేస్తానని ఈ పాఠశాల నుండి ఒక ఐఏఎస్ కావాలని నా కోరిక అని అన్నారు.

అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ సజ్జాపూర్, మాచిరెడ్డిపలె, పిచెర్యాగడి తండా (ఎ) మరియు (బి) గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు వారి గ్రామంలో సైకిళ్లు పంపిణీ చేయడం పాఠశాలకు విచ్చేసి విద్యార్థులకు ప్లేట్లను, గ్లాసులను అందజేయడం విద్యార్థులను ఉన్నత విద్య కోసం ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుందని విద్యార్థుల పట్ల ఇంత శ్రేద్ద వహిస్తున్న కె.ప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

కోహిర్ మండల విద్యాధికారి జాకిర్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మంచి ప్రోత్సాహంగా ఉంటుందని మండలంలో మరికొన్ని స్కూళ్ళకి అందజేయ వలసిందిగా కోరినారు.

ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వీర రెడ్డి, సజ్జపూర్ మాజీ సర్పంచ్ అడవి రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హేమలత, పాఠశాల మాజీ ఎస్ఎంసి చైర్మన్ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రాథోడ్ వినోద్ కుమార్, మైసయ్య, వాగుల చంద్రశేఖర్, పిచేర్యాగడి మైనారిటీ ప్రెసిడెంట్ జహీరోద్దీన్, నాయకులు పాఠశాల బృందం పాల్గొన్నారు.

## లగిచర్ల రైతుకు బేడీలు వేసినందుకు నిరసనగా

# కరీంనగర్లో రేవంత్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 13:**

భూ నిర్వాసిత లగిచర్ల రైతు హీర్యా నాయక్ కు బేడీలు వేసినందుకు నిరసనగా బిజెపి నాయకులు కరీంనగర్ లో కమాన్ వద్ద బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రేవంత్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ప్రైవేట్ ఫార్మసిటికల్ పరిశ్రమ కోసం నిరుపేద దళిత గిరిజన రైతుల భూములు సేకరించడమే కాకుండా వద్దని వేడుకున్న రైతులను అక్రమ కేసులు బనాయించి జైల్లోకి తోసి సామాన్య గిరిజన రైతు హీర్యా నాయక్ ను ఆసుపత్రికి బేడీలు వేసి

తీవ్రవాది, దేశద్రోహి నక్సలైట్ మాదిరిగా తీసుకు వెళ్లడాన్ని నిరసిస్తూ బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నాడు టిఆర్ఎస్ ప్రభుత్వం మిర్చి మార్కెట్లో మిర్చి రైతులకు బేడీలు వేసి అవమానపరిస్తే

నేడు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముఖ్యమంత్రి అల్లుడి ఫార్మా పరిశ్రమ కోసం భూమిని కోల్పోయిన గిరిజన రైతు హిరియా నాయకులు బేడీలు వేసి తిప్పడం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం మరొకసారి నిరూపించుకున్నదని దుయ్యబట్టారు.

మాట మాట్లాడితే తన తాతకు 3000 ఎకరాలు ముత్తాతకు 5000 ఎకరాలు ఉందని తండ్రి పోలీస్ పటేల్ తాత పోలీస్ పటేల్ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి తన అల్లుడి ఫార్మా పరిశ్రమ కోసం మాత్రం తన సొంత భూముల్లో ఏర్పాటు చేసుకోకుండా దళిత



నిరుపేద గిరిజన రైతుల భూములు లాక్కోవడం ఎందుకో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు.

తక్షణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని లగిచెర్ల రైతులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాంపల్లి శ్రీనివాస్ , రెండవ టౌన్ కన్వీనర్ గుంజేటి శివకుమార్ జోనల్ కన్వీనర్లు అవుదుర్తి శ్రీనివాస్, పురం హరిశంకర్, తణుకు సాయి కృష్ణా, సెంట్రల్ జోన్ కో కన్వీనర్ కలికోట మోహన్, మాచర్ల కోటేశ్, ఈస్ట్ జోన్ కో కన్వీనర్లు పోరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాసం గణేష్ ,లడ్డు ముందాడా, కొలిపాక శ్రీనివాస్, తోట సతీష్, గుర్రం సమర సింహారెడ్డి, గుండె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాటా శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు

**పటాన్‌చెరు వెలుతురు డిసెంబర్ 13:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని పటాన్ చెరు పట్టణంలో కాంగ్రెస్ పటాన్ చెరు నియోజకవర్గ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు. పటాన్‌చెరు పట్టణంలోని ఐదు మండలాలు మున్సిపాలిటీలకు సంబంధించినటువంటి కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో కాటా శ్రీనివాస్ గౌడ్ బర్త్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తలు బ్లడ్ డొనేషన్ చేశారు.

పలువురు మాట్లాడుతూ కాటా శ్రీనివాస్ నియోజకవర్గ









గుండెల్లో ఎప్పుడూ ఉంటాడని, తను అధికారంలో లేకున్నా పది సంవత్సరాలకు పైగా కాంగ్రెస్ జెండాను మోసిన వ్యక్తి అని, ఇన్ని సంవత్సరాలుగా కార్యకర్తలను కాపాడుకున్నటువంటి రాష్ట్రంలోనే గొప్ప నాయకుడని అతన్ని అధిష్టానం గుర్తించి నామినేటెడ్ పోస్ట్ ఏదైనా ఇవ్వాలని, అప్పుడు ప్రజలందరూ ప్రభుత్వాన్ని మరింతగా స్వాగతిస్తారని అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో పాల్గొన్న పటాన్చెరువు మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, కౌన్సిలర్ శశిధర్ రెడ్డి మున్నా, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్, చంద్రారెడ్డి, మహేష్ గౌడ్, నర్సింగరావు, శోభ,జయమ్మ, కాంగ్రెస్ కార్యకర్తలు, కాటా శ్రీనివాస్ అభిమానులు పాల్గొన్నారు.



# గచ్చిబౌలి సాయి ఐశ్వర్య కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

**వెలుతురు, శేరిలింగంపల్లి, డిసెంబర్ 13:**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని సాయి ఐశ్వర్య కాలనీలో రూ.50.లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి ,రాగం నాగేందర్ యాదవ్ లతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 17న జరిగే అయ్యప్ప స్వామి మహాపూజకు ఆహ్వానాన్ని అందించిన స్వాములు

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 13:**

తెలంగాణ రాష్ట్ర టీజీ పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ ను ఈ నెల 17 న హైదరాబాద్ లో జరిగే అయ్యప్ప మహా పడిపూజకు ఆహ్వానం పలికిన కేశం నాగరాజ్



గౌడ్ గురు స్వామి యితరులు, కాగా ఈ కార్యక్రమంలో బాదం శివకృష్ణ గౌడ్ రాష్ట్ర వైస్ చైర్మన్‌రాజేందర్ ముదిరాజ్,శ్రీనివాస్ గురు స్వామి,యాది గురుస్వామి ,సంతోష్ గురుస్వామి లు అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# మహిత్రీ విహార్ కాలనీలో సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్

**వెలుతురు, హయత్ నగర్, డిసెంబర్ 13:**

హయత్ నగర్ డివిజన్లోని మహిత్రీ విహార్ కాలనీలో మరి కొన్ని రోజుల్లో నూతన సీసీ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం



నవజీవన్ రెడ్డి జలమండలి సిబ్బందితో కలిసి ప్రస్తుతం ఉన్న భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ లెవెల్స్ పరిశీలించారు, సిసిరోడ్ నిర్మాణం పూర్తయితే మరల ఏలాంటి పైప్ లైన్ మరమ్మత్తులు జరపడం సాధ్యం కాదని, కావున ముందే రాబోవు కాలంలో కాలనీవాసులకు ఎలాంటి భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి వారు తెలిపారు,ఈ పరిశీలనలో జలమండలి మేనేజర్ రాజు ,సూపెర్వైసోర్ బాలు గ,మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం కోసం రోడ్డెక్కిన నిరుద్యోగులు

## కేర్ టేకర్ నియామకంలో అవకతవకలు

## మెరిట్ ఉన్న వారికి ఉద్యోగం ఇవ్వాలంటు నిరుద్యోగుల నిరసన

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు డిసెంబర్ 13:**

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ని మోడల్ స్కూల్ కేర్ టేకర్ ఉద్యోగంలో అవకతవకలు జరిగాయని ఆ ఉద్యగం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు రోడ్డుమీద



బైఠాయించి నిరసన తెలుపారు.

అనంతరం వారు మాట్లాడుతూ మెరిట్ ప్రకారంగా ఉద్యోగాలు ఇవ్వకుండా కేర్ టేకర్ ఉద్యోగిని ఎంపిక చేశారు. గత నెల ఇంటర్వ్యూకు పిలిచి మళ్లీ రెండు రోజుల్లో ఇంటర్వ్యూ ఉంటుందని వాయిదా వేసి ఇంటర్వ్యూల కోసం తిరుగుతున్న సమయంలో ఇంకొకరికి ఔట్సోర్సింగ్ ద్వారా కేర్ టెకర్ అనే ఉద్యగవకాశం కల్పించడం సరైనా విధానం కాదు అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. గంటన్నర పాటు రోడ్డు మీదనే నిరసన వ్యక్తం చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి తీసుకెళ్లారు.

## లగచర్ల ఘటనలో రైతులకు బేడీలు వేసిన పోలీసులపై చర్య తీసుకోవాలి

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి



**రామన్నపేట, వెలుతురు న్యూస్ డిసెంబర్ 13:** సంగారెడ్డి జిల్లా లగచర్ల ఘటనలో అరెస్ట్ అయిన రైతుల పట్ల పోలీసు వైఖరి సరైంది కాదని రైతులకు సంకెళ్లు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లిన పోలీసులపై చర్య తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి అన్నారు.రైతుల భూముల్లో ఫార్మా కంపెనీ పెట్టాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జరిగిన సంఘటనలో అరెస్టయిన హిర్యా నాయక్ అనే రైతుకు గుండె నొప్పి రావడంతో జైలు నుండి హాస్పిటల్‌కు తీసుకెళ్లే తరుణంలో అంబూలెన్స్‌లో తీసుకెళ్ల కుండా పోలీస్ వాహనంలో బేడీలతో తీసుకెళ్లడం రైతులను దొంగలుగా, నేరస్తులుగా, చిత్రీకరించ డమే అన్నారు. గత ప్రభుత్వం రైతులకు బేడీలేస్తే కోర్టులు సైతం మండలించాయాన్నారు. వెంటనే రైతు హిర్యా నాయక్ కు సంకెళ్లేసి హాస్పిటల్ తీసుకెళ్లిన పోలీసులపై, ఉన్నంతధికారులపై చర్య తీసుకోవాలని, ప్రభుత్వం దీనికి భాద్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గన్నేబోయిన విజయ భాస్కర్, కందుల హనుమంతు, బోళ్ల వెంకన్న, అంబటి సురేందర్ రెడ్డి, పులి బిక్షం,కరకంటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన మహమ్మద్ తన్వీర్...

**జహీరాబాద్, వెలుతురు, డిసెంబర్ 13:** సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని మాజీ టిజిఐడిసీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని శాంతినగర్ కు చెందిన మహమ్మద్ అఖీల్ కు ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 50 వేల



రూపాయల చెక్కును శుక్రవారం రోజున మాజీ టిజిఐడిసీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం చెక్కులు అందుకున్న లబ్ధిదారుడు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం రేవంత్ రెడ్డి అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన మాజీ చైర్మన్ తన్వీర్ కు కృతజ్ఞతలు తెలిపారు.



**యాదగిరిగుట్ట వెలుతురు డిసెంబర్ 13:** హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో శాల్వాతో సన్మానం చేసిన బిజెపి మహిళా మోర్చా నాయకురాలు బొమ్మగాని రాజమణి గౌడ్

## సభలో ప్రియాంక స్పీచ్ అదుర్స్

### నాకన్నా బాగా మాట్లాడిందంటూ..రాహుల్ కితాబు

**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):** వయనాడ్ ఎంపీగా గెలిచి లోక్‌సభలో తొలిసారి అడుగుపెట్టారు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా. తాజాగా రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంగా సభలో ఆమె తొలి ప్రసంగం చేశారు. దీనిపై ఆమె సోదరుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. తన తొలి ప్రసంగం కంటే ప్రియాంక స్పీచ్ బాగుందంటూ ప్రశంసలు కురిపించారు. చాలా విషయాలపై ఆమె అద్భుతంగా మాట్లాడారని అన్నారు. ప్రతి విషయాన్ని సమగ్రంగా వివరించారని తెలిపారు.భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ



జరుగుతోంది. ఇందులో విపక్షాల తరపున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా (ఖసతాజీనీజీ ఉజీనిటరతి) చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె అధికార భాజపా, అరెస్సెస్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. ఒక వ్యక్తి కోసం 142 కోట్ల మంది ప్రయోజనాలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చాలని భాజపా ప్రయత్నించిందని, కానీ, లోక్‌సభ ఫలితాలతో (అధికార పార్టీకి భారీ మెజార్టీ రాకపోవడాన్ని ఉద్దేశిస్తూ) ఆ నిర్ణయంపై వెనక్కి తగ్గారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ రూల్ బుక్ కాదని మండిపడ్డారు.

## శ్రీ మల్లన్న జాతర మరియు కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

### - మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 13 :** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామంలో తేదీ 15-12-2024 ఆదివారము నాడు ఉదయం 11-00 గంటలకు శ్రీ మల్లన జాతర మరియు కళ్యాణ మహోత్సవం జరగా నుండగా ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు గౌరవ నియులు కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీని కలిసి ఆహ్వానించగా వారు సానుకూలంగా స్పందించారని కచ్చితంగా వచ్చి మల్లన్న కళ్యాణం లో పాలు కొంటారని మాజీ ఎమ్మెల్యే శ్రీ మహా రెడ్డి భూపాల్ రెడ్డి తెలిపినారు.

వారి వెంట నారాయణఖేడ్ మండల బారసా పార్టీ అధ్యక్షుడు మరియు తుర్కాపల్లి తాజా మాజీ సర్పంచ్ కుమ్మరి పరమేష్, అనంతసాగర్ మాజీ సర్పంచ్ కుమ్మరి సిద్దు గర్లు ఉన్నారు.

వారు ఇట్టి కార్యక్రమంలో ఉదయం 11-00 గంటలకు హాజరు కానున్నారు అని అందుకు బీ అర్ ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఇట్టి దేవుని కార్యక్రమంలో అందరు పాల్గొని మల్లన్న స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.



## నిరుపేద విద్యార్థులకు అండగా పల్లా..

### - ఏడాది ఫీజు చెల్లింపు

**చేర్యాల వెలుతురు డిసెంబర్ 13:** నిరుపేద విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లా ఎల్లప్పుడూ అండగా ఉంటూ వస్తూనే ఉన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం చదువే అని బలంగా నమ్ముతున్న ఆయన విద్యాభివృద్ధికి చేయూత నందిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా బాధిత కుటుంబాలకు, అనాథ పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందిస్తూ వారి కుటుంబాల్లో భరోసా నింపుతున్నారు. చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన బక్క కనుకరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆతడి కూతురు పల్లవి మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతుంది. ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉందనడంతో ఎమ్మెల్యే పల్లా స్పందించి ఏడాది ఫీజు చెల్లించాడు. ఇలా వేలాది మంది పిల్లలకు పల్లా విద్యాదానం చేస్తూనే ఉన్నారు. దీంతో బాధిత కుటుంబాలు ఆయనకు ధన్యవాదాలు చెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూప శ్రీధర్ రెడ్డి, వైస్ చైర్మన్ రాజీవ్



రెడ్డి,టౌన్ ప్రసిడెంట్ ముస్త్యాల నాగేశ్వర్ రావు,బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గదరాజు చందు, యువజన నాయకులు జితేందర్ రెడ్డి, రాళ్లబండి చందు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత కోరుకుంటున్నా..

### స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఆవిష్కరణలో పవన్

**అమరావతి,డిసెంబర్13(వెలుతురు):** రాష్ట్రానికి తక్కువలో తక్కువగా దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు రాజకీయ సుస్థిరత ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కుల, మత, ప్రాంతాల పరంగా కొట్టుకునే రోజులు ఇక పోయాయన్నారు. రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసే పరిస్థితులు ఇక ఉండవన్నారు. చంద్రబాబుకు భగవంతుడు నిండు నూరేళ్ల ఆయుషుతో పాటు మంచి ఆరోగ్యం ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'చంద్రబాబు నా గౌరవ మర్యాదలు ఎక్కడా తగ్గకుండా చూస్తూ నన్ను నమ్మిన ప్రజలకూ గౌరవం ఇస్తున్నారు. అలాంటి చంద్రబాబు గౌరవం నేను ఏ రోజూ తగ్గించను' అని స్పష్టం చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలో ఉన్న అన్ని స్థాయిల్లో నాయకులు చంద్రబాబుతో తానెలా కలిసి పనిచేస్తున్నానో అలాగే సమష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. అప్పుడప్పుడు కొన్ని సమస్యలున్నా వాటిని అధిగమించి వెళ్లటమే ప్రజలు మనకిచ్చిన ఎన్నికల ఫలితాన్ని సాకారం చేయటం అని అన్నారు. వేదిక మీద ఉన్న వాళ్లమంతా ఒకే మాట మీద ఉన్నాం, చంద్రబాబు వెన్నంటే ఉన్నామని తెలిపారు. అంతా కలిసి ప్రధాని మోదీ కనే వికసిత్ భారత్ కలను సాకారం చేస్తామన్నారు. మోదీ ఆకాంక్ష నెరవేరాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చంద్రబాబు నాయకత్వంలో బలంగా ఉండాలని తెలిపారు. అద్భుతమైన 2047 విజన్ సాకార యాత్రలో చంద్రబాబు వెన్నంటే ఉంటా అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రజల జీవితాలు బాగుపడాలంటే సరైన సారథ్యం వహించే మహానాయకుడు సీఎం చంద్రబాబు




అని ఉపముఖ్యమంత్రి అన్నారు. విజన్ స్వర్ణాంధ్ర డాక్యుమెంట్ కోట్లాది మంది కలలను సాకారం చేసే మహాసంకల్పమన్నారు. పార్టీ పెట్టి తాను నలిగిన తర్వాతే చంద్రబాబు విలువేంటో మరింత తెలిసి ఆయనపై అపార గౌరవం పెరిగిందని చెప్పుకొచ్చారు. పార్టీ నడపటం అంటే ఆత్మహత్యా సదృశ్యంతో సమానమన్నారు. ప్రతీ ఒక్కరికీ దిక్సూచీ అవసరమన్నారు. విజన్ 2020 నాడు తన స్థాయికి అర్థం కాలేదని తెలిపారు.చంద్రబాబు ఆయన కోసం కలలు కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోసం కలలు కన్న మహానాయకుడని విజన్ 2020 ఫలితాల ద్వారా అర్థమైందన్నారు. నాడు రాళ్లు రప్పలు చూసిన ప్రాంతంలో చంద్రబాబు సైబర్ సిటీ మహానగరాన్ని చూశారన్నారు. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న సైబరాబాద్ రూపకర్త, శిల్పి, చీఫ్ ఆర్కిటెక్ట్ చంద్రబాబే అంటూ కొనియాడారు. ఎంతో కష్టపడి కట్టిన ట్విన్ టవర్స్‌ను ఉగ్రవాదులు ఒక పూటలోనే కూల్చేశారని.. నిర్మాణం విలువ తెలియని గత పాలకులూ ఇదే మాదిరి వ్యవహరించారన్నారు. 'చంద్రబాబు ఓపికను ఎన్నిసార్లు మెచ్చుకున్నా సరిపోదు, మేం మా కోసం కలలు కంటే ఆయన ప్రజల కోసం కలలు కంటున్నారు. అలాంటి అనుభవజ్ఞుడి వద్ద పనిచేయటం ఎంతో గర్వంగా ఉంది' అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

## పడిపోయిన టమాటా, మిర్చి ధరలు

### చెత్తలో పారబోస్తున్న రైతులు

**అమరావతి,డిసెంబర్ 13 (వెలుతురు):** నిన్న మొన్నటి వరకు రూ.60-70 ఓ దశలో రూ.100 రుపాయలకు చేరువైన కిలో టమాటాను ఇప్పుడు వ్యవసాయ మార్కెట్లలో కనీసం రుపాయి ధరకి కూడా కొనడం లేదు. ఏపీతో పాటు తెలుగు రాష్ట్రాల మార్కెట్లకు కర్నూలు, మదనపల్లి మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున టమాటా విక్రయాలు జరుగుతుంటాయి. మూడు నెలల క్రితం అకాల వర్షాలతో పంటలు నష్టపోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. కొత్త పంట చేతికి వచ్చే సరికి ధరలు పడిపోయాయి. దీంతో కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్లో గురువారం టమాటా రైతులు ఆందోళనకు దిగారు. పత్తికొండ- గుత్తి రహదారిలో రైతుల ఆందోళనకు దిగారు. వ్యవసాయ మార్కెట్లలో టమాటా, మిర్చి ధరలు గురువారం ఒక్కసారిగా పడిపో యాయి. కిలో టమాటా రూపాయి కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు హతాశులై మార్కెట్లలో పారబోశారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. దళారుల దోపిడీని నిరసిస్తూ పత్తికొండ- గుత్తి ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. నాణ్యత ఉన్న పంటకు గిట్టుబాటు ధర కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు. మార్కెట్లలో వ్యాపారులు కుమ్మక్కై తక్కువకు ధరలకు వేలం పాడుతుండటంపై రైతులు రగిలిపోయారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో టమాటా పంట ఒక్కసారిగా రావడంతో ధరలు ఒక్కసారి పడిపోయినట్టు మార్కెట్ యార్డు కార్యదర్శి చెబుతున్నారు. వారం రోజు లుగా టమాటా ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నా పూర్తిగా పడి పోలేదని నాణ్యతలేని పంటకు



మాత్రమే వ్యాపారులు తక్కువ ధరకు అడిగారని తోటల్లో సాగు చేసిన టమాటా క్వింటాలు ధర రూ.1,800 వరకు పలికిందని మెట్ట భూముల్లో సాగు చేసిన పంట నాణ్యత దెబ్బతినడంతో తక్కువ ధర పలుకుతోందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో రైతు బజార్లలో కిలో టమాటా ధర 25 గా ఉంది. కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో మాత్రం గురువారం కిలో ధర రుపాయి నుంచి 8 రూపాయల వరకు పలికింది. పత్తి కొండ వ్యవసాయ మార్కెట్‌లో నిత్యం 200 టన్నుల కొనుగోళ్లు జరుగుతాయి. పత్తికొండలో కొనుగోలు చేసిన వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో కూడా పంటలు అందుబాటులోకి రావడంతో పత్తికొండ నుంచి ఎగుమతి అయ్యే టమాటాకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ధర తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. గురువారం మార్కెట్లో కనీస ధరలు కూడా లేకుండా కొనడంపై రైతులు ఆగ్రహంతో టమాటాలను మార్కెట్లోనే పారబోసి వెళ్లిపోయారు. కొందరు పత్తికొండ రహదారిపై ఆందోళనకు దిగారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులో మిర్చి ధరను తగ్గించడంతో రైతులు రోడ్డుపై పారబోశారు. బహిరంగ మార్కెట్లో క్వింటాలు ధర రూ.3వేలు ఉంటే వ్యవసాయ మార్కెట్లో రూ.1200మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు పంటను చెత్తలో పారబోశారు. సంతమాగలూరు మండలం కొమ్మాలపాడులో చేలలో కోసిన పంటను చెత్త కుప్పలో పారబోశారు.



# అల్లు అర్జున్ అరెస్ట్ అక్రమం

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేటీఆర్



**హైదరాబాద్,డిసెంబర్13(వెలుతురు):** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. జాతీయ పురస్కార అందుకున్న స్టార్‌ను అరెస్ట్ చేయడం పాలకుల అభద్రతా భావానికి ఇది పరాకాష్ట అని విమర్శించారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట బాధితులకు పూర్తిగా సానుభూతి తెలుపుతాను.. కానీ ఘటనలో నిజంగా తప్పు చేసింది ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. ఘటనకు నేరుగా బాధ్యుడు కానీ అల్లు అర్జున్‌ను సాధారణ నేరగాడిలా ట్రీట్ చేయడం సరికాదని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ తీవ్ర చర్యను ఖండిస్తున్నానని తెలిపారు. హైడ్రా కూల్చివేతలతో ఇద్దరి చావుకు బాధ్యుడైన రేవంత్ రెడ్డిని కూడా ఇదే లాజిక్‌తో అరెస్ట్ చేయాలని సూచించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో ఇవాళ ఉదయం అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 105 సెక్షన్ (నాన్ బెయిలబుల్ కేసు) కింద ఐదు నుంచి పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

# పుష్ప అరెస్ట్‌తో చిత్ర పరిశ్రమ షాక్

### షూటింగ్ రద్దు చేసుకుని అల్లు ఇంటికి మెగా బ్రదర్స్

**హైదరాబాద్,డిసెంబర్13(వెలుతురు):** అల్లు అర్జున్ అరెస్టుతో ఒక్కసారిగా సినిమా పరిశ్రమలో కుదుపు వచ్చింది. ఆయన అరెస్ట్ అయిన సంగతి తెలుసుకున్న వారంతా స్పందిస్తున్నారు. మరోవైపు మెగా స్టార్ చిరంజీవి తన షూటింగ్స్ రద్దు చేసుకున్నారు. విశ్వంభర షూటింగ్‌లో ఉన్న మెగాస్టార్ చిరంజీవి సెట్ నుంచి నేరుగా అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్నారు. మొదట హాస్పిటల్‌కు, తర్వాత నాంపల్లి కోర్టుకు వస్తారని ప్రచారం జరిగింది. అల్లు అర్జున్ ను వైద్య పరీక్ష కోసం గాంధీ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. అదే సమయంలో ఇటు చిరంజీవి తన షూటింగ్ రద్దు చేసుకుని అల్లు అర్జున్ ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మెగా బ్రదర్ నాగబాబు కూడా అల్లు అర్జున్ నివాసానికి చేరుకున్నారు. చిరంజీవి, నాగబాబు ఇద్దరూ అల్లు అర్జున్ కుటుంబసభ్యులతో సమావేశం అయ్యారు.

# అల్లు అర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం

### కాంగ్రెస్ ప్రభుత్వ వైఫలం అన్న రాజాసింగ్



**హైదరాబాద్,డిసెంబర్13(వెలుతురు):** అల్లు అర్జున్ అరెస్ట్‌పై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం అన్యాయమని ట్వీట్ చేశారు. 'థియేటర్ వద్ద జరిగిన విషాదకర తొక్కిసలాట ఘటన పోలీస్ శాఖ స్పష్టమైన వైఫల్యాన్ని సూచిస్తోంది. జాతీయ అవార్డును సాధించిన అల్లు అర్జున్ తప్పు ఏమీ లేదు. అల్లు అర్జున్ తన విజయాలతో తెలుగు రాష్ట్రాలకు ఎనలేని గర్వం తెచ్చారు. సంబంధం లేని విషయంలో అతడిని బాధ్యుడిని చేయడం అన్యాయం, అసమంజసం. జనాలను నియంత్రించడంలో లోపాలను పరిష్కరించడానికి బదులుగా, సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకోవడం పరిపాలన వైఫల్యాన్ని సూచిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలను కాపాడాల్సిన బాధ్యత కలిగిన వారిని ఈ ఘటనకు బాధ్యులను చేయాలి. అల్లు అర్జున్ సేవలను గుర్తించి, అతడికి తగిన గౌరవం ఇవ్వాలి. అతడిని నేరస్థుడిలా ట్రీట్ చేయడం మంచిది కాదు' అంటూ రాజా సింగ్ ట్వీట్ చేశారు. కాగా, ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో అల్లు అర్జున్‌కు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ వైద్య పరీక్షలు ముగిసిన తరువాత నాంపల్లి కోర్టులో హాజరు పరచనున్నారు. కోర్టు తీర్పు మేరకు అల్లు అర్జున్‌ను రిమాండ్‌కు తరలించనున్నారు.

### మాజీ ఎమ్మెల్యేతో సహా

# నలుగురికి ఈడీ నోటీసులు



**హైదరాబాద్, డిసెంబర్ 13 (వెలుతురు):** భూదాన్ భూముల వ్యవహారంలో ఓ మాజీ ఎమ్మెల్యే సహా నలుగురుకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలంటూ అందులో పేర్కొంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌ను ఈడీ ఇప్పటికే విచారించిన విషయం తెలిసిందే. తాజాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేతోపాటు వంశీరాం బిల్డర్స్ సుబ్బారెడ్డి, మరో ఇద్దరికి నోటీసులు ఇచ్చింది. ఐఏఎస్ అమోయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ రెవెన్యూ పరిధిలోని 17వ సర్వే నంబర్‌లో 386 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత అన్యాక్రాంతమైనట్టు ఆరోపణలు వచ్చాయి. ఇదే సర్వేనంబర్‌లోని ప్రైవేట్ భూమి 26 ఎకరాల్లో మెరుగు గోపాల్ యాదవ్ వెంచర్ వేసి సీలింగ్ ల్యాండ్‌ను కూడా కలుపుకున్నాడు. అయితే తమ భూమిలో గోపాల్ యాదవ్ వెంచర్ వేశాడని పలువురు రైతులు ఆరోపిస్తూ అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నామని, తమ పేరిట పట్టాలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఈ వ్యవహారంపై నిగ్గుతేల్చేందుకు ఈడీ రంగంలోకి దిగింది.

### ఎర్రకోటను అప్పగించాలని

# మొఘల్ వారసుల పిటిషన్

### పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):** ఎర్రకోటను తమకు అప్పగించాలని కోరుతూ మొఘల్ వారసులు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఎర్రకోటను తమ పూర్వీకులు నిర్మించారని, దానిని ప్రభుత్వం తమకు ఇచ్చేయాలంటూ మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 మునిమనుమడి భార్య సుల్తానా బేగం ఢిల్లీ హైకోర్టులో 2021లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు దానిని కొట్టివేసింది. గతంలో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ తమ పూర్వీకుల నుంచి అక్రమంగా తీసుకున్న ఎర్రకోటను తమకు అప్పగించాలని అందులో పేర్కొన్నారు. మొదటి స్వాతంత్ర్య యుద్ధం అనంతరం మొఘలుల ఆస్తులు, ఎర్రకోట వంటి కట్టడాలను బ్రిటిష్ వారు ఆక్రమించుకున్నారని, దీంతో దేశం విడిచి వెళ్లిపోయిన నాటి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 1862లో మృతి చెందినట్లు పిటిషన్‌లో తెలిపారు. వారు నిర్మించిన ఎర్రకోటను ప్రభుత్వం ఆక్రమించుకుందని పేర్కొన్నారు. తమ ఆస్తిని తిరిగి ఇప్పించాలని కోరారు. ఆస్తిని తమకు అప్పగించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకుంటే అందుకు పరిహారం ఇప్పించాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం... ఆమె అప్పీల్‌ను తోసిపుచ్చింది.

# తెలుగుజాతికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చింది ఎన్‌టీఆర్

- తెలుగు జాతిని అగ్రపథాన నిలపడమే ఏకైక లక్ష్యం
- రాష్ట్ర జాతీయ ఉత్పత్తి 2.4 ట్రిలియన్ డాలర్లు..,
- తలసరి ఆదాయం 42 వేల డాలర్లు.. 2047 నాటికి లక్ష్యాలు
- అగ్రిటెక్ విధానాలతో రైతులకు న్యాయం చేస్తాం
- పరిశ్రమలు ఎక్కడొచ్చినా భాగస్వాములుగా స్థానిక రైతులు
- క్లీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దాలని సంకల్పం
- విజన్ డాక్యుమెంట్‌తో పాటు 20 కొత్త పాలసీలు
- అధికారం-అభివృద్ధి వికేంద్రీకరణపై ప్రత్యేక దృష్టి
- 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులు
- రేపటి నుంచి ఆంధ్రా వ్యాలీ ఓ సక్సెస్ స్టోరీ అవుతుంది
- సంకల్ప సిద్ధికి ప్రజలంతా చేతులు కలపాలి
- రాష్ట్రాభివృద్ధికి సుస్థిర ప్రభుత్వం అవసరం
- విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి చంద్రాబాబు

**విజయవాడ,డిసెంబర్13(వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ దశ దిశను మార్చేలా స్వర్ణాంధ్ర - 2047 విజన్‌ను ఆవిష్కరించడం జరిగిందని, ప్రపంచంలోని తెలుగు జాతిని ఉన్నత స్థానంలో నిలపడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో బీజం పడిందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తూ విజన్ డాక్యుమెంట్ తీసుకురావడం తమ అకుంఠిత దీక్షకు నిదర్శనమని అన్నారు.

ఈ మహాసంకల్పంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. చారిత్రక సమావేశానికి హాజరైన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. మనందరం గర్వపడే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని అన్నారు. 2047లో మనం వందేళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు జరపుకుంటామని, ఆ నాటికి భారతదేశం అగ్రదేశంగా మారాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ - 2047ను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రం కూడా ఒక స్పష్టమైన లక్ష్యంతో స్వర్ణాంధ్ర-2047ను విజన్ డాక్యుమెంట్ రూపొందించుకోవడం జరిగిం దన్నారు.

### విజన్-2020 స్ఫూర్తి

తెలుగు నేల ఔనత్యానికి, తెలుగు జాతి మేధో సంపత్తికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిపెట్టిన విజన్-2020 స్ఫూర్తితో మరో గొప్ప దార్శనిక డాక్యుమెంట్ స్వర్ణాంధ్ర-2047 ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం వేదికగా జరిగింది. పది సూత్రాల వృద్ధి సోపానాలతో విలువైన విజన్ సాక్షాత్కరించింది. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు-వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి-ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాల్లో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశల్లో సమగ్ర సాంకేతికత మార్గదర్శక సూత్రాల నవపథం ఆవిష్కృతమైంది.

ఆవిష్కరణ సభకు ముందుగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రితో కలిసి వివిధ రంగాల్లో సాధికారత దిశగా అడుగులు వేస్తున్న మహిళలు, విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరు గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ మహిళా రైతును పలకరించారు. వినూత్న విధానాలను అనుసరిస్తూ సంపద సృష్టిలో భాగస్వాములు అవుతున్న వారి స్టాళ్లను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వాములైన వివిధ రంగాలకు చెందిన వారు తమ మనోగతాన్ని ముఖ్యమంత్రితో పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర - 2047 ఏవీని ప్రదర్శించారు. అనంతరం స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యు మెంట్‌ను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆవిష్కరిం చారు. డాక్యుమెంట్‌పై సంతకాలు చేసి, బృహత్కర కార్యాచరణకు శ్రీకారం చుట్టారు.

### స్పష్టమైన ఆలోచనలతో ముందుకెళ్తున్నాం

తాను 1978 నుంచి అనేక ఎన్నికల్లో పోటీచేశాను కానీ, 93 శాతం సక్సెస్ రేటు, 57 శాతం ఓటు బదిలీని 2024 ఎన్నికల్లో మాత్రమే చూశానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సభలో అన్నారు. పవన్ కళ్యాణ్ వంటి మంచి మిత్రుడు ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. పాలన చేపట్టాక చూస్తుంటే మా ఊహలకన్న ఎక్కువ విధ్వంసం జరిగిందని తెలిసిందన్నారు. గాడితప్పిన పరిపాలనను చక్కదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని అన్నారు.

ప్రస్తుతం మన రాష్ట్రంలో తలసరి ఆదాయం మూడువేల డాలర్ల కంటే తక్కువగా ఉందని, 2047 నాటికి తలసరి ఆదాయాన్ని 42 వేల డాలర్లుకు చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించు కున్నామని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ ప్రాంతానికి వెళ్లినప్పుడల్లా మేమందరం రాళ్లు మాత్రమే చూశామని.. మీరు మాత్రం అందులో ఒక విజన్ చూశారని పవన్‌కళ్యాణ్ ఎప్పుడూ అంటుంటారని గుర్తు చేశారు. ఆ రోజు తాను అక్కడ ఒక సింగపూర్‌ను, దుబాయ్‌ను చూశానని.. న్యూయార్క్ వంటి నగరాన్ని ఎందుకు అభివృద్ధి చేయకూడదనే ఆలోచన చేసి, ముందుకెళ్లాను అని చెప్పారు.

### ముందుచూపు వల్లే హైదరాబాద్ ముందుంది




ఆనాడు చేసిన విజన్, పునాది కారణంగా హైదరాబాద్ నగరం తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో ఎక్కువ తలసరి ఆదాయం సంపాదించే రాష్ట్రంగా తయారైందని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. "1997లో 14 టాస్క్‌ఫోర్స్‌లు వేశాం. గంటల తరబడి కూర్చున్నాం. దేశంలో తొలిసారి ఓ విజన్ డాక్యుమెంట్‌ను తయారుచేశాం. విజన్-2020ను 1999, జనవరి 26న ఆవిష్కరించాం. దాని ఫలితాలను ఈ రోజు చూస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ఇదేవిధంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారమవుతుందని, అందుకు మీరందరూ ప్రత్యక్ష సాక్షులు కావాలని కోరుకుంటున్నానని చెప్పారు. విజన్ డాక్యుమెంట్ ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పాలంటూ మేము ఒక పిలుపునిస్తే ఏకంగా 17 లక్షల మంది ఆన్‌లైన్లో తమ అభిప్రాయాలు తెలియజేశారని వివరించారు. 4.50 లక్షల మంది పాఠశాల విద్యార్థులు, 38 వేల మంది కళాశాల విద్యార్థులు విజన్‌పై నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. వినూత్న ఆలోచనలు వెల్లడించారని, పారిశ్రామికవేత్తలు, నీతి ఆయోగ్, ఇంకా పలు సంస్థల సభ్యులతో దీనిపై సమీక్ష చేసి, అందరం కలిసి ఈ విజన్ డాక్యుమెంట్‌ను తయారుచేశామని వివరించారు.

### తెలుగుజాతికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చింది ఎన్‌టీఆర్

ఇలాంటి శుభసందర్భంలో నందమూరి తారకరామారావు గారిని ఒకసారి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపైనా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. తెలుగుజాతికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఏకైక నాయకుడు ఎన్‌టీఆర్ అని చెప్పారు. ఆర్థిక సంస్కరణలు అమలుచేసి దేశ ఆర్థిక స్థితిని మార్చిన వ్యక్తి తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు అని పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప వారసత్వం మన దగ్గర ఉందన్నారు.

1995లో మొదటిసారి ముఖ్యమంత్రి అయ్యానని, ప్రజల జీవితాల్లో వెలుగులు రావాలంటే, జీవన ప్రమాణాలు పెరగాలంటే సంస్కరణలు తప్పవని ఆనాడే భావించానని.. కఠిన నిర్ణయాలు తీసుకున్నామని గుర్తుచేశారు. దేశ భవిష్యత్ కూడా మార్చే శక్తి ఓ పబ్లిక్ పాలసీకి ఉంటుందని పేర్కొన్నారు. ఆనాడు ఐటీని ప్రమోట్ చేయడం వల్ల నేడు అమెరికాతో పాటు అన్ని దేశాల్లో అత్యధిక తలసరి ఆదాయాన్ని తెలుగుబిడ్డలు సంపాదిస్తున్నారని వివరించారు. ఇండియన్స్ ఇప్పటికే గ్లోబల్ లీడర్స్ అయ్యారని, గ్లోబల్ సిటిజన్స్ అయ్యే పరిస్థితికి వచ్చారని చెప్పారు. వివిధ దేశాల ప్రభుత్వాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ రాజ్యంలో కూడా మనవాళ్లే ముందున్నారని అన్నారు. 18 ఏళ్ల దొమ్మరాజు గుకేష్ అతి చిన్న వయసులో ప్రపంచ చెస్ ఛాంపియన్ కావడం తెలుగుజాతి సత్తాకు ప్రతీకన్నారు.

### జీరో పావర్టీకి అత్యంత ప్రాధాన్యం

మన దగ్గర మెరికల్లాంటి యువత ఉన్నారని.. తిరుగులేని మానవవనరులు, సహజ వనరులు, నదులు, సముద్రతీరం ఉన్నాయని.. వీటన్నింటినీ సక్రమంగా ఉపయోగించుకుంటే ఏదైనా సాధ్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీ ఉండాలనే లక్ష్యంతో పది సూత్రాలతో స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు స్పష్టం చేశారు. సమాజమే దేవాలయం.. పేదలే దేవుళ్లు అని చెప్పిన వ్యక్తి ఎన్‌టీఆర్.. ఆ స్ఫూర్తితోనే నేడు జీరో పావర్టీ కోసం సంకల్పిం చామని వివరించారు. పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ 4) విధానం ద్వారా నిరుపేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు కృషిచేయడం జరుగుతుందని వివరించారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త రావాలనేది తన సంకల్పమని చెప్పారు. 2047 నాటికి ఇది తప్పక నెరవేరుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే దిశగా కృషిచేస్తున్నామని, ఇందుకు పాలసీలు తెస్తున్నట్లు వివరించారు. మంచి పరిశ్రమలు, ఎంఎస్ఎం ఈలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పాపులేషన్ మేనేజ్ మెంట్‌పై దృష్టిసారించి, రాష్ట్రంలో నాలెడ్జ్ సొసైటీని తయారు చేసుకోవా ల్సిన అవసరముందని పునరుద్ఘాటించారు. అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందేలా అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తామని పేర్కొన్నారు.

### నదుల అనుసంధానంతో కరువు తలెత్తదు

తెలుగుదేశం పార్టీ చేసిన కృషివల్ల నీళ్లు సమృద్ధిగా ఉండే పరిస్థితి వచ్చిందని, ఈ ఏడాది భగవంతుడు కరుణించాడని ముఖ్యమంత్రి అన్నారు. ఈ రోజు అన్ని రిజర్వాయర్లలో దాదాపు 750 టీఎంసీల నీళ్లు ఉన్నాయంటే అది తెలుగుదేశం పార్టీ ఆలోచనా విధాన ఫలితమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పట్టిసీమ తరహాలో నదుల అనుసంధానం వల్ల కరువు అనే మాటరాదన్నారు. గోదావరి నుంచి పెన్నా వరకు నీళ్లు తీసుకెళ్లే అంశంపై ఎన్‌డీఏ ప్రభుత్వం ఆలోచన చేస్తోందని.. బనకచర్ల వరకు తీసుకెళ్లగలిగితే రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందే పరిస్థితి వస్తుందన్నారు. మరోవైపు గోదావరి, వంశధార అనుసంధానంపైనా ఆలోచిస్తున్నామని, ఇదే జరిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదని, దక్షిణ భారతంలోనే మనం నెంబర్‌వన్ రాష్ట్రంగా మారే పరిస్థితి వస్తుందని వివరించారు. అందుకే నీటి భద్రతకు విజన్ ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీళ్లు ఇవ్వాలని సంకల్పించామని తెలిపారు. రైతులను రాజు చేయాలనేది ఎన్‌డీఏ ప్రభుత్వం లక్ష్యమని, పంట ఉత్పత్తులకు విలువను జోడిస్తే రైతుకు మెరుగైన ఆదాయం వస్తుందని తెలిపారు.

అగ్రీ టెక్ విధానాలతో రైతులకు న్యాయం చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సంకల్పించామని, అన్ని వాహనాలను ఈవీ వాహనాలుగా తయారు చేయాలని చూస్తున్నట్టు తెలిపారు. కరెంటు ఛార్జీల్లో ఆప్టిమైజేషన్ తీసుకురావాలని చూస్తున్నామని, గతేడాది 5 రూపాయల 19 పైసలుగా ఉన్న ప్రొక్యూర్‌మెంట్ సగటు వ్యయాన్ని ఈ ఏడాదికి నాలుగు రూపాయల 80 పైసలకు తగ్గించామని, ఇంకా తగ్గించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

### అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యం

వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగం, టెక్.. ఇలా దేనికి సంబంధించిన ఉత్పత్తి అయినా ప్రపంచ మార్కెట్లో పోటీపడేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామని ముఖ్య మంత్రి అన్నారు. స్వచ్ఛాంధ్ర మన జీవితంలో భాగం కావాలని, స్వచ్ఛమైన రాష్ట్రంతో పాటు స్వచ్ఛమైన ఆలోచనలూ ముఖ్యమని పేర్కొన్నారు. ఆలోచనలు కలుషితమైతే వాతావరణం కూడా కలుషితమవుతుందని పేర్కొన్నారు. డేటా భవిష్యత్‌లో గొప్ప సంపద అని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకొని పనిచేయగలిగితే మన ఉత్పా దకత పెరుగుతుందని, సంపద సృష్టి జరుగుతుందని అన్నారు. వీటన్నింటినీ సాకారం చేసేందుకు విజన్ డాక్యుమెంట్‌తో పాటు 20 కొత్త పాలసీలు తీసుకొచ్చామని వివరించారు. జాబ్ ఫస్ట్ విధానంతో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, ఎంఎస్ఎంఈ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎలక్ట్రానిక్ పాలసీ, సెమీ కండక్టర్ పాలసీ, ప్రైవేటు పార్కు పాలసీ, క్లీన్ ఎనర్జీ పాలసీ, డ్రోన్ పాలసీ, డేటా సెంటర్ పాలసీ, స్పోర్ట్స్ పాలసీ, టూరిజం పాలసీలను తీసుకొచ్చామని వివరించారు.

త్వరలో పర్యాటకానికి కొత్త ఊపు వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో కనీసం 20 నుంచి 30 లక్షల కోట్ల రూపా యల పెట్టుబడులు రాష్ట్రానికి రావాలనే ఉద్దేశంతో పనిచేస్తు న్నట్టు చెప్పారు. 5 ఏళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో విజన్ డాక్యుమెంట్ తయారు చేశామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో అధికార వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలనే ఉద్దేశంతో 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులు పెడుతున్నామని తెలిపారు. వీటివల్ల 5 లక్షల మందికి ఉపాధి వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ వల్ల రాష్ట్రం ఎనర్జీ హబ్‌గా తయారవుతుందని, ఇందులో 10 లక్షల కోట్లు పెట్టుబడులు రావాలని, 7 లక్షల 50 వేల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు వివరించారు. అమరావతి నిర్మాణంలో భాగస్వాములవుతూ ప్రభుత్వాన్ని నమ్మి 33 వేల ఎకరాలు భూమి రైతులు ఇచ్చిన ఘనత అమరావతి రైతులదని పేర్కొన్నారు. రైతులు గత అయిదేళ్లు బాధపడ్డారని, వారిపై కేసులను విత్‌డ్రా చేయడమే కాకుండా పాలసీలను పునరుద్ధరించి ఆ రైతులను అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఎక్కడైనా పరిశ్రమలు వస్తే రైతులను కూడా భాగస్వాములను చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ అమలుకు సమగ్ర రోడ్ మ్యాప్ తయారు చేశామని తెలిపారు.

### రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు

# బాంబు బెదిరింపు

### ఆర్బీఐను పేల్చేస్తామంటూ బెదిరింపు మెయిల్

### అప్రమత్తమైన పోలీసులు.. విచారణ మొదలు

**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి బాంబు బెదిరింపు వచ్చింది. బ్యాంకును పేల్చివేస్తామంటూ బెదిరింపు మెయిల్ రావడంతో తీవ్ర కలకలం రేగింది. RBI అధికారిక వెబ్‌సైట్‌లో రష్యన్ భాషలో బెదిరింపులు వచ్చినట్లు ఒక ఇమెయిల్ వచ్చింది. ఆర్బీఐకి బెదిరింపుతో అప్రమత్తమైన పోలీసులు విచారణ చేపట్టారు. ఆర్బీఐని బాంబుతో పేల్చి వేస్తామని మెయిల్‌లో పేర్కొన్నారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే మాతా రమాబాయి మార్గ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ముంబై పోలీసులు తెలిపారు. నెల వ్యవధిలో ఇలాంటి సంఘటన జరగడం ఇది రెండోసారి. గతంలో కూడా ఆర్బీఐకి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది నవంబర్‌లోనే ఆర్బీఐ కస్టమర్ కేర్ విభాగానికి బెదిరింపు కాల్ వచ్చింది. ఉదయం 10 గంటలకు కాల్ వచ్చింది.



తాను లష్కరే తోయిబా సీఈఓ అని బ్యాంకును పేల్చేస్తామంటూ బెదిరించాడు. ఈరోజు తెల్లవారు జామున, ఢిల్లీలోని 6 ప్రముఖ పాఠశాలలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. పాఠశాలలకు ఇమెయిల్ ద్వారా ఈ బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే అనుమానాస్పదంగా ఏమీ లభించలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఢిల్లీలోని ఈస్ట్ ఆఫ్ కైలాష్ DPS, సల్వాన్ స్కూల్, మోడ్రన్ స్కూల్ మరియు కేంబ్రిడ్జ్ స్కూల్‌లకు ఇ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. పోలీసులు నాలుగు పాఠశాలలకు చేరుకుని విచారణ ప్రారంభించారు.

### ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

# ఇద్దరు మావోయిస్టులు మృతి

**బీజాపూర్,డిసెంబర్ 13 (వెలుతురు):** ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య మరోసారి ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. శుక్రవారం ఉదయం బీజాపూర్ జిల్లాలోని బాసగూడ పరిధి నేంద్ర, పన్నూరు అడవుల్లో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. దీంతో భద్రాతా బలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. కాల్పుల అనంతరం ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు లభించాయన్నారు. ఘటనా స్థలంలో రెండు బోర్ గన్లు, నక్సల్ యూనిఫామ్, ఆయుధాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నదని తెలిపారు. గురువారం దంకారుణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దండకారణ్యంలో మావోయిస్టులు సమావేశమవుతున్నట్టు పోలీస్ ఉన్నతాధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో నారాయణ్‌పూర్ జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ) బలగాలతో పాటు దంతేవాడ, బస్తర్, కొండగావ్ జిల్లాల సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వీరికి మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టుల మృతి చెందారు. కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు బస్తర్ డివిజన్‌లో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 217 మంది మావోయిస్టులు మృతిచెందారు.

## ఫోన్ లాక్కున్నందుకు కత్తితో పొడిచిన స్టూడెంట్

**లక్నో, డిసెంబర్ 13 (వెలుతురు):** కాలేజీకి మొబైల్ ఫోన్లు తెచ్చిన విద్యార్థుల నుంచి టీచర్ వాటిని స్వాధీనం చేసుకున్నాడు. ఒక జూనియర్ ఇంటర్ విద్యార్థి దీనిపై కక్షగట్టాడు. మూడు రోజుల తర్వాత కత్తితో దాడి చేసి ఆ టీచర్‌ను పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆయన మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మిహిన్‌పూర్వాలోని నవయుగ్ ఇంటర్ కాలేజీలో మొబైల్ ఫోన్లు నిషేధించారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందట ఇంగ్లీష్ టీచర్ రాజేంద్రప్రసాద్ క్లాస్‌లో విద్యార్థులను చెక్ చేశాడు. మొబైల్ ఫోన్లు తెచ్చిన వారి నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత మొబైల్ ఫోన్లను ఆ విద్యార్థులకు తిరిగి ఇచ్చేశాడు. కాగా, ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ చర్యపై కొందరు విద్యార్థులు ఆగ్రహించారు. గురువారం ఒక స్టూడెంట్ క్లాస్‌లో ఆ టీచర్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆ టీచర్‌ను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. మరోవైపు తనను కత్తితో పొడిచిన విద్యార్థికి మరో ఇద్దరు సహకరించినట్లు ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ ఆరోపించాడు. ఆయన కుటుంబం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థి దాడికి వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మిగతా ఇద్దరు విద్యార్థుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఇవి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కాదు...

### ఈవీఎం ప్రభుత్వాలు: ఎంపీ సంజయ్‌రౌత్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 13 (వెలుతురు):** జమిలి ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఉద్ధవ్ థాకరే శివసేన పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ తీవ్ర విమర్శలు చేశారు. జమిలి ఎన్నికల నిర్వహణపై సరైన పరిశోధన, సరైన సవరణలు జరగలేదని రౌత్ వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక ప్రధాని నరేంద్రమోదీ 2029 వరకు పదవిలో కొనసాగుతాడనే నమ్మకం తనకు లేదని అన్నారు. 'జమిలి ఎన్నికలకు సంబంధించి సరైన సవరణలు, పరిశోధన జరగలేదు. ప్రధాని ఎప్పుడూ తన మనసులోని మాటలు చెబుతుంటాడు. కానీ ప్రజల మనసులో ఏముంది.. ప్రతిపక్షాల మనసులో ఏముంది.. అనే విషయాలను గురించి ఆయన ఆలోచించరు. మోదీ 2029 వరకు ప్రధానిగా కొనసాగుతారనేది నాకు అనుమానమే. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పు. కేంద్రంలో, మహారాష్ట్రలో ఏర్పాటైన మీ ప్రభుత్వాలు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కావు. అవి ఈవీఎంల ద్వారా ఏర్పాటైన ప్రభుత్వాలు' అని రౌత్ వ్యాఖ్యానించారు. మరోవైపు పలువురు కాంగ్రెస్ ఎంపీలు కూడా జమిలి ఎన్నికలపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే అవకతవకలు జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని అభిప్రాయపడ్డారు. జమిలి ఎన్నికలు జరగడంవల్ల ఎన్నికల ఖర్చు భారీగా తగ్గిపోయి దేశ జీడీపీ 1.5 వరకు పెరిగే ఛాన్స్ ఉందని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ చెప్పడాన్ని కొందరు కాంగ్రెస్ ఎంపీలు తప్పుపట్టారు.

## తమిళనాడులో అగ్ని ప్రమాదం: ఏడుగురు మృతి

**చెన్నై, డిసెంబర్ 13 (వెలుతురు):** తమిళనాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. దిండిగల్ జిల్లా గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఆసుపత్రిలో చిక్కుకుపోయిన రోగులను రక్షించి ఇతర ఆసుపత్రులకు తరలించారు. పొగ కారణంగా స్పృహ కోల్పోయిన కొందరు సిబ్బందిని సైతం రక్షించి చికిత్స నిమిత్తం వేరే ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఓ బాలుడు కూడా ఉన్నట్లు తెలిసింది. మెడికల్ ఫెసిలిటీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జగదీప్ ధన్‌కడ్, మల్లిఖార్జున్‌ఖర్గేల మధ్య మాటల యుద్ధం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 13 (వెలుతురు):** రాజ్యసభలో ఇవాళ గందరగోళం నెలకొన్నది. చైర్మన్ జగదీప్ ధన్‌కడ్.. ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే మధ్య మాటల యుద్ధం సాగింది. అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. వాయిదా తీర్మానాలను స్వీకరించాలని విపక్షాలు కోరాయి. ఆ సమయంలో చైర్‌లో ఉన్న ధన్‌కడ్



మాట్లాడుతూ.. గడిచిన 30 ఏండ్లలో ఎన్ని సార్లు రూల్ 267 వాడారో తనకు తెలుసు అన్నారు. మీ విజ్ఞతకే ఈ విషయాన్ని వదిలి వేస్తున్నట్లు చెప్పారు. రికార్డు స్థాయిలో రూల్ 267 కింద వాయిదా తీర్మానాలను ఇచ్చినట్లు ధన్‌కడ్ పేర్కొన్నారు. విపక్షాలు పట్టుపట్టడంతో.. చైర్మెన్ ధన్‌కడ్ సీరియస్ అయ్యారు. నేను రైతు బిడ్డను, నేను ఎటువంటి బలహీనతను ప్రదర్శించబోనని ధన్‌కడ్ తెలిపారు. ఈ దేశం కోసం ప్రాణాలిస్తాను, ఓ రైతు బిడ్డ ఎలా ఈ స్థానంలో కూర్చున్నారన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. మీ వెకిలి చేష్టలు అందరికీ తెలుసు అని, నేను చాలా ఓపిక పట్టాను, కానీ నేటి రైతు కేవలం పంటపొలాలకే పరిమితం కాదు అని అన్నారు. రూల్స్‌ను చదువుకోవాలని, ఒకవేళ మోషన్ మూవ్ చేస్తే అది 14 రోజులు పడుతుందన్నారు. మీరు టైం తీసుకుని వచ్చి చర్చించండి, లేదంటే నేనే మీవద్దకు వచ్చి చర్చిస్తానన్నారు.

## పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదు

### ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి

### వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం - రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్

### న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు

**హైదరాబాద్,డిసెంబర్ 13(వెలుతురు):** హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు విధించారు. న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వాహకులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం విధించారు. ఔట్‌డోర్‌లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్ చేశారు. పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. పార్టీల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని.. హైదరాబాద్ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. తాగి వాహనం నడిపితే 10 వేలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. మైనర్లు వాహనం నడిపితే యజమానిపైనా కేసు నమోదు చేస్తామన్న పోలీసులు.. ర్యాష్ డ్రైవింగ్‌పై వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే.. చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# బంగ్లాదేశ్‌లో పరిస్థితులు దారుణం

### మైనార్టీ హిందువుల రక్షణ బాద్యత యూనస్ ప్రభుత్వానిదే

### లోక్‌సభకు వెల్లడించిన విదేశాంగ మంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):** బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులపై జరుగుతున్న దాడుల వ్యవహారంపై భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ లోక్‌సభలో ప్రసంగించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంపై చర్చ జరగాలన్నది కాంగ్రెస్ సభ్యుల ప్రధాన డిమాండ్. ఈమేరకు అధికార ఎన్‌డీఏ, విపక్షాల మధ్య ఒప్పందం కుదరడంతో నేడు లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చలు జరగనున్నాయి. కాగా రాజ్యసభలో ప్రతిపక్షాలు పెద్దఎత్తున చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఛైర్మన్ ఎగువ సభను సోమవారానికి వాయిదా వేశారు. అయితే బంగ్లాదేశ్‌లోని పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని జైశంకర్ పేర్కొన్నారు. వీటిని నివారించడానికి ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీలు, హిందువుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈవిషయంపై ఇటీవల భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి నేతలతో చర్చలు జరిపారన్నారు. మరోవైపు పాకిస్థాన్, భారత్‌కు మధ్య సత్సంబంధాలు నెలకొనాలంటే ఆ దేశంలో ఉగ్రవాదం పూర్తిగా నశించిపోవాలని.. అప్పుడే భారత్ పాక్‌తో చర్చలకు



ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా దేశం విడిచివెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు తీవ్ర పరిస్థితులకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో బంగ్లాదేశ్ ఇద్దరు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వారిద్దరూ ఢాకా నుంచి పని చేయాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగినట్లైంది. కాగా షేక్ హసీనా రాజీనామా అనంతరం ఆగస్టు 5 నుంచి అక్టోబరు 22 మధ్యకాలంలో మైనారిటీలపై 88 మతపరమైన హింసాత్మక ఘటనలు జరిగినట్లు ఇటీవల బంగ్లాదేశ్ ప్రభుత్వం ఓ నివేదికలో వెల్లడించింది. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై వైట్‌హౌస్ స్పందిస్తూ.. బంగ్లాలోని పరిస్థితులను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిశితంగా పరిశీలిస్తున్నారని పేర్కొంది. అక్కడి హిందువులు, మైనారిటీలకు భద్రత కల్పించాలని ఇప్పటికే ఆ దేశ నాయకులకు స్పష్టం చేశామని వైట్‌హౌస్ ప్రతినిధి జాన్ కిర్బీ వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపరిచేందుకు తాత్కాలిక ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

# రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదు

### ఎందరో మహానుభావుల అనుభవసారం

### నెహ్రూ పేరునే ఎన్నటికీ చెరిపేయలేరు

### లోక్‌సభలో రాజ్యంగంపై చర్చలో ప్రియాంక

**న్యూఢిల్లీ,డిసెంబర్13(వెలుతురు):** భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. జమిలిపైనా ప్రభుత్వం ముందుడుగు వేయడంతో వాడీవేడీగా చర్చ సాగింది. ఎందరో మహానుభావుల అనుభవ సారం మన రాజ్యాంగం అని అన్నారు. ఇందులో విపక్షాల తరఫున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చర్చను ప్రారంభించారు. ఎంపీగా ఇటీవలే పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆమె.. లోక్‌సభలో ప్రసంగం చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార భాజపా, ఆరెస్సెస్‌పై విమర్శలు చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదని ఆర్ఎస్ఎస్‌ను ఉద్దేశించి దుయ్యబట్టారు. భాజపా ఎల్లప్పుడూ గతం గురించే మాట్లాడుతుంది. కానీ, దేశ ప్రగతి కోసం ఇప్పుడేం చేస్తున్నారో వారు మాట్లాడాలన్నారు. దేశంలో జరిగే అన్నిటికీ నెహ్రూనే కారణమా నెహ్రూ పేరును, ఆయన ప్రసంగాలను మీరు పుస్తకాల నుంచి తొలగించగలరేమో.. కానీ, స్వతంత్ర్య పోరాటంలో, జాతి నిర్మాణంలో ఆయన పాత్రను చెరిపేయలేరు' అని ప్రియాంక కౌంటర్ ఇచ్చారు.. ఈ సందర్భంగా 2017లో జరిగిన ఉన్నావ్ అత్యాచార ఘటనను



ఆమె ప్రస్తావించారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు పోరాడే హక్కును రాజ్యాంగమే కల్పించిందన్నారు. ఈ సందర్భంగా అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'ఒక్కరిని కాపాడటం కోసం 142 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. సంపద, రోడ్లు, పోర్టులు, గనులు అన్నీ ఆయనకే ఇస్తున్నారు' అని మండిపడ్డారు. ప్రజల తరఫున పోరాడే ప్రతిపక్షాల గళాన్ని అణచివేసేందుకు తప్పుడు కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి విపక్ష నేతలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇతర దేశాలతో పోలిస్తే మన స్వాతంత్ర్య పోరాటం ప్రత్యేకమైనది. సత్యం, అహింస అనే పునాదులపైనే మనం పోరాడాం. మన స్వాతంత్ర్య ఉద్యమం ప్రజాస్వామ్య గళం. దాన్నుంచి ఉద్భవించినదే రాజ్యాంగం. ఇది కేవలం డాక్యుమెంట్ కాదు.. అంబేద్కర్, మౌలానా ఆజాద్, రాజగోపాలచారి, నెహ్రూ వంటి ఎంతోమంది నేతలు ఎన్నో ఏళ్ల పాటు తమ జీవితాలను అంకితం చేసి దీన్ని రూపొందించారు. ప్రజా హక్కులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే శక్తిని రాజ్యాంగం మనకు కల్పించింది. ఇది దేశ ప్రజలను కాపాడే 'సురక్షా కవచం'లా ఉంది. అయితే దీన్ని బద్దలుకొట్టేందుకు అధికార ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. గత పదేళ్లలో ఈ రక్షణ కవచాన్ని బలహీనపర్చింది. లేట్రల్ ఎంట్రీ, ప్రైవేటీకరణ వంటి చర్యలతో రిజర్వేషన్లను బలహీనపర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని ఎన్డీయే భావించింది. అది జరగకపోవడంతో ఆ ప్రతిపాదనలపై వెనక్కి తగ్గింది. ఇది సంవిధాన్.. సంఘ్ రూల్ బుక్ కాదు' అని కాంగ్రెస్ ఎంపీ దుయ్యబట్టారు. కులగణన జరగాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో చంపేస్తోన్న చలి పులి

### తగ్గిన ఉష్ణోగ్రతలు.. వణుకుతున్న జనం

**హైదరాబాద్,డిసెంబర్ 13(వెలుతురు):** తెలుగు రాష్ట్రాలనూ మంచు ముంచేస్తోంది. చలితీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అటు దట్టమైన మంచుతో వాహనాలు, విమానాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా పొగ మంచు కురుస్తోంది. పొగమంచుతో విమానాల రాకపోకలపై ప్రభావం పడుతోంది. బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ వెళ్లే విమానాలు ఆలస్యం అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పొగమంచు ప్రభావం రోజురోజుకీ ఎక్కువవుతోంది. ఇక మంచు ఎక్కువగా ఉండటంతో విమానాల రాకపోకలకు సైతం ఆటంకం కలుగుతోంది. ఆదిలాబాద్, అల్లూరి జిల్లాల్లో కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రెండు రాష్ట్రాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. అటు ఏపీలోని అల్లూరి



సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో అత్యల్పంగా 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.ఉత్తర, ఈశాన్య భారతం మీదుగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులను చలి వణికిస్తోంది. రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లా వ్యాప్తంగా మంచు కమ్మేసింది. ఆదిలాబాద్‌లో కనిష్ఠంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చలికి తోడు గాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో చలిపంజా విసురుతోంది. దీంతో నగర వాసులు బయటకు వచ్చేందుకు వణుకుతున్నారు.. ఉదయం 9 దాటినా చలి తీవ్రత కొనసాగుతోంది.

# అత్యుత్తమ విధానాలను జూ పార్కుల్లో అమలుకు చర్యలు

- **జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైన సౌకర్యాలతో తీర్చిదిద్ది సందర్శకులను ఆకట్టుకునేలా కార్యాచరణను అమలుచేయాలన్న మంత్రి సురేఖ**
- **అటవీ అధికారులతో కలిసి యానిమల్ అడాప్షన్ స్కీమ్ బ్రోచర్, డైరీ, కాఫీ టేబుల్ బుక్ ను ఆవిష్కరించిన మంత్రి**
- **జంతువుల భావోద్వేగాలను గమనిస్తూ, వాటిని సంరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని సూచన**
- **వరంగల్‌లోని కాకతీయ జూ పార్కుకు రెండు వైట్ టైగర్‌లు, సింహాన్ని తెప్పించే దిశగా సెంట్రల్ జూ అథారిటీని సంప్రదించాలని సూచన**
- **కోతుల బెడద నివారణకు కోఆర్డినేషన్ కమిటీల మీటింగ్ నిర్వహించాలని ఆదేశం**
- **జూస్ అండ్ పార్క్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ 13వ గవర్నింగ్ బాడీ సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి కొండా సురేఖ**



**హైదరాబాద్,డిసెంబర్ 13(వెలుతురు):** రాష్ట్రంలోని అన్ని జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైర సౌకర్యాలతో తీర్చిదిద్ది, పర్యావరణహిత కార్యక్రమాలతో సందర్శకులను ఆకట్టుకునేలా కార్యాచరణను అమలుచేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అటవీశాఖను ఆదేశించారు.

ఈ రోజు డా.బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో కొండా సురేఖ ఆధ్వర్యంలో జూస్ అండ్ పార్క్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ 13వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అటవీ అధికారులతో కలిసి యానిమల్ అడాప్షన్ స్కీమ్ బ్రోచర్, డైరీ, కాఫీ టేబుల్ బుక్ ను మంత్రి సురేఖ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సందర్శకుల అభిరుచుల మేరకు, పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా, అటవీశాఖకు ఆదాయం సమకూరే విధంగా పకడ్బందీ ప్రణాళికలతో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ పనిచేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రపంచవ్యాప్తంగా జూ పార్కుల్లో అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తొమ్మిది జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను అధికారులకు మంత్రి సురేఖకు వివరించారు.

రాష్ట్రంలోని నెహ్రూ జూ పార్క్, కాకతీయ జూ పార్క్, పిల్లల మర్రి మినీ జూపార్క్, లోయర్ మానేరు డీర్ పార్క్, కిన్నెరసాని డీర్ పార్క్ జంతు సంరక్షణ చర్యలు, కేబీఆర్, మృగవని, మహవీర్ హరిణ వనస్థలి, ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సందర్శకుల సంఖ్య పెరిగే విధంగా అమలు చేయాల్సిన అదనపు సౌకర్యాలపై మంత్రి సురేఖ అధికారులకు పలు సూచనలు చేశారు.

జంతువుల దత్తతపైఅనుసరిస్తున్న విధివిధానాలపై మంత్రి సురేఖ ఆరా తీశారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన నిమిత్తం ఆన్లైన్‌లో టికెట్ బుకింగ్, ఇంటిగ్రేటెడ్ ఫాస్ట్ ట్రాక్ పార్కింగ్ వంటి ఎన్నో సదుపాయాలను కల్పిస్తున్నట్లు జూ పార్క్స్ డైరక్టర్ సునీల్ ఎస్. హేరామత్ మంత్రి సురేఖ గారికి వివరించారు. వృద్ధులు, చిన్నపిల్లల సౌకర్యాల నిమిత్తం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు.

### వరంగల్ కాకతీయ జూ పార్కుపై ప్రత్యేక దృష్టి


కాకతీయ జూ పార్కు మధ్య గుండా పోతున్న వరదనీటి డ్రైనేజీ కారణంగా దుర్వాసన వస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, డ్రైనేజీని జూ పార్కు బయటకు మళ్ళించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కాకతీయ జూ పార్కుకు రెండు వైట్ టైగర్ లు, సింహాన్ని తెప్పించే దిశగా సెంట్రల్ జూ అథారిటీని సంప్రదించాలని మంత్రి చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్‌ను ఆదేశించారు. ఈ మధ్యే వరంగల్ జూ పార్కుకు పులిని తరలించిన తర్వాత సందర్శకుల సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. వరంగల్ జూ పార్కుతో పాటు ఇతర జూ పార్కుల్లో ఎన్విరాన్ మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు.

### కోతుల సమస్య నివారణకు...

కోతుల బెడద నివారణకు సంబంధిత అన్ని శాఖలతో కోఆర్డినేషన్ కమిటి మీటింగ్ నిర్వహించి, కోతుల సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం కనుగొనేలా చర్యలు చేపట్టాల న్నారు. కోతులను వన్యప్రాణి జాబితా నుండి తొలగించినందు వల్ల ఈ దిశగా కచ్చితమైన విధివిధానాలను రూపొందించి కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ డోబ్రియాల్ ను ఆదేశించారు.



మనం మన ఆహారంతోపాటుగా అనుసరించే అంశాలలో నీరు తాగడం కూడా ఒకటి. అంతేకాదు, ఇది మనలో అనేక మందికి తప్పనిసరి అలవాటుగా ఉంటుంది. అవునా? ఆహారం సులభంగా కడుపులోకి వెళ్ళాలన్న ఆలోచనతో నీరు తరచుగా తీసుకోవడం జరుగుతుంటుంది. కొందరైతే ఆహారం కన్నా అధికంగా నీటిని తీసుకుంటూ ఉంటారు. లేనిచో దాహంతో కూడిన అనుభూతికి లోనవుతూ ఉంటారు. నీరు ఎంత గొప్పదయినప్పటికీ, జీవితంలో మనకు అందుబాటులో ఉండే అమృతం వలె ఉన్నప్పటికీ, రోజులో తరచుగా తీసుకుంటున్నాకూడా, భోజనం చేసేటప్పుడు సాధ్యమైనంత తక్కువగా వినియోగింపబడాలని గుర్తుంచుకోండి. కొందరైతే ఆహారం పూర్తిగా తీసుకున్న తర్వాత, ఒకేసారి నీటిని స్వీకరిస్తుంటారు. కానీ ఎంత సమయం తర్వాత తీసుకోవాలి, మరియు ఎంత మోతాదులో తీసుకోవాలి అన్న విషయాలు కూడా ప్రామాణికంగా ఉంటాయి.



మొదట్లో ఈ నియమాన్ని అనుసరించడం కొంచెం అసాధ్యంగానే అనిపించవచ్చు, కానీ అలవాటుగా చేయడం మొదలుపెడితే క్రమంగా సులభమవుతుంది. ఇవన్నీ చదివిన తరువాత, మీ తల తిరిగే ప్రశ్న ఒకటి మెదులుతుంది. ఆహారం తీసుకున్న వెంటనే నీరు తాగవచ్చా? లేక కొంత సమయం వేచి ఉండాలా? అయితే ఎందుకు? ఆహారం తీసుకున్న తర్వాత, తక్షణమే నీరు ఎందుకు త్రాగకూడదు?

## భోజనం చేసిన ఎంత సమయం తర్వాత

# నీళ్ళు తాగాలి?

ఆహారం తరువాత మాత్రమే నీటిని పరిహరించాలి అన్నది తప్పు అని గ్రహించాలి. వాస్తవానికి ఇది మూడు విధాల ప్రక్రియగా ఉంటుంది. ఆహారం ముందు, ఆహారం తీసుకునే సమయంలో మరియు ఆహారం తీసుకున్న తర్వాత నీటిని తీసుకోవలసి ఉంటుంది. అది కూడా కొద్ది మొత్తాలలో.

ఆహారం తీసుకున్న తర్వాత నీటిని తీసుకునేందుకు కనీసం అరగంట వేచి ఉండాలని గుర్తుంచుకోండి. మరియు గ్లాసును మించిన మోతాదు లేకుండా చూసుకోండి. ఎందుకంటే, మనం మన ఆహారాన్ని జీర్ణం చేసుకోవడానికి సుమారుగా రెండు గంటల సమయం పడుతుంది. ఆహారం, మన అన్నవాహిక నుండి జీర్ణాశయానికి, ఆతర్వాత మన పెద్దపేగుకు చేరి, చివరకు మన శరీరం నుంచి బయటకు విసర్జించబడుతుంది.

మన దేహం ఆహారాన్ని జీర్ణం చేసే సమయంలో ఉత్పత్తి అయ్యే ఒక నిర్ధిష్ట ద్రవం, ఘననిష్పత్తిలో ఉంటుంది. ఆహారం తిన్న తరువాత నేరుగా నీటిని సేవించినప్పుడు ఈ సంతులనం అంతరాయానికి గురవుతుంది. ఇది ఆహారం జీర్ణం కావడానికి తీసుకునే సహజ సమయాన్ని అస్తవ్యస్తం చేయడంతో పాటుగా, సాధారణం కన్నా అధిక క్యాలరీల వినియోగానికి దారితీస్తుంది. అంతేకాకుండా కడుపు ఉబ్బరం వంటి జీర్ణ సంబంధ సమస్యలకు దారితీస్తుంది.

ఆహారం మరియు నీటిని వినియోగించే సమయంలో, కనీసం 30 నిమిషాల వ్యవధి ఉండాలని సిఫార్సు చేయబడుతుంది. ఈ 30 నిముషాలలో మన శరీరం జీర్ణక్రియలలోని తరువాతి దశలోనికి ప్రవేశిస్తాయి. ఆహారంతో పాటుగా నీరు అధికం తీసుకోవడం మూలంగా జీర్ణక్రియ ప్రక్రియలకి అంతరాయం ఉంటుంది. కానీ కాస్త వ్యవధిని ఇచ్చిన తర్వాత నీటిని కొద్ది మొత్తాలలో తీసుకోవడం ద్వారా, జీర్ణక్రియలు సులభంగా జరిగేందుకు వీలవుతుంది. ఆహారం తీసుకున్న తర్వాత నేరుగా నీటిని తాగడం మూలంగా జీర్ణక్రియలో అత్యంత ముఖ్యమైన జీర్ణ రసాలు మరియు ఎంజైములు కూడా కరిగింపబడుతాయి. క్రమంగా ఈ ఎంజైములు తక్కువగా ఉన్న కారణంగా మన శరీరంలో ఆమ్ల స్థాయిలు పెరిగేందుకు దారితీస్తుంది. క్రమంగా గుండెల్లో మంట, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలకు కూడా దారితీస్తుంది. ఒక్కోసారి తీసుకునే ఆహారాన్ని అనుసరించి తీవ్రతరం కూడా కావొచ్చు.

ఆహారాన్ని జీర్ణం చేసే సమయంలో, కొన్ని అవసరమైన పోషకాలు కూడా శరీరం ద్వారా శోషించబడతాయి; అయితే, భోజనం తరువాత నేరుగా నీటిని తాగడం మూలంగా, పోషకాలు శోషించుకునే ఆస్కారం లేక, నేరుగా జీర్ణవ్యవస్థకు తరలించబడుతాయి. క్రమంగా మీరు ఎంత పోషకభరితమైన ఆహారం తీసుకున్నా కూడా, సరైన పోషకాలు మీ శరీరానికి అందకుండా జీర్ణమైపోతాయి.

భోజనం తర్వాత నేరుగా నీటిని తీసుకునే అలవాటు కారణంగా, ఈ ప్రక్రియ జీర్ణక్రియను ప్రభావితం చేయడమే కాకుండా, మనం తీసుకునే ఆహారంలోని నాణ్యతను కూడా దెబ్బతీస్తుంది. అన్నిటిని మించి, నీటికి సహజ సిద్ధంగా ఆహార ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించే లక్షణాన్ని కలిగి ఉంటుంది. క్రమంగా మనం వినియోగించే అన్నిరకాల ఆహారాలకి చల్లదనాన్ని జోడిస్తుంది. కావున అతిశీతల నీటిని ఆహార సమయంలో వినియోగించడం కూడా కడుపు ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుందని గుర్తుంచుకోవాలి.

ఇది మన శరీరాలకి నిజంగా ప్రతికూలమైన అంశంగా ఉంటూ, స్థూల కాయానికి కూడా దారితీస్తుందని చెప్పబడుతుంది. జీర్ణక్రియ ప్రక్రియను ప్రధానంగా ప్రభావితం చేయడం ద్వారా, జీర్ణ వ్యవస్థలో మిగిలిపోయిన జీర్ణంకాని ఆహారం ద్వారా అదనపు కొవ్వు నిక్షేపాలను పెంచడం ద్వారా ఊబకాయానికి దారితీయవచ్చు. మన శరీరంలో పేరుకుని ఉండే జీర్ణంకాని ఆహారం నుండి వెలువడే గ్లూకోజ్, కొవ్వుగా మారుతుంది.

క్రమంగా మన శరీరంలో స్థానం ఏర్పరచుకుంటూ ఉంటుంది.

దీని మూలంగా మన శరీరంలోని ఇన్సులిన్ స్థాయిలు పెరగడమే కాకుండా రక్తంలోని చక్కెర స్థాయిలు కూడా పెరగడానికి కారణమవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం మూలంగా మధుమేహం, ఊబకాయం వంటి వ్యాధులకు దారితీస్తుంది.

ఊబకాయం మరియు మధుమేహం మాత్రమే కాకుండా, ఆహారం తరువాత నేరుగా నీటిని తీసుకోవడం ద్వారా, యూరిక్ యాసిడ్ స్థాయిలు, ఎల్ డిఎల్ కొలెస్ట్రాల్, వి.ఎల్.డి.ఎల్ మరియు ట్రైగ్లిజరైడ్లు కూడా పెరుగుతాయి. అన్నివేళలా మిమ్మల్ని మీరు హైడ్రేట్‌గా ఉంచుకోవాలని మరియు సాధ్యమైనంత వరకు నీటిని తాగాలని, క్రమంగా భోజనం విషయంలో, ఆహారం తీసుకున్న ముప్పై నిమిషాల తరువాత, నీరు తాగేలా అలవాటు చేసుకోండి. ఈలోపు అవసరమైతే ఒక సిప్ తీసుకోండి. ఏ అలవాటు కూడా అంత తేలికగా వెంటనే అలవడడం సాధ్యం కాదు. కానీ ఆరోగ్యం దృష్ట్యా ఆలోచన చేస్తే, ఒక క్రమశిక్షణ మరియు పట్టుదలమీద దేన్నైనా సాధించవచ్చునని గుర్తుంచుకోండి.

మీరు తీసుకునే ఈ చిన్నఅడుగును ఒక అలవాటుగా చేసుకోవడం ద్వారా మీకు మంచి జీర్ణ వ్యవస్థను అందివ్వగలుగుతుంది. కాబట్టి, నీటిని తరచుగా తాగండి, కేవలం ఆహారం తీసుకునే సమయంలో మాత్రమే కొన్ని జాగ్రత్తలు అనుసరించవలసి ఉంటుందని గుర్తుంచుకోండి.

### ఎల్ డిఎల్ (తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రోటీన్లు, చెడు కొలెస్ట్రాల్):

దీన్నే చెడు కొలెస్ట్రాల్ అని కూడా వ్యవహరిస్తారు. పైన చెప్పిన విధంగా మన శరీరంలోని జీర్ణంకాని ఆహారం, శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి దారితీసే ఫ్యాట్ గా మారుతుంది. అంతేకాక, ఎల్.డీ.ఎల్ కొలెస్టరాల్ స్థాయిలు పెరిగిననప్పుడు, ధమనులు, సిరల మధ్యలో కొవ్వు నిక్షేపాలు పేరుకునిపోవడం ద్వారా గుండెకు రక్తసరఫరాలో ఆటంకం ఏర్పడుతుంది. క్రమంగా ఈ పరిస్థితి శరీరంలో రక్తపోటును పెంచుతుంది, ఇది తరచుగా జరుగుతున్న ఎడల, గుండెపోటుకు కూడా దారితీస్తుంది.

### వి.ఎల్.డి.ఎల్ (అతి తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రోటీన్లు):

ఎల్.డీ.ఎల్ కన్నా అధ్వాన్నమైన చెడు కొలెస్ట్రాల్ వి.ఎల్.డి.ఎల్. మన శరీరంలో వి.ఎల్.డి.ఎల్, జీర్ణ క్రియలు సక్రమంగా లేకపోవడం మూలాన పెరుగుతుంది. మరియు దీర్ఘకాలికంగా వి.ఎల్.డి.ఎల్ స్థాయిలు పెరిగుతున్న ఎడల, అది ప్రాణాంతకం కావొచ్చు.

### యూరిక్ ఆమ్లం:

యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడం మూలాన మోకాళ్ల నొప్పులు, భుజం నొప్పులు కలగడంతో పాటుగా, మణికట్టు కీళ్లలో కూడా నొప్పి పెరిగేందుకు కారణంగా తయారవుతుంది. ఇది చీలమండలు, మోచేతులు, మణికట్టు వంటి ప్రదేశాలలో వాపుకు దారితీస్తుంది.

### ట్రైగ్లిసరైడ్స్

జీర్ణంకాని ఆహార నిక్షేపాలు పేరుకుని పోవడం, భోజనం తర్వాత నేరుగా నీరు సేవించడం మూలాన ట్రైగ్లిసరాయిడ్స్ స్థాయిలు పెరగడానికి దారితీస్తుంది. ట్రైగ్లిసరాయిడ్స్ అనేవి ప్రాథమికంగా సహజ కొవ్వులుగా, మరియు నూనెల్లో ప్రధానమైన భాగాలుగా ఉంటాయి. అందువలన, అధిక ట్రైగ్లిజరైడ్ స్థాయిలు గుండె ప్రమాదాలకు దారితీయవచ్చు మరియు అత్యంత తీవ్రమైన పరిస్థితుల్లో మెదడు లేదా గుండెకు పూర్తిగా రక్తసరఫరాను ఆపివేసి, ప్రాణాంతకంగా పరిణమించవచ్చు. అంతేకాక, కొంత మంది ఆహారం తిన్న తరువాత ఐస్ కోల్డ్ వాటర్ త్రాగడానికి మొగ్గు చూపుతారు, ఇది జీర్ణ క్రియలను పూర్తిగా చంపేస్తుంది. ఇది మన శరీరంలో జీర్ణంకాని ఆహారం పేరుకుపోవడం, గుండె వైఫల్యం, మధుమేహం మరియు ఊబకాయం వంటి తీవ్ర పరిస్థితులకు కారణంగా మారుతుంది. అందువల్ల, మన జీవితంలో నీరు ఒక ముఖ్యమైన భాగంగానే కాకుండా కొన్ని పరిమితులతో కూడుకుని ఉంటుందని గుర్తుంచుకోవలసి ఉంటుంది. మరియు రోజులో 8 లీటర్ల కంటే తక్కువ నీటిని సేవించరాదని చెప్పబడుతుంది. అయితే దేనికైనా ఒక సమయం, సందర్భం ఉంటాయని మరచిపోకూడదు.

# ప్రసవానంతరం ప్రశాంతంగా...

శిశువుకు జన్మనివ్వడం అనేది కేవలం శారీరక విషయమేమీ కాదు. అది స్త్రీ మనసును అమితంగా ప్రభావితం చేసే అంశం. సహజంగా ప్రసవం అనేది ఎక్కువ మందిలో ఆనందోద్వేగాన్ని నింపుతుంది. కానీ కొంత మందిలో అది కొన్ని మానసిక సమస్యలకు కూడా కారణం అవుతుంది. ఈ ప్రసవానంతర సమస్యలు (పోస్ట్‌పార్టమ్ బ్లూస్) ఒక్కొక్కరిలో ఒక్కో లక్షణంతో బయటపడుతుంటాయి. ఈ కారణంగా కొందరు తీవ్రమైన డిప్రెషన్‌కు గురయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇందుకు గల కారణాలేమిటో ఇప్పటి వరకూ అంత స్పష్టంగా తెలియదు గానీ, ప్రసవించగానే ప్రొజెస్టరాన్ హార్మోన్ నిల్వలు భారీగా పడిపోవడం ఒక ప్రధాన కారణం అన్నది ఎండోక్రినాలజిస్టుల అభిప్రాయం. అయితే బిడ్డకు చనుబాలు



ఇస్తున్నప్పుడు ప్రొలాక్టిన్ విడుదల కావడంతో ఆమె మనసు శాంతించే అవకాశాలు ఉంటాయి. మందులు లేకుండానే రుగ్మత నుంచి బయటపడేలా చేసే ఒక సహజ మార్గమిది. అయితే ఈ ప్రయోజనం అందరికీ ఉండదు. మిగతా కొందరిలో వివిధ ప్రతికూల లక్షణాలు కనిపిస్తాయి.

వాటిల్లో ఆకలి తగ్గిపోవడం, నిద్రలేమి, ఏకాగ్రతా లోపాలు, ఆత్మన్యూనతా భావం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ పరిస్థితిలో మానసిక వైద్యులు యాంటీడిప్రెషంట్లు, ట్రాంక్విలైజర్లు సూచిస్తుంటారు. పైన పేర్కొన్న లక్షణాలతో పాటు కొందరిలో నిరంతరమైన ఆందోళన, అసహనం, ఒళ్లంతా చెమటలు పట్టడం, మగతగా ఉండడం, గుండెదడ, కండరాలు బిగుసుకుపోవడం వంటివి కూడా కనిపిస్తాయి. ఈ స్థితిలో మానసిక వైద్యచికిత్సలు అవసరమైతే కౌన్సెలింగ్ కూడా ఇప్పించాలి. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు కూడా కొన్ని విధులు నిర్వహించాలి. ముఖ్యంగా....

మెలో ఉన్న లక్షణాలన్నీ ప్రసవానంతర రోజుల్లో అందరిలోనూ కనిపించేవేనని చెప్పాలి. అదే సమయంలో అవన్నీ తాత్కాలికమేనని, శరీరం కాస్త శక్తి పుంజుకోగానే అన్నీ సర్దుకుంటాయని కూడా చెప్పాలి.

భర్త లేదా ఇతర కుటుంబ సభ్యులు ప్రతి విషయంలోనూ చేదోడుగా ఉండాలి. అలా ఉన్నవారిలో ఈ సమస్యలు చాలా తక్కువగానే ఉంటాయి. ప్రత్యేకించి పాప ఆలనాపాలనా అంతా తల్లిపైనే వదిలేయకుండా, ఇంట్లో వాళ్లే అవన్నీ చూసుకోవాలి.

పిల్లల పోషణలో బాగా అనుభవం ఉన్న మహిళలు సాధ్యమైనంత ఎక్కువ సమయం ఆమెతో ఉండే ఏర్పాట్లు చేయాలి. ఈ స్థితిలో దూర ప్రయాణం గానీ, కొత్త ఉద్యోగాలకు లేదా కొత్త ప్రదేశాలకు తీసుకువెళ్లడంగానీ చేయకూడదు. విశ్రాంతి సమయాన్ని బాగా పెంచాలి. ఆ సమయంలో పిల్లలు ఆమెను ఇబ్బంది పెట్టకుండా చూడాలి.

ఎప్పుడూ ఒంటరిగా ఉంచకూడదు. రిలాక్స్ అయ్యే అవకాశాలు పెంచడంతో పాటు, ఆమె తన ఆత్మీయులను కలిసే అవకాశం కలిగించాలి. ఒక శిశు వైద్యుడు, ఒక మానసిక వైద్య నిపుణుడు అవసరమైనప్పుడు అందుబాటులో ఉండే ఏర్పాట్లు చేసుకోవాలి.

# ఇవి తింటే బరువు పెరగరట..?

మామూలుగా ఏవి ఎక్కువగా తింటే బరువు పెరుగుతారన్న విషయం చాలా మందికి తెలిసే ఉంటుంది. కానీ బరువును తగ్గించే ఆహారపదార్థాలేమిటన్న విషయం చాలా మందికి తెలియకపోవచ్చు ఆరు రకాల ఆహారాల వల్ల బరువు పెరగరని నిపుణులు చెబుతున్నారు. ఉడికించిన కోడిగుడ్డు తింటే బరువు తగ్గుతారట! దీనిలోని ల్యూసిన్ అనే అమైనో యాసిడ్ బరువు తగ్గించడానికి సహాయపడుతుందట. అలాగే దానిమ్మ గింజలు ఎన్ని తిన్నా మంచిదే అని చెబుతున్నారు నిపుణులు. కొన్ని గింజలు తిన్నా కడుపు నిండిన ఫీలింగ్ కలిగి ఆహారం తీసుకోవలన్న కోరిక నశిస్తుందట! ఇక ఆహార పదార్థాల తయారీకి ఆలివ్ ఆయిల్ ఉపయోగిస్తే మంచిదని వారు చెబుతున్నారు. ఈ నూనెలోని మోనో శాచ్యురేటెడ్ ఫ్యాటీ



యాసిడ్స్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను కాపాడతాయి. కాబట్టి బరువు పెరిగే సమస్యే లేదు.

చేపల్లో కొవ్వు ఉండదు. అందుకే క్యాలరీలు చాలా తక్కువ. కాబట్టి మాంసాల జోలికి పోకుండా వీలైనంత ఎక్కువగా చేపలు తింటే నాన్ వెజ్ తిన్న ఫీలింగూ ఉంటుంది, బరువూ పెరగరు. పచ్చని కాయగూరలు, ఆకుకూరల్లో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండినట్టు అనిపిస్తుందట. కాబట్టి ముదురు ఆకుపచ్చ రంగుల్లో ఉండే కూరగాయలను ఎక్కువగా తింటే బరువు పెరగరు. వెజిటబుల్ సూప్స్ వల్ల కూడా క్యాలరీలు పెద్దగా పెరగవు. పైగా భోజనం ముందు వాటిని తాగితే కడుపు నిండినట్టు అనిపించి ఎక్కువ తినం.

# జిమ్ రూల్స్

జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేయటం మీదే దృష్టి పెడతాం. కానీ అందుకోసం వేసుకోవలసిన దుస్తులు, షూ గురించి పెద్దగా పట్టించుకోం. కానీ వ్యాయామం సౌకర్యంగా ఉండాలన్నా, వ్యాయామం వల్ల శారీరక సమస్యలు తలెత్తకుండా ఉండాలన్నా జిమ్ డ్రస్సింగ్‌లో కొన్ని నియమాలు పాటించాలి. అవేంటంటే...


**షూ:** సింపుల్ వర్కవుట్‌కి ఉపయోగపడే బేసిక్ రన్నింగ్ షూస్ వేసుకోవాలి. వ్యాయామం చేసే సమయంలో కాలి కీళ్లు దెబ్బతినకుండా ఉండాలంటే మేలు రకం స్పోర్ట్స్ షూ వేసుకోవటం తప్పనిసరి.

**హూడీ:** హూడీ వేసుకోవటం అలవాటున్నా లేకపోయినా అప్పుడప్పుడూ వేసుకుని వ్యాయామం చేస్తూ ఉండాలి. ఇది వేసుకుని వ్యాయామం చేయటం వల్ల చమట ఎక్కువగా పట్టి అదనపు కిలోలు తరుగుతాయి.

**చమట పీల్చుకునే టీషర్ట్:** ట్రైనింగ్ టీషర్ట్స్ ఎంచుకోవాలి. వ్యాయామం చేయటం వల్ల చమట పట్టి, ఆ చమటతో టీషర్ట్ తడిసిపోతే... అలాగే వర్కవుట్ చేయటం మనతోపాటు పక్కనున్నవాళ్లకూ అసౌకర్యంగా ఉంటుంది. కాబట్టి స్వెట్ రెసిస్టెంట్ మెటీరియల్‌తో తయారైన టీషర్ట్‌నే వేసుకోవాలి.

**ఫిట్‌నెస్ ట్రాకర్:** ఫిట్‌నెస్ గురించి అప్ టు డేట్ ఉండాలంటే ఫిట్‌నెస్ ట్రాకర్ ధరించాలి. గుండె కొట్టుకునే వేగం, ఖర్చయ్యే కెలోరీల లెక్క తెలియటం కోసం జిమ్‌కి వెళ్లేటప్పుడు ఫిట్‌నెస్ ట్రాకర్‌ని వెంట తీసుకెళ్లండి.

**తాజా సాక్స్:** వారం మొత్తానికి సరిపడా ఏడు జతల సాక్స్ ఉంచుకోవాలి. రోజూ సాక్స్ మారుస్తూ ఉంటే అవి దుర్వాసన రాకుండా



ఉంటాయి. పాదాలకు ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉంటుంది.

Daivamm digital

## స్వర్ణ నారసింహుని

# తొలి బ్రహ్మోత్సవం

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్మితమై, కిందటి ఏడాది హైదరాబాద్‌లో ప్రారంభమైన స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి స్వర్ణ దేవాలయం వార్షికోత్సవాలు శుక్రవారం మొదలయ్యాయి. స్వర్ణ దేవాలయంలోని స్వామి వారికి అయిదురోజుల వార్షిక బ్రహ్మోత్సవాలతో పాటు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి మూడు రోజుల చతుర్దశ మహోత్సవాలను కూడా నిర్వహిస్తున్నారు. ఈ



ఉత్సవాల్లో భాగంగా హోమాలు, పల్లకి సేవలు, కల్యాణోత్సవం, నామ సంకీర్తన, భాగవతోపదేశం ఉంటాయి. సాంస్కృతిక కార్యక్రమాలనూ, ఆధ్యాత్మిక ప్రవచనాలనూ కూడా ఏర్పాటు చేశారు.

మే 17 నుంచి 19 వరకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి చతుర్దశ మహోత్సవాలు

**ఎక్కడ?:** హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లో

**ఇదీ విశిష్టత:** రాతిపై నిలిచిన ఆకృతిలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి స్వయంభువుగా ఇక్కడ వెలిశాడని పెద్దలు చెబుతారు. ఆలయంలో స్వామి వారి మూల విరాట్టు సుమారు 1300 ఏళ్ళ కిందటిదని భావిస్తున్నారు. కాగా, 400 ఏళ్ళ నుంచీ ఇక్కడ స్వామి భక్తులతో పూజలందుకుంటున్నారు. పంతొమ్మిదివందల తొంభై మూడు నుంచి దేవాదాయ శాఖ పరిధిలో, రెండువేల రెండు నుంచి యాదగిరిగుట్ట ఆలయ యాజమాన్యంలో ఉన్న ఈ ఆలయ పరిరక్షణ బాధ్యతలను హరేకృష్ణ మూవ్‌మెంట్ స్వీకరించింది. పురాతన ఆలయాన్ని రూ. పదిహేను కోట్ల రూపాయలతో పునరుద్ధరించి, స్వర్ణ దేవాలయంగా తీర్చిదిద్దింది.

## భక్తితో సమర్పించేదే

# భగవంతుడికి భోజనం

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి**
**తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః**

"పత్రం కానీ, పుష్పం కానీ, ఫలమునుగానీ, జలమునుగానీ.. ఎవరైతే నాకు భక్తితో సమర్పిస్తారో వాటిని నేను ఆరగిస్తాను" అన్నాడు భగవంతుడు. భగవంతునికి మనం భక్తితో ఇచ్చేదే భోజనం. నిజానికి పత్రమైనా, పుష్పమైనా, ఫలమైనా, జలమైనా.. అన్నీ ఆయన ప్రకృతిద్వారా మనకి ప్రసాదించినవే కదా! ఆయన వస్తువులను ఆయనకే భోజ్య పదార్థ రూపంలో మనం ఇవ్వడమేమిటి? ఆయన స్వీకరించడం ఏమిటి? మనల్ని కృతార్థులను చేయడమేంటి? అంటే.. అది ఒక దివ్యమైన అనుభూతి అంతే. పైన పేర్కొనబడిన ఆకులు, పువ్వులు, పండ్లు, నీరు సర్వసామాన్యంగా సంవత్సరం పొడవునా లభించేవే. ఆయన ఇచ్చినవాటిని ఆయనకే సమర్పించడం అంటే మన కర్మ ఫలాన్ని త్యాగం చేయడమే.

భగవంతుడికి మనం సమర్పించేవాటిలో పత్రం (ఆకు) మనసుకు ప్రతీక. ఆకులాగే మనసు అల్లల్లాడుతూ ఉంటుంది. అటువంటి చపలమైన మనసుని స్థిరుడైన దేవునికి అర్పించడమే పత్రసమర్పణలో అంతరార్థం. భారరహితమైన ఆకుతో.. అతిసూక్ష్మంగా కనపడే తులసిదళంతో.. రుక్మిణి సాక్షాత్తు శ్రీకృష్ణ రూపంలోని భగవంతుడిని తూచలేదా. 'భక్తి భావ భారము' అనంతమని విశదపడలేదా. నీ 'ఆర్తియే' భగవంతుడి ఆకలిని తీర్చగలదు. ప్రేమ తత్వరూప భక్తుడికి 'ఇవ్వడమే' తెలుస్తుంది. ఏ విధమైన ఫలితాన్నీ ఆశించకుండా (ఫలాపేక్ష రహితం) ఉండడమే భగవత్ తత్వం. సమర్పించడంలో భక్తి శాతము అధికమై ఉండాలి. భక్తుని 'ముద్ర' అతని సౌశీల్యతయే కదా. 'అలా సమర్పించబడిన దానిని నేను ప్రేమతో స్వీకరించి ఆరగిస్తాను' అన్నాడు గీతాచార్యుడు. ధనమున్న వ్యక్తి ఆర్భాటంగా చేసిన భోజన పదార్థాలని భగవంతుడు స్వీకరించడు.



అట్టహాసంగా ఆహ్వానించిన దుర్యోధనుని ఆహ్వానాన్ని శ్రీకృష్ణుడు మన్నించక సామాన్యుడైన విదురుని ఇంటికి వెళ్లి అతడు భక్తి ఆవేశంలో తబ్బిబ్బై పరధ్యానంగా ఇచ్చిన అరటి తొక్కలను ఆప్యాయంగా ఆనందంగా తృప్తిగా స్వీకరించలేదా? సుధాముని వద్ద అటుకులను లాక్కొని మరీ స్వీకరించలేదా? ద్రౌపది సమర్పించిన ఆకుకి అంటిన అన్నం మెతుకును ఆస్వాదించి అక్షయ పాత్రను ఇవ్వలేదా? శబరి తన్మయత్వంతో ఇచ్చిన ఎంగిలి ఫలములను తృప్తిగా స్వీకరించలేదా? 'ఇదే నా యావదాస్తి' అంటూ రంతిదేవుడు సమర్పించిన గుక్కెడు జలాన్ని స్వీకరించలేదా? భక్తి భావంతో భగవంతుడిని కట్టివేయగలంగానీ.. రత్నరాశులతో కాదని దీని అర్థం.

దేవుడు మన తృప్తి కోసం భుజిస్తున్నాడుగానీ ఆయనకు ఆకలి ఉంటుందా. భగవంతుడు 'దృష్ట్యా తృప్యతి' అన్నది మనమెరిగినదే. మనం సమర్పించినదానిని ఆ స్వామి అలా చూపులతోనే స్వీకరించి ఆఘ్రాణిస్తాడు. దానిని తన ప్రసాదంగా మారుస్తాడు. విద్యార్థి పద్య భాగాన్ని కంఠస్థం చేసిన తరువాత కూడా ఆ పాఠం, పాఠ్యాంశములో ఏ విధంగా మార్పు ఉండదో అదే విధంగా మనం సమర్పించిన భోజ్య పదార్థాలనైనా భగవంతుడు స్వీకరించాక పరిమాణంలో ఎలాంటి మార్పులూ ఉండవు. పైగా అది ప్రసాదంగా పరమోత్కృష్టంగా పరిణతి చెంది భక్తులకు కృతార్థత చేకూరుస్తుంది.



అత్యంత శుభప్రద మాసమైన రమజాన్‌కు అనేక విశిష్టతలు ఉన్నాయి. పవిత్ర అంతిమ దివ్య ఖుర్‌ఆన్, జకాత్ దానాలు అవతరించినదీ, రోజా వ్రతాన్ని ముస్లింలకు విధిగా నిర్ణయించినదీ, వెయ్యి మాసాల కన్నా విలువైన రాత్రి లైలతుల్ ఖద్ర్‌ను కలిగి ఉన్నదీ, ఫిత్రా ఆదేశాలు అమలులోకి వచ్చినదీ, తరావీహ్ నమాజులు ఆచరించేదీ ఈ నెలలోనే. పవిత్రమైన ఈ మాసంలో ఎవరు ధర్మనిష్ఠతో, ఆత్మ పరిశీలనతో, పరలోక ప్రతిఫలాపేక్షతో రమజాన్ రోజాలు పాటిస్తారో, వారు గతంలో చేసిన పాపాలను అల్లాహ్ మన్నిస్తాడు.

# దైవానుగ్రహం పొందాలంటే...

ఫ మహమ్మద్ వహీదుద్దీన్

### సహనం, నిగ్రహం పాటించాలి

రమజాన్ మాసం సహనాన్నీ, నిగ్రహాన్నీ పాటించవలసిన నెల. సహనానికి ప్రతిఫలం స్వర్గం. సమాజంలోని ఉపేక్షితుల పట్ల, బాధితుల పట్ల సానుభూతిని చూపించాలి. ఆరాధనలు, ఉపవాసాలు, గ్రంథ పారాయణలు మనిషి ఆంతర్యంలో పరివర్తన తెస్తాయి. మనిషి ఆలోచించే తీరు మారుతుంది. ఉన్నత ప్రమాణాలు అలవడతాయి. ఫలితంగా మనిషి ప్రవర్తనలో నైతికత, మంచితనం, ప్రశాంతత, నిష్ఠ, సదాచారం చోటు చేసుకుంటాయి. మానవాళి సర్వతోముఖాభివృద్ధికి, ఆధ్యాత్మికతకూ రమజాన్ మాసం దారి చూపిస్తుంది.

### ఖుర్‌ఆన్ ఆవతరణ

విశ్వప్రభువు సందేశమైన దివ్య ఖుర్‌ఆన్‌ను మానవాళికి ఈ మాసం అందించింది. ఖుర్‌ఆన్ అవతరణ సాధారణ విషయం కాదు. అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న ఆనాటి అరబ్బులను విజ్ఞాన పథంలోకి మార్చి, వారిని విద్యాపోషకులుగా, క్రమశిక్షణ దురంధరులుగా, సంస్కారవంతులుగా చేసింది. బాధితుల కోసం, అణగారిన వారికోసం పోరాడేలా మనుషుల్ని తీర్చిదిద్దింది. అవసరార్థుల కోసం ప్రేరణాత్మకమైన, విప్లవాత్మకమైన జీవన విధానాన్నీ, నిరాడంబరమైన నైతిక జీవితాన్నీ ప్రపంచానికి అందించింది.

'సదఖా' అంటే దాన ధర్మాలు: "విశ్వసించిన ప్రజలారా! మీరు సంపాదించిన ధనంలో, మేము మీకొరకు నేల నుండి ఉత్పత్తి చేసిన దానిలో మేలైన భాగాన్ని దైవమార్గంలో ఖర్చు పెట్టండి. (పవిత్ర అంతిమ దివ్య ఖుర్‌ఆన్ 2.:267)

"అల్లాహ్ ప్రజలపై సదఖాను విధించాడు. అది ధనికుల నుంచి వసూలు చేసి, నిరుపేదలకు తిరిగి అందజేయడం జరుగుతుంది" అని అంతిమ దైవప్రవక్త ప్రబోధించారు.

### తరావీహ్ నమాజ్:

రమజాన్ నెలలో తరావీహ్ నమాజ్ పుణ్యం రీత్యా ఎంతో ఘనమైనది. దాన్ని నెరవేర్చాల్సిందిగా హదీసుల్లో తాఖీదు చేయడం జరిగింది. అప్పట్లో అది కేవలం నఫిల్ నమాజు మాత్రమే. దాన్నే 'రమజాన్ నమాజు'గా పేర్కొన్నారు. తరువాత కాలంలో అది 'తరావీహ్ నమాజు'గా నామాంతరం చెందింది. 'తరావీహ్' అనేది 'తర్వీహ్' అనే పదానికి బహువచనం. దానికి 'విశ్రాంతి', 'విరామం' అని అర్థం. మహా ప్రవక్త అనుచరులు ఆయన సంప్రదాయానుసారం చాలాసేపు నిలబడి నమాజు చేసేవారు. నాలుగు రకాతులు చేశాక, కాసేపు విశ్రాంతి తీసుకొనేవారు.

### లైలతుల్ ఖద్ర్:

'లైలతుల్ ఖద్ర్' అంటే 'సౌభాగ్యాల, దౌర్భాగ్యాల నిర్ణయం జరిగే రాత్రి' లేదా 'అదృష్టాలను మెరుగుపరిచే లేదా వాటిని చెరిపివేసే రాత్రి' అని అర్థం. రమజాన్ చివరి పది రాత్రులలోని బేసి రాత్రులు 21, 23, 25, 27, 29 రాత్రులను 'లలైతుల్ ఖద్ర్'గా పాటిస్తారు.

### ఏతెకాఫ్:

రమజాన్ మాసంలోని చివరి పదిరోజులు ఒక నిర్ణీత సమయంలో దైనందిన కార్యక్రమాలన్నిటికీ దూరమై, ఉపవాసంతో మస్జిద్‌లోనే ఉండి, తన హృదయాన్నీ, ఆత్మనూ కలిపి ఏకాగ్రతలో



మునిగిపోవడమే 'ఏతెకాఫ్'. దైవ ప్రవక్త ఈ మాసంలోని చివరి పదిరోజులూ ఏతెకాఫ్ చేసేవారు.

### 'తఖ్వా' (దైవభీతి) అంటే ఏమిటి?

పవిత్ర రమజాన్ మాసం వచ్చిందంటే విశ్వాసి హృదయం నిష్ఠతో, తఖ్వా (దైవభక్తి)తో నిండిపోతుంది. దైవ ప్రవక్త తన ఛాతీ వైపు చూపుతూ మూడుసార్లు "అత్తక్వా హాహునా" అని అన్నారు. అంటే అది హృదయంలో ఉంటుందని అర్థం.

**ఉపవాస విధి:** ఉపవాసాన్ని అరబ్ భాషలో 'సౌమ్' అంటారు. 'ఆగిపోవడం', 'నియంత్రించుకోవడం' అని ఆ పదానికి అర్థం. ఈ నెలలో ఆహార పదార్థాలకు కొంచెం దూరంగా ఉండడమే కాదు, తమను తాము చెడు నుంచీ దూరంగా ఉంచుకోవాలి.

**సహరీ అంటే...:** రాత్రి నలుపురేఖల నుంచి ఉషోదయపు ధవళ రేఖలు ప్రస్ఫుటం అయ్యే వరకూ ఏదైనా తినవచ్చు, తాగవచ్చు. తరువాత వీటన్నిటినీ త్యజించి, చీకటి పడే వరకూ ఉపవాసాన్ని కొనసాగించి, పూర్తి చేయాలి. ఆ ఉపవాస ప్రారంభ సమయాన్ని 'సహరీ' అంటారు.

**ఇఫ్తార్ అంటే...:** సూర్యుడు అస్తమించిన తరువాత ఉపవాసాన్ని విరమించడాన్ని 'ఇఫ్తార్' అంటారు. సూర్యుడు అస్తమించినట్టు తెలిస్తే, ఉపవాసాన్ని వెంటనే విరమించాలి. అనవసరంగా ఆలస్యం చెయ్యడం ధర్మ సమ్మతం కాదు.

**ఫిత్రా... నిరుపేదల హక్కు:** ఫిత్రా దానం పేదల పాలిట పెన్నిధి. వారు పండగ పూట పస్తులు ఉండకుండా, అందరితో పాటు వారు కూడా సంతోషంగా గడపడం కోసం దైవం దీన్ని విధిగా చేశాడు. ఫిత్రా దానం వల్ల మూడు ప్రయోజనాలు కలుగుతాయి. మొదటిది విశ్వాసి ఫిత్రా చెల్లించి, తన ఆనందాన్ని ప్రటిస్తూ, అల్లాహకు కృతజ్ఞతలు తెలుపుకొంటాడు. రెండవది: ఉపవాస స్థితిలో జరిగిన పొరపాట్లు ఫిత్రా చెల్లించడం వల్ల దూరం అవుతాయి. మూడవది: ఇది నిరుపేదల ఇళ్ళలో సంతోషాన్నీ, ఆనందాన్నీ నింపుతుంది. వారు సంతోషంగా పండగ జరుపుకోవడానికి ఉపయోగపడుతుంది.

**అసమానతలను తొలగించే సాధనం జకాత్:** 'జకాత్ అనే' మాట 'జక' నుంచి వచ్చింది. 'జక' అంటే 'పెరగడం', 'ఎదగడం', 'వృద్ధి చెందడం', 'వ్యాపించడం' అనే అర్థాలు ఉన్నాయి. ఇస్లాంలోని అయిదు మూల స్తంభాలలో జకాత్ ఒకటి. 'జకాత్' అంటే ప్రతి ధనవంతుడు తన ధనంలోంచి కొంత భాగాన్ని అవసరమైన వారికి ఇవ్వడం. నిర్ణీత సమయంలో, నిర్ణీత మొత్తంలోంచి, నిర్ణీత ప్రజలకు ఇచ్చే ధనమే జకాత్.

# క్షమించమని కోరదాం!

**యేసు ప్రతిపాదించిన, బోధించిన క్షమ, ప్రేమ సిద్ధాంతం 'సూక్ష్మ స్థాయిలో వ్యక్తిని, అతని ద్వారా మరో వ్యక్తిని!' అన్న అత్యంత ఆచరణాత్మక విధానంలో క్షేత్ర స్థాయి నుండే ఉద్యమంగా నిర్మితమయింది. అది మొత్తం సమాజమంతా వ్యాపించాలన్నదే యేసు ప్రభువు ఆత్మీయ వ్యూహం.**

చాలాసార్లు అవిశ్వాసమే పాపం చెయ్యడానికి మూలకారణమవుతుంది. యూదా ఇస్కరియోతు అనే శిష్యుడు యేసుప్రభువును ముప్పై వెండి నాణేలకు అమ్మేయడానికి కారణం, మూడున్నరేళ్లు ఆయనతో కలిసి జీవించినా ప్రభువుపట్ల, ఆయన బోధలపట్ల అతనికి విశ్వాసం కలుగకపోవడమే! అందుకే అతను ప్రభువుకు ద్రోహం ఒడిగట్టి, పాపం చేశాడు. యేసుక్రీస్తుకు ఉన్న ప్రజాదరణ, జనాకర్షణ శక్తి సాయంతో రోమా సామ్రాజ్యాన్ని ఎలా కూలదోయాలన్న దురాశే తప్ప ... పగ, ప్రతీకారం, హింసావాదంతో నిండిన లోకాన్ని ప్రేమ, క్షమాపణతో నింపి ఒక దైవరాజ్యాన్ని సృష్టించాలన్న సదాశయంతో సాగుతున్న యేసుప్రభువు ఆత్మీయోద్యమ సన్నాహాలు, ప్రయాస అంత సన్నిహితంగా ఉన్నా యూదా బుర్రకు ఎక్కలేదు. రోమా సామ్రాజ్యాన్ని కూలదోస్తే మొత్తం సమాజం మారిపోతుందా? ప్రజలంతా శాంతితో నిండిపోతారా? అంతకన్నా దుర్మార్గమైన, దౌర్జన్యపూరితమైన మరో సామ్రాజ్యం వస్తుంది. కాని ప్రజల ఇక్కట్లు మాత్రం తీరవు, వారి పరిస్థితులు మారవు కదా? 'తిరుగుబాటుతో, దురాక్రమణతో, దౌర్జన్యంతో, హింసాత్మకతతో, అధికారంతో, ఆయుధాలతో సామ్రాజ్యాల్ని నిర్మించాలి కానీ, క్షమాపణ, ప్రేమతో నిర్మించడమేమిటి? అవి బలహీనుల లక్షణాలు కదా? ఇంతేనా ఇతనికి తెలిసింది?' అనుకున్నాడు యూదా. యేసు చెడ్డవాడని అతను ఎప్పుడూ అనుకోలేదు. కాకపోతే ఆయన బలహీనుడు, ఆయనవి రోమా మహా సామ్రాజ్యం ముందు దూదిలాగా తేలిపోయే సిద్ధాంతాలనుకున్నాడు. యేసు వల్ల ఇక లాభం లేదనుకొని ఆయన్ని అమ్మేశాడు. పైగా రోమా పాలకులు, యూదు మత నాయకులు కుమ్మక్కై యేసుకు మరణ శిక్ష విధిస్తారని కూడా అతడు అనుకోలేదు. ఎందుకంటే యూదు లేఖనాలు బాగా ఎరిగిన మేధావిగా... మరణశిక్షకు తగిన నేరమేదీ యేసు ప్రభువు ఏమీ చెయ్యలేదని యూదాకు బాగా తెలుసు. కాని ఆయనకు మరణ శిక్ష విధించి అత్యంత క్రూరంగా శిలువ వేసి అమలు జరుపుతుంటే, కొరడాలతో కొట్టేవారిని, మొహం మీద ఉమ్మేసేవారిని, అన్యాయంగా దుయ్యబట్టేవారిని అంత కన్నా దౌర్జన్యపూరితంగా ఎదురాడి దూషించడం ఎంత సులభమో, 'వారిని క్షమించ'మంటూ దేవుణ్ణి ప్రార్థించడం ఎంత కష్టమో కొద్ది గంటల్లోనే అతనికి అర్థం అయింది!! తాను



చేసిన దానికి చింతిస్తూ వెంటనే యూదు అధికారుల వద్దకు పరుగెత్తుకెళ్లి, నేను నిరపరాధి రక్తాన్ని చిందించానంటూ, ఆ ముప్పై నాణేలు వారికి తిరిగి ఇచ్చేసి, ఎంతగా ప్రాధేయపడినా లాభం లేకపోయింది. అప్పటికే బాగా ఆలస్యమైందని గ్రహించి, తన పాపానికి ప్రాయశ్చిత్తం లేదన్న భావనతో యూదా ఉరివేసుకొని చనిపోయాడు.

ఒకవైపు యేసుప్రభువు ఆత్మసమర్పణ చేసుకొని, సర్వలోక పాప పరిహారార్థం మొదలెట్టిన క్షమా ఉద్యమంలోకి... ఆయనకు కుడివైపున శిలువ వేసిన ఒక గజదొంగ ప్రభువును వేడుకొని, మొదటి సభ్యుడుగా చేరిపోయి, పరలోక ప్రవేశార్హతను పొందాడు. ప్రభువుకు అత్యంత సన్నిహితుడు, ఆయన శిష్యుడు అయినా, పశ్చాత్తాపం పొంది ఆ ఉద్యమంలో చేరే అవకాశం ఉన్నా దాన్ని వాడుకోలేకపోయిన అభాగ్యుడయ్యాడు యూదా. పశ్చాత్తాపంతో మళ్ళీ యూదుల వద్దకు పరుగెత్తే బదులు శిలువలో ఉన్న యేసు వద్దకు పరుగెత్తుకొని వచ్చి ఉంటే యూదాకు కూడా క్షమాపణ, పరలోక భాగ్యం తప్పక దొరికేవి కదా!!

మరో శిష్యుడైన పేతురు ఈ విషయంలోనే యూదా కన్నా తెలివైనవాడు, ఆత్మీయ పరిజ్ఞానం కలవాడినని నిరూపించుకున్నాడు. యేసు ఎవరో తాను ఎరుగనంటూ ఆ రాత్రి కోడి కూయక ముందు ముమ్మారు బొంకిన పేతురు... ప్రభువు చూసిన ఒక్క చూపుతో తన పాపాన్ని తెలుసుకొని, సంతాపపడి, బయటికి వెళ్లి విలపిస్తూ ఏడ్చాడు (లూకా 22:62) తప్పు చేశానని యూదా బాధపడ్డాడు. తాను పాపం చేశానని పేతురు పశ్చాత్తాపంతో ఏడ్చాడు. అదే వారిద్దరికీ తేడా. క్షమాపణకు అదే అర్హత! గొప్ప మేధావి అయినా యూదాకు యేసు బోధల ఆంతర్యం, ప్రభువు హృదయం అర్థం కాలేదు. కాని పామరుడైనా యేసు హృదయాన్ని అర్థం చేసుకున్న పేతురు ప్రభువు సామ్రాజ్యంలో భాగం అయ్యాడు. యేసు హృదయం అర్థం కాకపోతే ఆయన ఉద్యమంలో భాగం కాలేము.. ఆయన ఉద్యమంలో భాగం కాకుండా విశ్వాసులం అసలే కాలేము.

**ఒకవైపు యేసుప్రభువు ఆత్మసమర్పణ చేసుకొని, సర్వలోక పాప పరిహారార్థం మొదలెట్టిన క్షమా ఉద్యమంలోకి... ఆయనకు కుడివైపున శిలువ వేసిన ఒక గజదొంగ ప్రభువును వేడుకొని, మొదటి సభ్యుడుగా చేరిపోయి, పరలోక ప్రవేశార్హతను పొందాడు. ప్రభువుకు అత్యంత సన్నిహితుడు, ఆయన శిష్యుడు అయినా, పశ్చాత్తాపం పొంది ఆ ఉద్యమంలో చేరే అవకాశం ఉన్నా దాన్ని వాడుకోలేకపోయిన అభాగ్యుడయ్యాడు యూదా. పశ్చాత్తాపంతో మళ్ళీ యూదుల వద్దకు పరుగెత్తే బదులు శిలువలో ఉన్న యేసు వద్దకు పరుగెత్తుకొని వచ్చి ఉంటే యూదాకు కూడా క్షమాపణ, పరలోక భాగ్యం తప్పక దొరికేవి కదా!!**

# అల్లు అర్జున్ ఇంటికి వెళ్లిన చిరంజీవి

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 విడుదల రోజున జరిగిన ఘటనకు సంబంధించి కథానాయకుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అరెస్ట్ అనంతరం బన్నీని పోలీసులు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నారు. స్టేట్‌మెంట్ రికార్డు అనంతరం అతడిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించనున్నట్లు తెలిసింది. వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి కోర్టు ముందు హాజరుపర్చనున్నారు. ఈ మేరకు అల్లు అర్జున్‌ను రిమాండ్‌కు తరలించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అయితే అల్లు అర్జున్ కోసం ఇప్పటికే తన తండ్రి అల్లు అరవింద్‌తో పాటు తమ్ముడు అల్లు శిరీష్ కూడా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన విషయం తెలిసిందే.

తాజాగా ఈ విషయం తెలిసిన మెగాస్టార్ చిరంజీవి కూడా అల్లు అర్జున్ కోసం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు



బయలుదేరగా.. చిరంజీవి వస్తే.. ట్రాఫిక్ సమస్యలతో పాటు అతడిని చూడడానికి జనాలు రానుండటంతో అతడిని పోలీస్ స్టేషన్‌కు రావొద్దని అభ్యర్థించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే స్టేషన్‌కు రాకుండా అల్లు అర్జున్ ఇంటికి వెళ్లాడు చిరంజీవి. విశ్వంభర షూటింగ్‌లో ఉన్న చిరు ఈ విషయం తెలియగానే షూటింగ్ మధ్యలో ఆపి బన్నీ ఇంటికి వచ్చినట్లు తెలుస్తుంది.

చిరంజీవితో పాటు అతడి భార్య సురేఖ కూడా రాగా.. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి.



# సంక్రాంతికి మీ ఇంటికొస్తున్నాం : విక్టరీ వెంకటేశ్

క్లాస్, మాస్, కామెడీ, ఫ్యామిలీ.. ఇలా అన్ని జోనర్లలో సినిమాలు చేస్తూ కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్. తనదైన కామిక్ స్టైల్ ఆఫ్ యాక్షన్‌తో ఎంటర్‌టైన్ చేసే వెంకీమామ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఇండస్ట్రీ ప్రముఖులు, అభిమానులు, మూవీ లవర్స్, ఫాలోవర్లు వెంకీ మామకు బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు. తాజాగా అనిల్ రావిపూడి టీం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ సంక్రాంతికి వస్తున్నాం నుంచి మీను సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. మీనాక్షి చౌదరి గురించి ఈ పాట ఉండబోతున్నట్టు ప్రోమో చెబుతోంది. సాంగ్‌లో వెంకీ పోలీసాఫీసర్‌గా సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తూ ఘర్షణ సినిమాను మరోసారి గుర్తుకు తెస్తున్నాడు. ఇప్పటికే గోదారి గట్టు మీద రామసిలకవే.. ఓ.. గోరింటాకెట్టుకున్న సందమామవే అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌కు నెట్టింట సూపర్ రెస్పాన్స్ వస్తోంది. భాస్కర భట్ల రాసిన ఈ పాటను రమణ గోగుల, మధుప్రియ పాడగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. ఈ మూవీ 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.

# దుస్తులు మార్చుకోవటానికీ టైం ఇవ్వరా..? : అల్లు అర్జున్



సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో చిక్కడపల్లి పోలీసులు సినీ నటుడు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని తెలిసిందే. అయితే అరెస్ట్ చేసే సమయంలో బన్నీ నివాసం దగ్గర హైడ్రామా కొనసాగింది. పోలీసుల తీరుపై అల్లు అర్జున్ అసహనం వ్యక్తం చేశాడు. పోలీసులు తనను తీసుకెళ్లడంలో అభ్యంతరం లేదన్న అల్లు అర్జున్ ఉన్న పళంగా తమతో రావాలంటే ఎలా..? దుస్తులు మార్చుకునేందుకు అవకాశం కూడా ఇవ్వరా..? అంటూ ప్రశ్నించాడు.

దీంతో పోలీసులు అల్లు అర్జున్ బెడ్‌రూం వరకు వెళ్లి డ్రస్ మార్పించి టీ షర్ట్, షార్ట్‌లో పీఎస్‌కు తీసుకెళ్లారు. అల్లు అర్జున్‌తోపాటు తండ్రి అల్లు అరవింద్ కూడా వాహనం ఎక్కాడు. అయితే తండ్రిని వాహనం ఎక్కొద్దంటూ వారించి కిందికి దించేశాడు. ఏం జరిగినా.. మంచైనా చెడైనా అంతా నాదేనంటూ చెప్పాడు. పోలీసుల రాక నేపథ్యంలో బన్నీ సతీమణి స్నేహారెడ్డి కన్నీళ్లు పెట్టుకుంది. దీంతో ఆమెను దగ్గరకు తీసుకొని ధైర్యం చెప్పాడు అల్లు అర్జున్.



# గూస్‌బంప్స్ తెప్పిస్తున్న డాకు మహారాజ్

బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తోన్న చిత్రం డాకు మహారాజ్. ఎన్‌బీకే 109గా వస్తోన్న ఈ చిత్రంలో బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. సంక్రాంతి కానుకగా 2025 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు. డేగ డేగ డేగ.. అంటూ సాగుతున్న ప్రోమో గూస్ బంప్స్ తెప్పిస్తోంది. అనంత్ శ్రీరామ్ రాసిన ఈ పాటను నకాశ్ అజీజ్ పాడాడు. బాలకృష్ణ గండ్రగొడ్డుళ్లు పట్టుకొని సమరంలో ఉన్న లుక్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, శ్రద్ధా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు.

ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మేకర్స్ యూఎస్‌ఏ టెక్సాస్‌లోని డల్లాస్‌లో 2025 జనవరి 4న Texas Trust CU Theatreలో సాయంత్రం 6 గంటల నుంచి ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు.

# గాయపడ్డ జర్నలిస్టుకు మోహన్‌బాబు లేఖ

మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో టీవీ9 జర్నలిస్ట్ రంజిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో ఆగ్రహించిన జర్నలిస్ట్ సంఘాలు.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్



చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాడి ఘటనలో గాయపడిన జర్నలిస్ట్‌కు మోహన్‌బాబు ఎట్టకేలకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. కుటుంబ వివాదం ఘర్షణకు దారి తీసినట్లు చెప్పారు. ఈ ఘటనలో ఓ జర్నలిస్ట్ సోదరుడు గాయపడటం తనకు బాధ కలిగించిందని అన్నారు. ఈ ఘటన తర్వాత అనారోగ్యం కారణంగా 48 గంటల పాటు ఆసుపత్రిలో చేరడంతో వెంటనే స్పందించలేకపోయానని వివరణ ఇచ్చారు. ఆ రోజు తన ఇంటిగేటు విగిరిపోయిందని.. దాదాపు 30 నుంచి 50 మంది వ్యక్తులు ఇంట్లోకి చొచ్చుకొచ్చినట్లు వివరించారు. ఆ సమయంలో సహనాన్ని కోల్పోయినట్లు చెప్పారు. పరిస్థితి అదుపు చేసే క్రమంలో జర్నలిస్ట్‌కు గాయమైందని.. ఇది చాలా దురదృష్టకరమన్నారు. అతడికి, ఆయన కుటుంబానికి కలిగిన బాధకు తాను తీవ్రంగా చింతిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. గాయపడ్డ జర్నలిస్ట్ త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా మోహన్‌బాబు కాంక్షించారు.

# పవన్ ఓజీలో జపనీస్, థాయ్ యాక్టర్లు

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ క్రేజీయెస్ట్ ప్రాజెక్ట్ ఓజీ. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా.. థాయ్‌లాండ్, బ్యాంకాక్‌లో షూటింగ్ లొకేషన్ స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా సినిమాటోగ్రఫర్ రవి కే చంద్రన్ ఆసక్తిక వార్తను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఓజీ సినిమాటోగ్రఫర్ రవి కే చంద్రన్ వారితో దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశాడు. ఇంతకీ ఈ క్రేజీ యాక్టర్లు ఓజీలో ఎలాంటి పాత్రల్లో కనిపించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పుడీ వార్తతో సినిమాపై హైప్ మరింత పెరిగి పోతుంది. ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. శ్రియారెడ్డి కీలక పాత్రలో నటిస్తుంది. ఓజీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. మేకర్స్ చాలా కాలం క్రితం లాంచ్ చేసిన ఓజీ.. పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు.



# నేను ఎక్కడికీ వెళ్లినా శాఖాహారినే

**- సాయిపల్లవి**

ప్రేమమ్, ఫిదా సినిమాలతో సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసింది కోలీవుడ్ భామ సాయిపల్లవి. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్న ఈ భామ శ్యామ్ సింగరాయ్ సినిమాతో హిందీలో కూడా ఎంట్రీ ఇచ్చింది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న సాయిపల్లవి ఓ సినిమా షూటింగ్ సందర్భంగా జపాన్‌లో తనకెదురైన ఓ సంఘటనను అందరితో షేర్ చేసుకుంది. చిట్‌చాట్‌లో సాయిపల్లవి మాట్లాడుతూ.. జపాన్‌లో ఒక నెలపాటు షూటింగ్ చేశా. అక్కడ శాఖాహారం దొరకలేదు. శాఖాహారంలో కూడా చికెన్ బ్రాత్ వాటర్‌తో వండారా..? అయితే నేను తినను ఫర్వాలేదన్నా.. ఎందుకంటే ఒక జంతువు చంపి తినడంలో వచ్చే ఆరోగ్యం నాకొద్దనిపిస్తుంది. అందుకే నేనెప్పటికీ శాఖాహారినే. నేనెక్కడికెళ్లినా శాఖాహారినే. ఓ జీవి చనిపోతే నేను తట్టుకోలేనంది. ఇంకో వ్యక్తిని హర్ట్ చేయడం.. పబ్లిక్‌గా ఇబ్బంది పెట్టానంటే నాకు నేను వెళ్లి ఏం అనుకోకండి అని చెప్తా. నాకు ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. నా ఎమోషన్స్ విషయంలో ఎప్పుడూ కాంప్రమైజ్ అవ్వను. రోజూ



మెడిటేషన్ చేయకపోతే కొంచెం అన్‌బ్యాలెన్స్ (అసమతుల్యం)గా ఉన్నట్టు అనిపిస్తుందంటూ చెప్పుకొచ్చింది. ఇటీవలే అమరన్‌తో గ్రాండ్ సక్సెస్ అందుకున్న సాయిపల్లవి ప్రస్తుతం నాగచైతన్యతో తండేల్ సినిమాలో నటిస్తోంది. ఈ మూవీ 2025 ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com